

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 286 | మంగళవారం | 16-09-2025 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



అమృత్‌సర్, గుర్దాస్‌పూర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటన 05

ఐటి ఒప్పందంలో అమెరికా బాటలో నడవాలి




## గ్రామాలలో వీధి దీపాల బాధ్యతలు సర్పంచ్‌లకే

- రాష్ట్రంలో అన్ని ఎల్ఇడి లైట్లు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం
- కొత్త ఎల్ఇడిల ఏర్పాటు, వాటి నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీ పరిధిలోనే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మున్సిపల్, పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచ్‌లకే అప్పగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ఎల్ఇడి లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని సమర్థవంతంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని, రాష్ట్రంలోని ఎల్ఇడి వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఇడి లైట్లు వెలుగుతున్నాయా? లేదా?, ఇంకా కొత్తగా ఎన్ని అవసరం అనేది సమగ్రంగా అంచనా వేయాలని, ప్రతి పోల్ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను సిఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎంఒ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీ జన పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఇడి లైట్లు ఉన్నాయని, వరంగల్, నల్లగొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో తరువాయి 2లో

## వక్ఫ్ సవరణ చట్టం–2025

# కీలక నిబంధనలు నిలిపివేత




- వక్ఫ్ దాతకు ఐదేళ్ళ అర్హత నిబంధన ఏకపక్షమే
- వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు నలుగురు మించకూడదు
- సిఇఒల నియామకంలో ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా పలువురు వేసిన పిటిషన్లపై సుప్రీం ఉత్తర్వులు
- మొత్తం చట్టం అమలు నిలిపివేతకు తిరస్కృతి

**న్యూఢిల్లీ:** మతాలమధ్య ఉద్రిక్తతలు,ఘర్షణలకు దారితీసేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్(సవరణ)చట్టం–2025లో ఉన్న అనేక అభ్యంతరకరమైన నిబంధనలలో కొన్నింటిపై సుప్రీం కోర్టు స్టే మంజూరు చేసింది. ముఖ్యంగా, ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నవారు మాత్రమే వక్ఫ్ ఆస్తులు సృష్టించేందుకు అర్హులని కొత్తగా సవరణచట్టంలో తీసుకువచ్చిన నిబంధనతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను అమలు చేయకుండా స్తంభింపజేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టి న్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం ఉత్తర్వు ఇచ్చింది. వక్ఫ్ ఆస్తుల ప్రతిపత్తిని నిర్ధారించడానికి కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను కూడా ధర్మాసనం స్తంభింపజేసింది. మరొక నిబంధన ప్రకారం సంబంధిత వక్ఫ్ ఆస్తి గనుక ప్రభుత్వ ఆస్తి అని నిర్దేశిత అధికారి నిర్ణయిస్తే, ఆ అధికారి రెవెన్యూ రికార్డులలో అందుకు తగినట్లుగా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదికను తక్షణం సమర్పించాలని ఆదేశించింది. లేకపోతే ఇది తదుపరి హైకోర్టు ఉత్తర్వులకు కట్టుబడుతుందని వివరించింది. కేంద్ర వక్ఫ్ బోర్డులో ఉండే మొత్తం 20 మంది సభ్యులలో ముస్లిమేతరులు నలుగురు కంటే ఎక్కువమంది ఉండకూడదని,రాష్ట్రాలలోని వక్ఫ్ బోర్డులలో ఉండే మొత్తం 11 మంది సభ్యులలో ముస్లిమేతరులు ముగ్గురు కంటే ఎఓక్కువమంది ఉండకూడదని ఆదేశించింది. కాగా సెక్షన్ 23 నిబంధనపై స్టే ఉత్తర్వు ఇవ్వకుండా, వక్ఫ్‌బోర్డుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నియామకాలపై తరువాయి 2లో

### సిపిఐ వైఖరి ప్రామాణికమని రుజువైంది

సుప్రీం తీర్పుపై సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం హర్షం



**న్యూఢిల్లీ:** వక్ఫ్ శాసనాలపై భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) వైఖరి ప్రామాణికమైనదని సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రుజువైందని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో పేర్కొంది. వక్ఫ్ సవరణ చట్టం–2025లో అభ్యంతరకరమైన కొన్ని నిబంధనల అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేయడంపై హర్షం ప్రకటించింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో

### వక్ఫ్‌భూములపై కేంద్రం కుట్రకు ఎదురుదెబ్బ: కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టం2025పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. వక్ఫ్ భూముల లాక్కోవడానికి చేసిన ప్రయత్నానికి చెక్ పెట్టేలా సుప్రీం ఉత్తర్వులు ఉన్నాయని కాంగ్రెస్ వెల్లడించింది. ఈ చట్టంలో కీలక నిబంధనలపై సుప్రీం పాక్షికంగా స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నట్లు వామపక్షాలు పేర్కొన్నాయి. మైనారిటీలతో, భాగస్వామ్య సంఘాలతో సంప్రదింపులు జరపకుండా వక్ఫ్ వవరణ చట్టాన్ని బిజెపి హడావిడిగా తీసుకొచ్చిందని రుజువైందని వ్యాఖ్యానించాయి. సుప్రీం కోర్టు ప్రశ్నలకు, తరువాయి 2లో


రాజ్యాంగ విలువలకు రక్షణ : డిఎంకె

తుది తీర్పుపై ఆశలు : ముస్లిం లా బోర్డులు

మాకు సమస్య లేదు : మునంబం వాసులు


## వైద్యం వికటించి విద్యార్థిని మృతి

- ఆర్ఎంపి వైద్యుడి నిర్వాకంతో ప్రాణాలు విడిచిన బాలిక
- సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో ఘటన

ప్రజాపక్షం/ (చిలుకూరు) కోదాడ

ఆరోగ్య పరిస్థితి పూర్తిగా అంచనా వేయకుండా ఓ ఆర్ఎంపి డాక్టర్ ఇంజెక్షన్ చేయడంతో బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం రామాపురానికి చెందిన షేక్ సుహానా(14) నడిగూడెం కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా విపరీతమైన జ్వరంతో బాధ పడుతున్న ఆ బాలిక మూడు రోజుల



క్రితం చిలుకూరు మండలం బేతవోలులోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. అక్కడ వైద్యం చేయించుకుటున్న ఆమె ఆరోగ్య పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్ఎంపి దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే బాలికకు డెంగీ పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో నిర్ధరణ అయింది. దీంతో బాలిక సరైన తరువాయి 12లో

## ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు

- మూడురోజుల పాటు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తూర్పు తెలంగాణ సమీపంలోని విదర్భ ప్రాంతంలో ఉన్న అల్పపీడనం ఇప్పుడు బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతోంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ, సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో కేంద్రీకృతమై ఉంది. మరోవైపు, ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ మహారాష్ట్ర వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం ఈ రోజు బలహీనపడింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా



ల్లో ఈ మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు తరువాయి 12లో

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యలు సరికాదు

- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ విముక్తి పోరాటం లో 4 వేల మంది వీర యోధు లు తమ ప్రాణాలను తృణప్రాయంగా ఆర్పిస్తే వారి త్యాగాలను స్మరించాల్సిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆర్ఎస్ఎస్ తొత్తుగా మాట్లాడడం సరికాదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను విముక్తి చేసిన ఉద్యమంపై గవర్నర్ అలా మాట్లాడడం ఆర్ఎస్ఎస్ అజెండాను మోయడమే అవుతుందని పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ ను నిషేధించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో రాజకీయం చేయడం సిగ్గు చేటని పేర్కొన్నారు. తెలంగాణ, ఎపి కేరళ, తమిళనాడు సహా తరువాయి 12లో

## ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు సఫలం

- ఫీజు రియింబర్స్‌మెంట్ టోకెన్లకు సంబంధించిన రూ. 600 కోట్లను త్వరితగతిన విడుదల చేస్తాం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- భవిష్యత్తులోను ప్రతినెలా పెండిగ్ బిల్లులు చెల్లించాలని నిర్ణయించామని స్పష్టీకరణ
- కళాశాలల బంద్ విరమించుకుంటున్నట్లు యాజమాన్యాల ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రైవేటు కళాశాల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ చర్చలు సఫలమయ్యాయి. రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సమస్యలను, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రియింబర్స్‌మెంట్ టోకెన్లకు సంబంధించిన రూ. 600 కోట్లను త్వరితగతిన విడుదల తరువాయి 12లో

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు

- బోధన రుసుం బకాయిలు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి
- కాలేజీల బంద్‌ను నివారించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ నిరసన ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యార్థుల బోధన రుసుంతో పాటు స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి వారి భవిష్యత్తును కాపాడాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను విడుదల తరువాయి 2లో






## టర్కీ దేశాధ్యక్షుడు రాజీనామా చేయాల్సిందే

### అంకారాలో వేలాదిమంది నిరసన ప్రదర్శన

**అంకారా:** టర్కీలో ప్రతిపక్షాలను అణచివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఆ దేశ రాజధాని అంకారాలో వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు. ప్రధాన ప్రతిపక్షం రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సిహెచ్‌పి) నాయకుడు ఓజుర్గ్ ఓజుల్‌ను కేసుల్లో ఇరికించేందుకు ప్రభుత్వమే కుట్ర చేసిందని దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ తన పదవికి రాజీనామా చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. అంకారాలోని టాండోగాన్ స్క్వేర్ వద్ద 50,000 మందికిపైగా ప్రజలు గుమిగూడి సభ నిర్వహించారు. రెండు దశాబ్దాలకుపైగా అధికారంలో కొనసాగుతున్న ఎర్డొగాన్ దేశ సైన్యం, న్యాయస్థానం, కేంద్ర బ్యాంకు,మీడియా సహా ఇతర ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకుని తరువాయి 12లో

## మావోయిస్టు సీనియర్ కమాండర్ సహదేవ్ ఎన్‌కౌంటర్

- మరో ఇద్దరు నక్సల్స్ మృతి
- సహదేవ్ తలపై రూ. కోటి రివార్డు



**రాంచి:** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన ముగ్గురు మావోయిస్టులను జార్ఖండ్ రాష్ట్ర హజారీబాగ్ జిల్లాలో భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. వీరిలో సీనియర్ క మాండర్ సహదేవ్ సోరెన్ కూడా ఉన్నారు. 209 బెటాలియన్ కో బ్రా దళాలు గోర్హర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతిత్రి అడవుల్లో జా యింట్ ఆపరేషన్ చేపట్టగా ఈ ఘటన చోటుచేసుకొంది. సహదేవ్ సోరెన్‌ను మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా భావిస్తున్నారు. ఆ యనపై రూ.1 కోటి రివార్డు ఉంది. ఇక మరో మావోయిస్టు రఘునాథ్ హేమంబరం స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు. ఆయనపై రూ.25లక్షల బహుమతి ఉంది. ఇక జోనల్ కమిటీ సభ్యుడు విర్సెన్ గంజూ కూడా వీరిలో ఉన్నాడు. ఆయనపై ప్రభుత్వం రూ.10లక్షల బహుమతిని ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్ స్థలిలో తాము మూడు ఎకె 47 రైఫిళ్లను తరువాయి 2లో


ఇసి పద్ధతి చట్టవిరుద్ధమైతే ఎస్ఐఆర్ పూర్తిగా రద్దు 11

హెచ్చరించిన సుప్రీంకోర్టు


## కేంద్రమంత్రి బండిపై కెటిఆర్ పరువునష్టం దావా

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. బండి సంజయ్‌తో పాటు కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాములపైన కూడా దావాను



దాఖలు చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశించినవని 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పలేదని కెటిఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం తరువాయి 2లో

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

**25వ కాంగ్రెస్**

21–25 సెప్టెంబర్, 2025

చండీఘడ్ (పంజాబ్)

16వ కాంగ్రెస్ - న్యూఢిల్లీ, 1995 – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ దాడులు శాంతికి విఘాతం
### దోహాలో అరబ్ దేశాల సదస్సు తీర్మానం

**దోహా:** ఇజ్రాయెల్ దాడులవైఖరి మధ్యప్రాచ్యంలో శాంతి—సహజీవనాలకు (పీస్ అండ్ కో—ఎగ్జిస్టెన్స్)పెద్ద విఘాతంగా మారిందని దోహాలో సోమవారం జరిగిన అరబ్—ఇస్లామిక్ దేశాల సదస్సు తీర్మానించింది. ఇజ్రాయెల్‌ను అదుపు చేయాల్సిన అవసరం ఉందని ప్రపంచదేశాలకు సదస్సు విజ్ఞప్తి చేసింది. అదేసమయంలో గాజాలో యుద్ధ విరమణకు హమాస్‌తో శాంతి చర్చల మధ్యవర్తిత్వం నుండి వైదొలగేది లేదని కూడా ఖతార్ ఒక స్పష్టత ఇచ్చింది. ఐతే దాడుల వైఖరిపై తీర్మానాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ ఈ సదస్సులో ఆచరణాత్మకమైన చర్యలు తీసుకునేందుకు తీర్మానం చేశారా? అనే విషయం పూర్తిగా స్పష్టం కాలేదు. ఈ సదస్సుకు ముందుగా ఆదివారంనాడు అరబ్ దేశాల విదేశీమంత్రుల సదస్సు కూడా జరిగింది.

ఖతార్ ప్రధానమంత్రి అల్ తహనీ గడచిన మంగళవారం దోహాలో దాడులు జరిగినప్పటినుండీ ఇజ్రాయెల్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచదేశాల మద్దతును ఆయన కూడగడుతున్నారు.

# వారం రోజుల్లో సిరియా ఎన్నికలు

## శాశ్వత రాజ్యాంగ రూపకల్పన

**డమాస్కస్:** పశ్చిమ ఆసియా దేశం సిరియా పార్లమెంటుకు ఈనెల మూడోవారంలోపు పరోక్ష ఎన్నికలు జరుగుతాయి. అంతర్జాతీయ సంస్థలు ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తాయి. సిరియా దేశ భవిష్యత్తును మలుపు తిప్పే అత్యంత కీలకమైన ఎన్నికలు ఇవే. సిరియాలో ప్రజాస్వామ్య ప్రక్రియ సానుకూలంగా ముందుకు సాగుతుందా? లేక ఏవైనా ఆకస్మిక అంతర్గత మార్పులు సంభవిస్తాయా? అని సందేహాస్పదంగా గమనిస్తున్న ప్రపంచం ఎదుట తన విశ్వాసాన్ని నిలబెట్టుకునే కీలక ఎన్నికలివే. ఈ ఎన్నికలు పూర్తిగా పరోక్ష పద్ధతిలో జరుగుతాయి. ప్రస్తుతం దేశంలో ప్రత్యక్షంగా ప్రజలు పాలకులను ఎన్నుకునే పరిస్థితులు ఏర్పడలేదు. లక్షలాదిమంది ప్రజలు ఇంకా తమ తమ ప్రాంతాలకు తిరిగి రాలే దు.

కొత్తగా ఎన్నికయ్యే పాలక మండలి సిరియాదేశానికి ఒక కొత్త, శాశ్వత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసే బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. సిరియా ప్రజాస్వామ్య భవితకు ఇదే కీలకాంశం. ఆర్థిక సంస్కరణలను అమలుచేసి, ప్రభుత్వ వ్యవస్థలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జనరంజకంగా తీర్చిదిద్దే బాధ్యతలు కూడా ఈ పాలకమండలి భుజస్కంధాలపైనే ఉన్నాయి. సిరియా పార్లమెంటు 'పీపుల్స్ కౌన్సిల్'లో మొత్తం 210 స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలకు ప్రజలు ప్రత్యక్షంగా సార్వత్రిక ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకోవడానికి బదులుగా మూడు వంతులమంది సభ్యులను దేశాధ్యక్షుడు అహ్మద్ అల్—షారా ఎంపిక చేస్తారు.



మిగిలినవారిని ఆయా రాష్ట్రాలలో ఎలక్టోరల్ కాలేజీల ప్రాతిపదికపై ఎంపిక చేసి పంపుతారు. సుప్రీం ఎలక్షన్ కమిషన్ నియమించే సబ్ కమిటీల ద్వారా వివిధ రాష్ట్రాలలో జనాభా ప్రాతిపదికపై ఈ సభ్యుల ఎన్నిక జరుగుతుంది.

సుప్రీం ఎలక్షన్ కమిటీ అధిపతి మహ్మద్ అల్ తహా చెప్పిన ప్రకారం, అలెప్పో రాష్ట్రానికి 32 స్థానాలు లభించాయి. డమాస్కస్‌కు 10 స్థానాలు, పరిసర శివారు ప్రాంతాలకు 22 స్థానాలు లభించాయి. హసకా, డైర్ ఎజ్ జోర్ ప్రాంతాలకు పదేసి స్థానాలు వంతున లభించాయి. లతకియాకు 7 స్థానాలు, దారా,రక్కా ప్రాంతాలకు ఆరేసి స్థానాలు లభించాయి. టార్టస్‌కు ఐదు స్థానాలు, సువేదా, క్యునైత్రా ప్రాంతాలకు మూడేసి స్థానాలు లభించాయి. ఐతే సువేదా,హసకా,రక్కా ప్రాంతాలలో ఇంకా ఎన్నికల ప్రతినిధులను ఎన్నుకునేందుకు తగిన వాతావరణం ఏర్పడలేదని ఆగస్టు 23వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఈ మూడు ప్రాంతాలలోని తెగలమధ్యా ఎడతెగని హింస చెలరేగింది. సువేదా రాష్ట్రంలో డ్రూజ్ మైనారిటీ తెగల ఆధిపత్యం ఉండగా, హసకా, రక్కా ప్రాంతాలలో కుర్దిష్ తెగల ఆధిపత్యం ఉంది. వీరిమధ్యే ప్రధాన పోరాటం జరిగింది. సిరియాలో 2011 మార్చినెలలో ప్రారంభమైన అంతర్యుద్ధం 2024 డిసెంబరులో బషర్ అల్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిపోయిన తర్వాత ముగిసింది. అల్‌షారా పాలనలో అమెరికా, ఇతర దేశాల మద్దతుతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జనవరి 29వ తేదీన రాజధాని డమాస్కస్‌లోని అధ్యక్షభవనంలో సిరియా విప్లవ విజయోత్సవ సదస్సు జరిగింది.

# నేపాల్‌లో ముగ్గురితో తొలిదశ మంత్రివర్గం

## అవినీతి నిర్మూలిస్తామని ప్రధాని కర్కి ప్రతిజ్ఞ



**ఖాట్మండు:** నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి తొలిదశలో ముగ్గురు మంత్రులతో పొదుపుగా చిన్న మంత్రివర్గం ఏర్పాటు చేశారు. అదేవిధంగా సీనియర్ మహిళా న్యాయవాది సవితా భండారీ బారల్ దేశ అడ్వకేట్ జనరల్‌గా నియమించారు. ఒక మహిళ ఈ పదవి చేపట్టడం ఇదే మొదటిసారి. దేశాధ్యక్ష కార్యాలయం శీతల్ నివాస్ వద్ద ప్రదర్శకులు సృష్టించిన విధ్వంసకర శిథిలాల సమీపంలోనే వీరు ప్రమాణస్వీకారం చేశారు. తాత్కాలిక మంత్రివర్గాన్ని 15 మందికే పరిమితం చేస్తానని ప్రధానమంత్రి సుశీల కర్కి ముందుగానే ప్రకటించారు. అందువల్ల తదుపరి కూడా మరోసారి మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ముగ్గురు కొత్తవారితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు.



తమకు ప్రత్యేకంగా నిర్దేశించిన మంత్రిత్వశాఖలే కాకుండా ఒక్కొక్కరూ అదనంగా మరో మూడు మంత్రిత్వశాఖల బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. దేశంలో అవినీతి నిర్మూలిస్తామని, సకాలం లో పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేస్తామని సుశీల కర్కి ప్రతిజ్ఞ చేశారు. ఆర్థికమంత్రిత్వశాఖ లో మూడుదశాబ్దాలుగా పనిచేస్తూ అపార అనుభవం గడించిన ఆ శాఖ కార్యదర్శి రామ్‌షోర్ ఖానల్ ఆర్థికమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. హోంశాఖామంత్రిగా ఓం ప్రకాశ్ ఆర్యల్, జలవనరులు, నీటిపారుదల, ఇంధన శాఖామంత్రిగా కుల్మన్ ఘీషింగ్ ప్రమాణస్వీకారం చేశారు. భౌతికపరమైన మౌలికవనరులు, పట్టణ అభివృద్ధి, రవాణాశాఖలను కూడా కుల్మన్ ఘీషింగ్ నిర్వహిస్తారు. చట్టం,న్యాయశాఖ,పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యతలను కూడా మంత్రి ఆర్యల్ నిర్వహిస్తారు. ఇక మిగిలిన అన్ని మంత్రిత్వశాఖలను ప్రధానమంత్రి సుశీల కర్కి నిర్వహిస్తారు.

ఈ తాత్కాలిక మంత్రివర్గంలో ఖానల్‌కు ఆర్థికశాఖలో అపార అనుభవం ఉంది. గతంలో ఆయన కె.పి.శర్మ ఓలి ప్రభుత్వంలో ఆర్థిక సంస్కరణలపై 447 పేజీలతో కూడిన సిఫార్సుల కమిషన్ నివేదికను రూపొందించిన రికార్డు ఆయనకు ఉంది. ఇక ఘీషింగ్ కూడా ఓలి ప్రభుత్వంలో విద్యుత్‌సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో దేశంలో కరెంటు కోతలు అరికట్టి ప్రజాదరణ పొందిన చరిత్ర ఉంది. ఇక ఓంప్రకాశ్ ఆర్యల్ ఇటీవల జనరేషన్ జెడ్ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ప్రముఖ న్యాయవాది. ప్రదర్శకుల తరపున దేశాధ్యక్షుడితో చర్చల్లో పాల్గొన్ని ముఖ్యభూమిక నిర్వహించారు. అందుకు తగ్గట్టుగా ఆయనకు చట్టం,న్యాయం,పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ ప్రసాద్ యాదవ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకాశ్ మాన్‌సింగ్ రౌత్, నేషనల్ అసెంబ్లీ ఛైర్మన్ నారాయణప్రసాద్ దహల్, మాజీ ప్రధానమంత్రి బాబురామ్ భట్టారాయ్, ఇతర సీనియర్ అధికారులు ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. దేశంలో అవినీతి పేట్రేగిందని, ధనవంతుల కుటుంబాలు, రాజకీయ నేతలు అవినీతి సొమ్ము తో విలాసాలు చేస్తున్నాయని విమర్శిస్తూ ఈనెల 8,9 తేదీల్లో జరిగిన జనరేషన్ జెడ్ చేపట్టిన హింసాత్మక ఉద్యమం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ ఉద్యమంలో 71 మంది మరణించారు. మరో 1300 మంది గాయపడ్డారు. ప్రధానమంత్రి ఓలి ప్రభుత్వం రాజీనామా చేయగా, పార్లమెంటును దేశాధ్యక్షుడు రద్దుచేశారు. ఉద్యమం సందర్భంగా దాదాపు 15,000 మంది ఖైదీలు వివిధ జైళ్ళనుండి పారిపోయారు. వీరిలో చివరకు 3,723మందిని పట్టుకుని తిరిగి జైళ్ళలో బంధించగా ఇంకా ఇప్పటికీ మరో 10,320 మంది పరారీలో ఉన్నారు. ఉద్యమకారులతో దేశాధ్యక్షుడి చర్చల అనంతరం ఈనెల 12వ తేదీన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాత్కాలిక ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

## ప్రామాణికమని రుజువైంది
(మొదటి పేజీ తరువాయి)

డి.రాజా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింలతోపాటు సంబంధిత వర్గాలతో వక్ఫ్ చట్టంలో సవరణల గురించి పూర్తిస్థాయిలో సరైన చర్చలు, సంప్రదింపులు జరపకుండా పార్లమెంటు ఉభయసభలు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని ఆమోదించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో డి.రాజా ద్వారా సిపిఐ కూడా ఒక పిటిషన్ దాఖలు చేసింది. బిజెపి చాలా ఆదరాబాదరాగా ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్న పార్టీ ఉద్దేశాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం ప్రామాణీకరించిందని ప్రకటనలో డి.రాజా పేర్కొన్నారు. ఈ ఆదరాబాదరా చట్టంలో బిజెపి మైనార్టీలపట్ల వివక్ష ప్రదర్శించే స్పష్టమైన నిబంధనలను చేర్చిందని ఆయన విమర్శించారు. ముస్లిం మైనారిటీలను దేశంలో ఒక భూతంగా చూపించేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలలో ఒక భాగంగానే ఈ సవరణ చట్టం తీసుకువచ్చిందని విమర్శించారు. ఐతే సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని అమలు చేయకుండా పూర్తిగా రద్దుచేయలేదని, ఈ చట్టంలో ఇంకా అన్యాయపూరితమైన నిబంధనలు ఎన్నో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐతే ప్రాథమిక ఆధారాలు లభించిన ఏకపక్ష నిబంధనలను మాత్రమే న్యాయస్థానం స్తంభింపజేసిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ చట్టంలో ఇంకా అభ్యంతరకరంగా ఉన్న అనేక నిబంధనలన్నింటినీ పూర్తిగా న్యాయస్థానం కొట్టివేస్తుందని ఆయన అంచనావేశారు. సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానాలు చెప్పేవరకూ ఈ నిబంధనలను తిరిగి అమలుచేసే అవకాశం లేదని పేర్కొన్నారు. మతపరమైన ధర్మాదాయ వ్యవస్థల పాలనా నిర్వహణకు సంబంధించిన చట్టాలను అర్థవంతమైన సంప్రదింపుల అనంతరం ఎలాంటి రహస్యాలకు తావులేకుండా, బాహాటపద్ధతులలో రూపొందించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఈ విధమైన పాలనా నిబంధనలు దేశంలో మతాలమధ్య ఉద్రిక్తతలకు దారితీయకూడదని, లౌకిన ప్రజాస్వామ్య, బహుళత్వ దేశంలో మైనార్టీల మతపరమైన హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ఉందని డి.రాజా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**మైనారిటీల మతహక్కులకు పూర్తి రక్షణ ఇవ్వాలి : సందోష్ కుమార్**

దేశంలో మైనారిటీల మతపరమైన హక్కులకు తప్పనిసరిగా పూర్తి రక్షణ ఇవ్వాలని రాజ్యసభలో సిపిఐ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సిపిఐ పార్లమెంటరీపార్టీ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో న్యాయస్థానం తీర్పును స్వాగతించారు. పార్లమెంటు లోపలా, వెలుపలా కూడా భారత కమ్యూనిస్టుపార్టీ ఈ వక్ఫ్ శాసనాలను తీవ్రంగా ప్రతిఘటించి నిరసనలు తెలియజేసిందని, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టంగా తెచ్చిన వక్ఫ్ సవరణ నిబంధనలు ఏకపక్షంగా, వివక్ష చూపించేవిధంగా ఉన్నాయని, ఈ విధమైన నిబంధనలు మైనారిటీల మతమైన హక్కులను బాహాటంగా కుదించే ప్రయత్నమేనని విమర్శించారు. ఐతే న్యాయస్థానం యావత్ చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకోలేదనీ, కొన్ని నిబందనలను మాత్రమే అడ్డుకుందని, ఇంకా అన్యాయమైన నిబంధనలు ఎన్నో ఈ చట్టంలో ఉన్నాయన్నారు. మైనారిటీల హక్కులను హరించడంకోసమే కేంద్రం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు.

**హర్షం ప్రకటించిన సిపిఐ(ఎం)**

వక్ఫ్ సవరణచట్టం—2025 పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపట్ల సిపిఐ(ఎం) హర్షం ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.బేబీ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ,కేంద్రం తెచ్చిన ఈ సవరణలు దేశవ్యాప్తంగా పెద్ద తీవ్ర నిరసనలకు దారితీశాయని గుర్తుచేశారు. ఐదేళ్ళపాటు ముస్లిం మతాన్ని ఆచరించిన వారు మాత్రమే వక్ఫ్ ఆస్తులను సృష్టించేందుకు అర్హులన్న నిబంధనపై సుప్రీం కోర్టు ప్రధానంగా స్టే ఉత్తర్వు జారీ చేసింది.

## పరువునష్టం దావా
(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కక్షతో 'విపరీతమైన నిందారోపణలతో నీచమైన దుష్ప్రచారానికి' పాల్పడ్డారని ఆ దావాలో పేర్కొన్నారు. తప్పుడు,నిరాధారమైన ఆరోపణలను ప్రచురించినందుకు, ప్రసారం చేసినందుకు గాను దావా వేశారు. ఈ కేసులో బండి సంజయ్ పైన రూ 10 కోట్ల పరువు నష్టానికి కేసు వేశారు. తన పరువు నష్టం కలిగించే సమాచారాన్ని తొలగించాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. 2025 ఆగస్టు 8న బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబి (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక అవకతవకలకు తనను ముడిపెట్టారని వివరించారు. ఈ వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలలో విస్తృతంగా ప్రసారమయ్యాయని కెటిఆర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడంతో ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయన్నారు. బండి సంజయ్ బేషరతుగా, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాములు, మీడియా పోర్టల్ల నుండి పరువు నష్టం కలిగించే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించాలని కెటిఆర్ కోరారు. భవిష్యత్తులో పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం చేయకుండా నిరోధించే ఉత్తర్వులు ఇవ్వాలని కెటిఆర్ న్యాయస్థానాన్ని కోరారు.

## కుట్రకు ఎదురుదెబ్బ: కాంగ్రెస్
(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాలకు ప్రభుత్వం, పార్లమెంటు నుంచి స్పష్టతను కోరాయి. రాజ్యాంగ విలువను కాపాడే విధంగా న్యాయం, సమానత్వం, సోదరభావానికి ఊతమిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేయడాన్ని కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. చట్టంలో అంతర్లీనంగా ఉన్న 'దుర్మార్గపు ఉద్దేశాలు' రద్దు లో తాజా తీర్పుతో పురోగతి వచ్చినట్లు వెల్లడించారు. ఐదేళ్ల పాటు ఇస్లాం ఆచరించిన వారు మాత్రమే తమ ఆస్తిని వక్ఫ్ చేయగలరన్న నిబంధనపై సుప్రీం కోర్టు స్టే విధించింది. కాగా తమకు అనకూలంగా తీర్పు వెలువడిందని, పార్లమెంటు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు. పార్లమెంటు చేసిన చట్టాన్ని ఎలా తిరస్కరిస్తామని ప్రశ్నించారు. 'వక్ఫ్ చట్టం పూర్తి పాఠం సుప్రీంకోర్టుకు తెలుసు. సుప్రీం కోర్టు నిర్ణయం ప్రజాస్వామ్యానికి శుభ సూచికమని నమ్ముతున్నా. ఎందుకంటే పార్లమెంటు ఏదైన చట్టం చేస్తే దానిని తిరస్కరించే అవకాశం ఉండదు. సుప్రీం కోర్టు తాజా తీర్పులో అదే పేర్కొంది. ఈ తీర్పు సంతృప్తినిచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఏదైన నిర్ణ యం తీసుకుంటే దాని ప్రభావం ఉంటుంది... పార్లమెం టు నిర్ణయాన్ని కోర్టు సమర్థించినట్టే' అని రిజిజు వెల్లడించారు.

**బీజేపీ మత విభజన యత్నాలకు చెక్: కాంగ్రెస్**

మైనారిటీల హక్కుల పరిరక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. 'మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి, పాత సమస్యలను మళ్లీ తెచ్చేలా రూపొందిన 'విభజన' చట్టం కోసం బీజేపీ యత్నించింది. ఎన్నికల్లో ప్రయోజనం కోసం సమాజాన్ని విభజించాలనుకుంటోంది. భయం/ప్రయోజనంతో పని లేకుండా రాజ్యాంగం హామీనిచ్చే విధంగా ప్రతి పౌరుని హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. బీజేపీ మాత్రం స్వప్రయోజనాల కోసం కుయుక్తులు ప్రదర్శిస్తూ, సమాజాన్ని విభజించాలని చూస్తోంది' అని ఖడ్గే వ్యాఖ్యానించారు. ఈ కేసులో గణనీయమైన విజయం సాధించినట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. సుప్రీం కోర్టు కీలక నిబంధనలను నిలిపివేసిందని, కలెక్టర్ల అధికారాలు పరిమితం చేసిందని, వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురికాకుండా చూసిందన్నారు. ఐదేళ్లుగా ముస్లిం గా ఉన్నానంటూ రుజువులు చూపే నిబంధనను నిలిపివేస్తూ, తగిన విధంగా నియమాలు రూపొందించాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని జైరాం రమేశ్ పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వ విలువల కోసం తీర్పును స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు.

**రాజ్యాంగ విలువలకు రక్షణ: డీఎంకే**

రాజ్యాంగ విలువల రక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు. 'బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇందులోని సవరణలను డీఎంకే వ్యతిరేకిస్తోంది. చట్టంగా మారినప్పుడు దానిపై సుప్రీంకెళ్లింది. ప్రభుత్వ అధికాలను దుర్వినియోగించేలా తీసుకుకొచ్చిన బిల్లును చట్టం చేయగా, దీనిని ఉపసంహరించుకునేలా కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు ముస్లింల మతపరమైన హక్కుల పరిరక్షణకు, రాజ్యాంగ విలువల రక్షణకు హామీనిస్తుంది' అని పేర్కొన్నారు. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ స్పందిస్తూ 'వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన పార్టీల్లో ఆర్‌జేడీ ఒకటి. ఈ వ్యవహారంలో న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తాం' అని అన్నారు.

**తుది తీర్పుపై ఆశలు: ముస్లిం లా బోర్డులు**

వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తే హర్షించేవాళ్లమని, తాజా ఉత్తర్వులు కొంతమేరకు ఉపశమనం కల్పించాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ), ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డు (ఏఐఎస్‌పీఎల్‌బీ) పేర్కొన్నాయి. బోర్డులో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం ఇబ్బంది పెట్టే అంశమన్నారు. మత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీనిస్తోందని గుర్తుచేశారు. ఇస్లాంలో వక్ఫ్ అంతర్గత భాగమని నొక్కిచెప్పారు. ఇతర మత సంస్థల్లో ఆయా మతస్థులే ఉన్నప్పుడు వక్ఫ్‌కు మినహాయింపు ఎందుకని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు దీనిపై స్టే విధించలేదని, ఇది పెద్ద సమస్యగా ఉందని, తుది తీర్పుపైనే ఆశలు పెట్టుకున్నామని ముస్లిం లా బోర్డులు పేర్కొన్నాయి. న్యాయంపై నమ్మకాన్ని తాజా ఉత్తర్వులు ఇచ్చినట్లు జమాత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ అన్నారు.

**మాకు సమస్య లేదు: మునంబం వాసులు**

తాజా ఉత్తర్వులతో తమకు ఎలాంటి సమస్య లేదని, ఫరూక్ కాలేజి నుంచి తాము కొనుగోలు చేసిన భూమికి ఢోకా లేదని కేరళకు చెందిన మునంబం భూ సంరక్షణ సమితి వెల్లడించింది. చట్టంలోని సెక్షన్ 2(ఎ)పై స్టే విధించలేదు కాబట్టి... మా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్లవచ్చని సమితి సభ్యుడు జోసెఫ్ బెన్నీ తెలిపారు. తమ సమస్యల సత్వర పరిష్కారానికిగాను పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమితి నిర్ణయించినట్లు వెల్లడించారు.

## కోల్ ఇండియా రిటైర్డ్ సిబ్బందికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఉద్యోగ విరమణ పొందిన కోల్ ఇండియా కార్మిక, ఉద్యోగ, సిబ్బందికి కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించడంతోపాటు, డిఎ పెంపును వర్తింపజేయాలని కోల్ ఇండియా రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్వల లక్ష్మ ణ్, ఎ.మహేశ్వర్, సత్యజిత్ పొద్దర్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 2003 సంవత్సరానికి ముందు రిటైర్డ్ అయిన కోల్ ఇండియా సిబ్బందికి పెన్షన్ నెలకు రూ.350 నుంచి రూ.1000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగినందున ఈ పెన్షన్ ఏమాత్రం సరిపోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నామన్నారు. కావున, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తమ డిమాండ్‌ను పరిశీలించి, న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బాధ్యతలు సర్పంచ్‌లకే
(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌ఇడి లైట్ల కాంట్రా క్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అన్ని గ్రామా ల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే, లైట్ల నిర్వహ ణ, విద్యుత్ దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యా యి. జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్‌ఇడి లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయ ని మున్సిపల్ శాఖ అధికారులు సిఎంకు నివేదించారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు నివేదించారు. రాత్రి పూట ఎల్‌ఇడి లైట్లు పని చేయటంతో పాటు పగటి పూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించాలని, అన్ని గ్రామాల ఎల్‌ఇడి డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపిడిఒ పర్య వేక్షణలో ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు.

**ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు ఉండేలా టెండర్ నిబంధనలు**

కోర్ అర్బన్ సిటీ పరిధిలో జిహెచ్‌ఎంసితో పాటు కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్‌ఇడి లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎల్‌ఇడి లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు ఆహ్వానించాలన్నారు. ఎల్‌ఇడిడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని సూచించారు. ఎల్‌ఇడి లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా? లేదా? ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులు ఉన్నాయో? తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటి లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం

**'సోలార్ పవర్' సాధ్యాసాధ్యాలను పరిశీలించండి**

జిహెచ్‌ఎంసి పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని, విద్యుత్‌ను ఆదా చేసేందుకు సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు అవుటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్‌ఇడి లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలతో పాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయన్నారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్‌ఇడి లైట్ల అంచనా వేయాలని సూచించారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్‌ఇడి లైట్లకు కూడా టెండర్లు ఆహ్వానించాలని సిఎం ఆదేశించారు.

## నిలిపివేత
(మొదటి పేజీ తరువాయి)

వీలైనంత వరకూ ముస్లింమతస్థులనే నియమించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులకు ఆదేశించింది. ''శాసనంపై అంచనాలు ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధంగానే ఉంటాయి, కానీ, అరుదైన సందర్భాలలో మాత్రమే ఈ విషయం తేల్చడానికి న్యాయస్థానం జోక్యం ఉంటుంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

వివాదాస్పద సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన 100కు పైగా పిటిషన్లపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 128 పేజీలతో ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఐతే బిజెపి తన సిద్ధాంతాలకు అనుగుణంగా సవరణల ద్వారా చట్టంలో చొప్పించిన, మైనారిటీ హక్కులు హరించే అనేక వివాదాస్పద నిబంధనలు మరికొన్ని ఉన్నప్పటికీ ధర్మాసనం వాటి జోలికి వెళ్ళలేదు. ఈ కొత్తచట్టంలోని ప్రతి నిబంధననూ ధర్మాసనం పరిశీలించి పరిగణనలోకి తీసుకుందని, వీటిల్లో కొన్ని నిబంధనలు తప్ప మొత్తం వక్ఫ్ (సవరణ)చట్టం— 2025 ను పూర్తిగా అమలు చేయకుండా నిలిపివేయడానికి ఎలాంటి ప్రాథమిక ఆధారాలు కనిపించలేదని, అందువల్ల పిటిషనర్ల విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ చెప్పారు. పిటిషనర్ల ప్రయోజనాలు కాపాడేందుకు, ఈ చట్టానికి అనుకూల ప్రతికూలవాదుల మధ్య సమతుల్యం పాటించేదుకు ఈ స్టే ఉత్తర్వు ఇస్తున్నట్లు చెప్పారు. చట్టంలో కొన్ని నిబంధనలకు రక్షణ అవసరమని అన్నారు. ఈ ఉత్తర్వులు ప్రాథమికమైనవీ, తాత్కాలికమైనవేననీ, తుది విచారణలో వాదనలు పూర్తయ్యేవరకూ అటు ప్రభుత్వం తరపు న్యాయవాదులనుగానీ, ఇటు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న పిటిషనర్లను గానీ తమ తమ పూర్తి వాదనలు ధర్మాసనానికి తెలియజేయకుండా ఈ స్టే ఉత్తర్వులు అడ్డుకోబోవని ఆయన చెప్పారు.

కొత్త సవరణ చట్టంలోని సెక్షన్ 3 ఆర్ ప్రకారం వక్ఫ్ ఆస్తులను సృష్టించడానికి, ముస్లిం పేదలకు దాతృత్వంకోసం తన ఆస్తులను అంకితం ఇవ్వడానికి సంబంధిత వ్యక్తి గడచిన ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నాడా? లేదా? అనే విషయంపై నిర్ధారణ చేయడానికి రాష్ట్రాలలో ప్రభుత్వాలు పరిశీలించి తగినవిధంగా నిబంధనలు రూపొందించేంతవరకూ ఈ స్టే ఉత్తర్వులు అమలులో ఉంటాయని కూడా ఉత్తర్వులలో ధర్మాసనం స్పష్టం చేసింది. ఎలాంటి నిబంధనలు రూపొందించకుండా, ఎలాంటి యంత్రాంగం లేకుండా దాతలకు ఐదేళ్ళ నిబంధనను అమలు చేయడం ఏకపక్షంగా అధికారాలను ఉపయోగించడమే అవుతుందని కూడా విమర్శించింది. వక్ఫ్ ఆస్తుల ప్రతిపత్తిని నిర్దేశించడానికి ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన అధికారాలకు సంబంధించి ఈ చట్టంలో సెక్షన్ 3 సి అతిముఖ్యమైనది. దీనిపైనే ఎక్కువ అభ్యంతరాలు వచ్చాయి. పార్లమెంటు ఉభయసభలూ ఈ ఏడాది ఏప్రిల్ 3,4 తేదీలలో వక్ఫ్ (సవరణ)బిల్లును ఆమోదించాయి. తర్వాత ఐదో తేదీన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము బిల్లుపై సంతకం చేశారు. అదేనెల 8వ తేదీ నుండీ ఈ సవరణలు చట్టరూపం ధరించి అమలులోకి వచ్చాయి. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం మతస్థులు ఆ మతంలో ఉండే పేదల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు భూములు, ఆస్తులు, భవంతులు దానం చేసి వాటిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటిస్తారు. వీటిని వారి ప్రయోజనాలకోసం ఉపయోగించాలి. 1923లో ముస్లింల వక్ఫ్ చట్టం చేసినప్పటినుండీ చరిత్రను న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రస్థావించింది.

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలొద్దు
(మొదటి పేజీ తరువాయి)

చేసి కళాశాలల బంద్‌ను నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ సమితి అధ్వర్యంలో హిమాయత్‌నగర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ ఫీజుల కోసం కళాశాలల యజమాన్యాలు బంద్‌కు పిలుపునివ్వడమంటే పేద విద్యార్థులను చదువులకు దూరం చేయడమేనని, దీనిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. అందాల పోటీలకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం విద్యార్థుల చదువులకు ఇవ్వకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఓట్లు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఓట్లు ఉన్నాయనే విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకొని వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, మంత్రులను తిరగనివ్వబోమని విద్యార్థులతో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీవర్ధన్ రెడ్డి, నాయకులు అరుణ్, ఉదయ్, అనిల్, హరీష్, వెంకటేష్, రూప్ సాయి,ప్రకాష్,శివ, విరాజ్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సహదేవ్ ఎన్‌కౌంటర్
(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. భద్రతా దళాలు ఆ ప్రదేశంలో కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. జులైలో ఓ కోబ్రా జవాన్ హత్యలో సహదేవ్ పేరు వచ్చింది. నాడు బొకారో పోలీసులు చేపట్టిన సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా తగిలిన తూటా గాయానికి అతడు మరణించాడు. తాజాగా ఈ ముగ్గురు నక్సల్స్ నేతలు ఏదో పెద్ద ఆపరేషన్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ఎస్‌పి హర్వీందర్ సింగ్ వెల్లడించారు. ఈనెల 7వ తేదీన జరిగిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల సీనియర్ నాయకుడు అమిత్ హన్స్&డా మరణించాడు. జోనల్ కమాండర్ అయిన అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. మొత్తం 95 కేసుల్లో అతడు నిందితుడు. వీటిల్లో చాలామంది పోలీసులు, పౌరుల హత్యలు ఉన్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు మోడెం బాలకృష్ణ, అల్వాల్ చంద్రహాస్ సహా 10 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.



# జనరల్
STATE & REGIONAL NEWS

## యూరియాను శాస్త్రీయంగా అందించాలి

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రాలకు సరిపోను యూరియాను శాస్త్రీయంగా అందజేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. యూరియాను సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్రానిది కాగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. యూరియా కొరత వల్ల రైతులు వారి కుటుంబ సభ్యులు రాత్రి పగలు తేడా లేకుండా బస్తా యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి, దేశ రైతులు సంవత్సరనర కాలం పాటు దేశ రాజధానిలో నిరసన ధర్నాలు చేస్తూ వందలాది రైతులు చనిపోయినా, వర్షానికి, ఎండకు, చలికి లెక్కచేయకుండ ఆందోళన చేసినా కేంద్ర ప్రభుత్వంకు కనువిప్పు కలుగకపోవటం విచారకరమని బాల్ రాజ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు వెంటనే రైతులకు ఇబ్బందులు రాకుండ ముందస్తుగానే కావాల్సిన ఎరువులను, విత్తనాలను, వారి భూమి విస్తీర్ణం బట్టి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు, త్యాగాలతోనే
# హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి మండలంలో సిపిఐ భారీ బైక్ ర్యాలీ, అమరులకు నివాళి




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** కమ్యూనిస్టు పార్టీ నేతల ప్రాణ త్యాగాల మూలంగా, తెలంగణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని, సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేది సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ చిగురుమామిడి మండల సమితి ఆద్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ ఇందుర్తి, ఒగులాపూర్, గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో జరిగింది. అమరులైన వారి స్మారక స్థూపాల వద్ద చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం బానిసత్వానికి వ్యతిరేకంగా, ఆకలి మంటలు, ఆర్తనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా, భూమికోసం, భుక్తి కోసం దాస్య శృంఖలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. లక్షలాది మంది సాయుధ పోరాటానికి ముందుకు వచ్చారని, అనేక గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సంఘాలు నిర్మించి నిజాం రజాకార్ పోలీసులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. ఇందుర్తి ప్రాంతంలో దొంగ అప్పు పత్రాలు సృష్టించి ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తున్న గంగారెడ్డి దొరకు వ్యతిరేకంగా ముస్కురాజిరెడ్డి గునుకుల జనార్ధన్‌రెడ్డి, కూన ముత్తయ్యలాంటి అనేకమంది వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి అప్పు పత్రాలను తగలబెట్టిన చరిత్ర ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతున్న తరుణంలో కరీంనగర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నేతలు కీలకంగా వ్యవహరించారని, ఉమ్మడి జిల్లా అగ్రనేత బద్దం ఎల్లారెడ్డితో పాటు అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి లాంటి ఎంతో మంది గొప్ప నేతు సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించారన్నారు. అమరవీరుల ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు కంకణ బద్దులు కావాలన్నారు. కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట ఉన్న చిగురుమామిడి మండలంలో రానున్న రోజుల్లో స్థానిక ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరవేయడం కోసం అందరూ పనిచేయాలని, అమరులు చూపిన బాటలో నడుస్తూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, లంకదాసరి కల్యాణ్, బి.యుగేందర్, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడపల్లతి వెంకటేష్, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, మాజీ మండల కార్యదర్శి ఎనగందుల రాజయ్య, మాజీ సర్పంచులు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జపాపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కూన లెనిన్, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, ఇల్లందుల రాజయ్య, మంద ఎల్లయ్య, ఎలగందుల రాజు, అల్లెపు జంపయ్య, కయ్యం తిరుపతి, కాత మల్లయ్య,నీల వెంకన్న,రామస్వామి పాల్గొన్నారు.

## దేశ రాజకీయ గమనాన్ని మార్చిన చరిత్ర
# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిది

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ రాజకీయ గమనాన్ని మార్చిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తే చరిత్ర క్షమించదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నిజాం లొంగిపోయారు తప్ప అప్పటి హోంమంత్రి సర్దార్ పటేల్ చీకటి ఒప్పందంతో కాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా సిపిఐ జిల్లా కార్యాలయం సంగారెడ్డిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్ ఖాన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈటీ నరసింహ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు తోడు గ్రామాలలో దొరలు , దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారిల ఆదిపత్యానికి చరమగీతం పాడేందుకు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల నాయకత్వంలో కాల్మొక్కుతా నీ బాంచన్ అన్న ప్రజలే బందూక్‌లు చేత బట్టి దొర గడీలను బద్దలుకొడుతూ, రజాకార్ల సైన్యాన్ని భూస్వాముల గుండాలను తరిమి తరిమి కొట్టిన మహత్తర పోరాటమని ఆయన పేర్కొన్నారు. 3వేల గ్రామాలు విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘన చరిత్ర సాయుధ పోరాటానిది అన్నారు.

దీంతో కమ్యూనిస్టు పార్టీకి అధికారం దక్కుతదని భావించినా నిజాం గత్యంతరం లేక భూస్వామ్య వర్గాల ప్రతినిధులుగా ఉన్న సర్దార్ పటేల్ హోంమంత్రి నాయకత్వంలో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఫలితంగా నిజాంకు గవర్నర్ పదవితో పాటు కోట్లాది రూపాయల రాజభరణాలు చెల్లించడమే కాకుండా ప్రజలను హింసించి అరాచకాలు సృష్టించిన రజాకార్ల సైన్య అధ్యక్షుడు ఖాసిం రజ్వికి సరైన అనే శిక్ష విధించకుండా పాకిస్తాన్ పంపిన చరిత్ర ఆనాటి పాలకులదని పేర్కొన్నారు. రజాకార్ సైన్యానికి ఉపాధ్యక్షుడుగా ఉన్న విస్నూరు రామచంద్రారెడ్డి దొర గురించి గాని జామీందార్లు, జాగీర్‌దార్లు, భూస్వాముల గురించి గాని బిజెపి మాట్లాడకుండా ముస్లింపై హిందువులు సాధించిన విజయంగా చెప్పుకుంటూ తెలంగాణ రైతాంగ సాయుధ మహోత్తర పోరాట చరిత్రను వక్రీకరిస్తోందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో గాని తెలంగాణ సాయుధ పోరాటంతో ఏ సంబంధం లేని ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఒకరి చరిత్రను వక్రీకరించడమే లేకపోతే ఉద్యమంలో పాల్గొన్న నాయకులను తమ వారనే ప్రచారం చేసుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య ఎద్దెవా చేశారు. యువత బిజెపి తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవ చరిత్రను ప్రజలకు వివరిస్తూ పాలకవర్గాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటాలకు బాటలు వేయాలని ఈటి నరసింహ పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనం దినోత్సవం పేరుతో బిజెపి సంబరాలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రుద్దుతూ కమ్యూనిస్టుల చరిత్రను చెరిపేయడానికి చూస్తే ప్రజల్లో చరిత్ర చెరిగిపోదు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్, నాయకులు ఆనంద్, బాల్ రెడ్డి, ఆర్.లక్ష్మి, రూబీనా బేగం, రత్నాకర్ రెడ్డి, శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ విధివిధానాలు రూపొందించాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌ఒ జి.మల్సూర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టు హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని, ఇందుకు హైపవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఉమ్మడి ఎపి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్దరిస్తున్నామన్నారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి చేసిన విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సిఇ.ఒ ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## దార్శనికత విలువలు, శ్రేష్ఠత కోసం రూపొందించిన
# జీవన వ్యవస్థలే విద్యాసంస్థలు

అద్భుతమైన పురోగతి సాధిస్తున్న ఎంజియూ

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగవ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యాసంస్థలంటే కేవలం ఇటుకలు, నిర్మాణాలు కాదని, దార్శనికత, విలువలు శ్రేష్ఠత కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా రూపొందించబడిన జీవన వ్యవస్థలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం ఆయన నల్లగొండ జిల్లా, నార్కెట్‌పల్లి మండలంలో ఉన్న మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగవ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. ముందుగా ఆర్ట్స్ కాలేజ్ వద్ద రాష్ట్ర గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, నల్లగొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎంఎల్‌సిలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ అమిత్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నాలుగవ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద మొక్కలు నాటారు. అనంతరం 22 మందికి పీహెచ్‌డి అవార్డులను, 57 మందికి గోల్డ్ మెడల్స్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ విద్యారంగం, పరిశోధన, ఆవిష్కరణలు సేవా కార్యకలాపాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం గ్రామీణ వాతావరణంలో ఉంటూ తెలంగాణ అంతటా గ్రామాల నుండి ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షిస్తున్నదని అన్నారు. చాలా మంది మొదటితరం అభ్యాసకులు, వారు సహజమైన ప్రతిబంధకాలతో ఇక్కడికి వచ్చి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అయినప్పటికీ, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వారికి ఎదగడానికి ఒక పోషణ వేదికను నిరంతరం అందిస్తున్నదన్నారు. అడ్డంకులను అధిగమించి, బాధ్యతాయుతమైన, ఉత్పాదక విజయవంతమైన పౌరులుగా తమను తాము మార్చుకుంటున్నారని తెలిపారు. ఒక దశాబ్దానికి పైగా, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతి నిర్మాణానికి గణనీయంగా దోహదపడిన గ్రాడ్యుయేట్లను తయా రుచేస్తున్నదని, విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దడంలో బలమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌లను పెంపొందించడం కొనసాగించాలని వారి మద్దతును ఉపయోగించుకోవాలని అన్నారు. హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బిఎస్ మూర్తి, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. కాన్వకేషన్‌లో ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన, యూనివర్సిటీ తొలి వీసి ప్రొఫసర్ గంగాధర్, పూర్వ రిజిస్ట్రర్లు ప్రొఫసర్ నరేందర్ రెడ్డి, ప్రొఫసర్ ఉమేష్ కుమార్, ఎంజియు రిజిస్టర్ ప్రొఫసర్ అల్వాల రవి,పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి, లక్ష్మీప్రభ సంధ్యారాణి, ప్రవళిక, ఆకుల రవి, బిఆర్‌ఎఓయూ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి ధర్మానాయక్, కొప్పుల అంజిరెడ్డి ప్రొఫసర్ రేఖ, యూనివర్సిటీ వివిధ విభాగాల అధికారులు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్, కాన్వకేషన్ బంగారు పతకాల దాతలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారారు



మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పది మంది ఎంఎఎలు గడ్డిపోచను పట్టుకుని, వరద నుంచి బయటపడాలని చూస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. పది మంది ఎంఎఎలపైన త్వరగా చర్యలను తీసుకోవాలని శాసన సభ స్పీకర్‌ను కోరారు. ఎంఎల్‌ఎలు పోచారం శ్రీనివాస రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, యాదయ్య, తెల్లం వెంకట్రావ్, గూడెం మహిపాల్ రెడ్డి, డాక్టర్ సంజయ్ పార్టీ ఫిరాయింపులపైన ఇటీవల స్పీకర్‌కు ఇచ్చిన సమాధానాలపైన శాసనసభ సంయుక్త కార్యదర్శి ఉపేందర్ రెడ్డికి బిఆర్‌ఎస్ తరపున బిఆర్‌ఎస్ విప్ కె.పి.వివేకానంద, ఎంఎల్‌ఎ చింతా ప్రభాకర్‌తో కలిసి జగదీష్‌రెడ్డి సోమవారం రీ జాయిండర్లను సమర్పించారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జగదీష్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పది మంది ఎంఎల్‌ఎలు పార్టీ మారారని, వారు పార్టీ మారి తప్పు చేశామని నియోజకవర్గ ప్రజల ముందు తమ తప్పును ఒప్పుకోవాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మీడియా అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు

సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మీడియా అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా కాచిగూడలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పలువురు సిపిఐ నాయకులు షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించిజిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు పటేల్, పట్వారిలు భూస్వామ్యాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలని జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తూ షోయబుల్లాఖాన్ తాజ్విపత్రిక, ఆ తర్వాత రయ్యత్ పత్రికలో వ్యాసాలు ప్రచురించచడంతో వీటిపై నిజాం సర్కార్ కత్తిగట్టి నిషేధం విధించారన్నారు. ఆ తర్వాత ఇమ్రోజ్ పత్రికకు ఎడిటర్‌గా షోయబుల్లాఖాన్ నిజాం సర్కార్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పౌర ప్రజాస్వామిక హక్కులు లేకుండా పత్వాలు జారీ చేస్తున్న పాలనపై తన రచనల ద్వారా కలానికి పదును పెట్టి ప్రజలను చైతన్య పర్చారన్నారు. ఇది నచ్చని నిజాం సర్కార్ షోయబుల్లాఖాన్‌ను బెదిరింపులకు గురి చేసిన అదరలే బెదరలేదని తెలిపారు. ఇదే క్రమంలో పత్రిక పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న షోయబుల్లాఖాన్‌ను రజాకార్లు అత్యంత దారుణంగా కాచిగూడలో తన రెండు చేతులను నరికి దారుణంగా హత్య చేశారన్నారు. ఇలాంటి త్యాగాల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణకి మీడియా అకాడమీకి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని ప్రభుత్వాన్ని స్టాలిన్ డిమాండ్ చేశారు. చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ బిజెపి దీనికి మతంరంగును జోడించి తప్పుడు చరిత్రను ప్రజల్లోకి తీసుకుపోయే ప్రతి ప్రయత్నాన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా ఎదిరించి వాస్తవ చరిత్రను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, సి.హెచ్.జంగయ్య, కళ్యాణ్, అనిల్, ధరంపురి, గణేష్, ఐలయ్య, ఫహీం, సుశాంత్, అరుణ్, భాను, అరవింద్, చింటూ పాల్గొన్నారు.

## పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌లో ఘనంగా మోక్షగుండం జయంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఉత్సవాలను లక్డికాపూల్‌లోని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ (టిజిపిహెచ్‌సి)లో ఘనంగా నిర్వహించారు. టిజిపిహెచ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్‌తో పాటు సిబ్బంది విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దార్శనిక సివిల్ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు మరియు జాతి నిర్మాత ఎం.విశ్వేశ్వరయ్య యొక్క అమూల్యమైన కృషిని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నామన్నారు. నీటిపారుదల, వరద నియంత్రణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఆయన చేసిన మార్గదర్శక కృషి ఆధునిక భారతదేశానికి పునాది వేసిందన్నారు. భవిష్యత్తులో విభిన్న రంగాలలో కార్పొరేషన్ వృద్ధిని నిలబెట్టడానికి మరియు బలోపేతం చేయడానికి అధిక పనితీరు కోసం కృషి చేయాలని ఉద్యోగులను కోరుతూ, సాంకేతిక నైపుణ్యం, సమగ్రత మరియు ఆవిష్కరణల అవసరాన్ని ఆయన తెలియజేశారు.

# సంస్కరణలు పోలీసు ప్రతిష్ఠకు కీలకం



డిజిపి డాక్టర్ జితేందర్

పోలీసు సంస్కరణల ప్రాజెక్ట్‌పై ఐపిఎఫ్‌తో ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు శాఖలో సంస్కరణలు అమలు చేయడం ద్వారా సమాజంలో పోలీసు ప్రతిష్ట పెరుగుతుందని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. తెలంగాణ పోలీసు శాఖలో సంస్కరణల ప్రాజెక్ట్ కోసం ఇండియన్ పోలీసు ఫౌండేషన్ (ఐపిఎఫ్)తో తెలంగాణ పోలీసులు సోమవారం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోలీసు శాఖలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు చేపట్టిన 'మీ సేవ' పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం 'టిసేఫ్' యాప్' వంటి కార్యక్రమాలకు ఈ సంస్కరణల ప్రాజెక్ట్ మరింత విలువ చేకూరుస్తుందని చెప్పారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపిఎఫ్) అనేది 2014లో న్యూ ఢిల్లీలో మేఘాలయ మాజీ డిజిపి ఎన్. రామచంద్రన్ స్థాపించిన సంస్థ. దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు వ్యవస్థలో కావాల్సిన సంస్కరణలు, అభివృద్ధికి ఈ సంస్థ పరిశోధనలతో కృషి చేస్తుంది. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజా కేంద్రిత, ఆధునిక పోలీసింగ్ బలోపేతం అవుతంపదన్నారు. ఈ సందర్భంగా ఐపిఎఫ్ అధ్యక్షుడు, సిఇఒఎం ప్రకాశ్‌సింగ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పరిశోధన, సమాజాభివృద్ధి, విధాన రూపకల్పన ద్వారా పోలీసింగ్‌లో మెరుగుదలే తమ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ఐపిఎఫ్ రాష్ట్ర విభాగాలు ఏర్పాటయ్యాయని, త్వరలో తెలంగాణలోనూ విస్తరించనున్నట్లు చెప్పారు. ఐపిఎఫ్ ఉపాధ్యక్షుడు ఇష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ద్వారా పౌరుల ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, మహిళల భద్రత, స్పందనాత్మక పోలీసింగ్, పోలీస్ సిబ్బంది కోసం సహాయక వాతావరణం వంటి అంశాలు మెరుగుపడతాయని వివరించారు. ప్రారంభ దశలో ఈ ప్రాజెక్ట్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 15 పోలీస్ స్టేషన్లు, సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 పోలీస్ స్టేషన్లలో అమలు అవుతుంది. అనంతరం ఎంపికైన 30 పోలీస్ స్టేషన్లలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్ట్ ఒక సంవత్సరం పాటు కొనసాగి, స్వతంత్ర సంస్థ ద్వారా మూల్యాంకనం జరుగుతుంది. విజయవంతమైన సిఫార్సులు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు చేస్తారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పంజాబ్, తమిళనాడులోనూ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు దుర్గాప్రసాద్, శరత్‌కుమార్, మహేష్ భగవత్ , అనిల్ కుమార్, అవినాష్ మోహంతి, సి.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేశ్, తఫ్సీర్ ఇక్బాల్, పరితోష్ పంకజ్, సురేష్ కుమార్, కోటిరెడ్డి, కవిత, మల్లారెడ్డి, సతీష్, రమణ కుమార్ పాల్గొన్నారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No. E1/DB/MCK/8201/232/MCK/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: 12.09.2025
మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద బతుకమ్మ పండుగ 2025 సందర్భంగా 35 పనులకు నిర్వహణ పనులు. **అంచనా విలువ:** రూ. 150.85 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ:** 15.09.2025న సా.04.00గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేదీ:** 23.09.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్.
DIPR R.O. No. : 8042-PP/CL/ADVT/1/2025-26, Date: 15-09-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
EE-Div16/EE/Divn.16//(SBZ)/GHMC
NIT No. 26/Cir-16/Engg-Div-16/SBZ/GHMC/2025-26 తేది: 15.09.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట్ సర్కిల్-16లో సివిల్ పనులు. **మొత్తం టెండర్ విలువ:** రూ.21.15 లక్షలు, **క్ర.సం.1 నుండి 6 వరకు ప్రారంభ తేదీ:** 16.09.2025న మ.3:00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 19.09.2025న మ.3:15గం.ల వరకు. శ్రీమతి డి.అశలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, సర్కిల్-16 అంబర్‌పేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్: 9963550657 / 6309919062. **సంప్రదించవలసిన చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 8062-PP/CL/ADVT/1/2025-26, Date: 15-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జ యంతి సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఐ) ఆ ధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలను కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్ట ర్స్ కల్చరల్ క్లబ్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసిసిఈ(ఐ) సౌత్ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ కాచర్ల ముఖ్య అతిథిగా, ఏసిసిఈ(ఐ) జిసి మెంబర్ కాశీరామ్ ఆడెపు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కన్సల్టెంట్ విభాగంలో ఎస్. రాజగోపాల రెడ్డి, వి.వి. కృష్ణారెడ్డి, ఇండస్ట్రియల్ విభాగంలో బి. శీనయ్య, అకాడమియా విభాగంలో పి. శ్రీనివాస రా వు, ప్రొఫెసర్ నీలిమ సత్యం, విద్యార్థి విభాగంలో డి. చంద్రకాంత్లను ఘనంగా సత్కరించారు.

## 24న కవయిత్రులతో కవితా సమ్మేళనం

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బతుకమ్మ పండగ సంబరాల్లో బాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ.. కవయిత్రులతో కవితా సమ్మేళనం నిర్వహించనుంది. ఈ నెల 24 నిర్వంచే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను తెలంగాణ ప ర్యాటక, సాంస్కృతిక శాఖ జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ నెల 24న రవీంద్ర భారతి లో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆద్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో బతుకమ్మ పండగ విశిష్టతను తెలిపే కవితలను క యిత్రులు వినిపిస్తారు...ఆ తర్వాత మహిళా కవయిత్రులు అందరూ కలిసి బతుకమ్మ ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, సాహితీవేత్తలు ముచర్ల దినకర్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం అంటే వృత్తి కాదు.. ప్రజల విశ్వాసం : శాంతికుమారి



ప్రజాపక్షం/హైదరాబాద్:జర్నలిజం అంటే కేవలం వృత్తి మాత్రమే కాదని, ప్రజల విశ్వాసమని, సమాజానికి కాపలాదారు లాంటిదని,బలహీన వర్గాల గొంతుకగా ప్రభుత్వం, ప్రజల మధ్య వంతెనగా ఉంటుందని ఎంసిహెచ్ఆర్‌డి వైస్‌చైర్మన్, డైరక్టర్ జనరల్ శాంతి కుమారి అన్నారు. కచ్చితత్వం, న్యాయం, బాధ్యత అనే విలువలతోనే పాత్రికేయులు ముందుకు సాగాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో 'మీడియా మేనేజ్‌మెంట్'పైన రెండు వారాల అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఐటెక్ డివిజన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు చెందిన 25 దేశాల నుండి వచ్చిన 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరం ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం జర్నలిస్టులు వేగంగా మారుతున్న కాలంతో పోటీపడుతున్నారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్యాక్ట్ చెకింగ్, మొబైల్ జర్నలిజం, మల్టీమీడియా కథనాలు, సోషల్ మీడియా వేదికలు సమాచార రూపకల్పన, ప్రసార పద్ధతులను మలుపు తిప్పుతున్నాయనివివరించారు. తప్పుడు సమాచారం, ప్రజల్లో విశ్వాసం తగ్గిపోవడం, నైతిక సవాళ్లు కూడా పెరుగుతున్నాయని శాంతి కుమారి ఆందోళన వ్యక్తం చేశారు. కోర్సు డైరెక్టర్, న్యాయశాఖపబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ మాధవి రావులపాటి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నైతిక, బాధ్యతాయుత పత్రికా విలువలను బలోపేతం చేసే వేదికగా శిక్షణను రూపొందించామని వివరించారు. కాగా ఈ శిక్షణ కార్యక్రమంలో భారతదేశంలోని విభిన్న భాషలు, ప్రాంతాలపైన ఆధారపడి ఉన్న ప్రత్యేకమైన మీడియా వ్యవస్థ పట్ల అవగాహన కలిగించనున్నారు.

## వక్ఫ్‌బోర్డ్‌పై సుప్రీం తీర్పు హర్షణీయం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్:'వక్ఫ్ సవరణ చట్టం2025'పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఇవ్వడాన్ని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు స్వాగతించారు.'ఈ చట్టం ప్రగతిశీల ముసుగులో దేశంలో విభజన రాజకీయాలకు,మత సామరస్యానికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ఎల్లప్పుడూ దేశంలోని మత సామరస్య వాతావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తోందన్నారు. రాజకీయాల కంటే తమకు దేశ ఐక్యత ముఖ్యమని విశ్వసిస్తామని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని, దాని విలువలను నిలబెట్టడానికి కృషి చేస్తుందని కెటిఆర్ తెలిపారు.

## ఆయుష్ డాక్టర్లపై కేసులు కొట్టివేత

ప్రజాపక్షం/హైదరాబాద్: సైబరాబాద్, సంగారెడ్డి పీఎస్‌ల్లో ఆయుష్ వైద్యులపై నమోదైన కేసుల ఆధారంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టీఎంసీ) చర్యలు తీసుకోడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆయుర్వేద డాక్టర్లు అల్లోపతి వైద్యం చేశారంటూ నేరుగా టీఎంసీ చర్యలకు వీల్లేదంది. గతమే తనిఖీలు నిర్వహించిన పిటిషనర్లపై నమోదు చేసిన కేసులను కొట్టివేసింది. రూల్స్‌కు వ్యతిరేకంగా అల్లోపతి వైద్యం చేస్తున్నారన్న ఆరోపణల మేరకు దాడులు నిర్వహించిన టీఎంసీ కొందరు ఆయుర్వేద వైద్యులపై కేసులు నమోదు చేయడాన్ని తప్పుపట్టింది. లోకేష్ మరో ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ ఎన్.తుకారాంజీ విచారించి తుది ఉత్తర్వులను వెలువరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి టీఎంసీకి అధికారం లేదని, చర్యలు తీసుకునే నిబంధన ఆయుష్ కమిషనర్‌కు మాత్రమే ఉందని పిటిషనర్ల వాదన భారతీయ న్యాయ సంహిత(బీఎన్‌ఎస్) సెక్షన్ 318, 319 కింద నేరాలుగా పరిగణించే వీల్లేదన్నారు. ప్రభుత్వ ప్లీడర్ వాదిస్తూ, పిటిషనర్లు ఆయుర్వేదంలో అర్హత సాధించిన వైద్యులని, అల్లోపతి వైద్యం చేయడానికి వీల్లేదన్నారు. దీనిపై న్యాయమూర్తి, టీఎంసీకి అధికారం లేదని, పిటిషనర్లపై చర్యల అధికారం ఆయుష్ కమిషనర్‌కే ఉందని చెప్పారు. లేని అధికారంలో టీఎంసీ చర్యలు తీసుకోవడం చెల్లదని, ఆ రెండు పీఎస్‌ల్లోని కేసులు చెల్లవన్నారు. చట్ట నిబంధనల ప్రకారం కమిషనర్ తదుపరి చర్యలు అధికారం ఉందన్నారు.

## గొర్రెల కుంభకోణం కేసులో.. బాధితులను విచారించిన ఇడి



ప్రజాపక్షం/ హైదరాబాద్: గొర్రెల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు సోమవారం విచారించారు. ఈ కుంభకోణంపై ఎసిబి కేసు నమోదు చేసిన పలువురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇందులో మనిల్యాండరింగ్ జరిగిందనే కోణంలో ఎసిబి ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి కూడా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే నాలుగు రోజుల క్రితం ఎపి, తెలంగాణ రాష్ట్రలకు చెందిన పలువురు బాధితులకు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలోనే తెలంగాణ పశుసంవర్ధక శాఖకు గొర్రెలను విక్రయించి మోసపోయిన పలువురు బాధితులను ఇడి విచారించింది. 18 మంది రైతులకు చెందిన 133 యూనిట్‌లకు సంబంధించిన డబ్బులు తమకు రాలేదని బాధితులు అధికారులకు విచారణ సందర్భంగా తెలియజేశారు. యూనిట్‌కు యూనిట్ కు లక్ష యాభైయేనిమిది వేలు ప్రభుత్వం ఇస్తుంది..అందులోంచి తమకు ఎడి లు కేశవ సాయి, రవి కుమార్, కాంట్రాక్టర్ విక్రమ్, మొయినుద్దీన్, మధ్యవర్తులు మహీంద్రా, మాధవ్‌లు యూనిట్ కి లక్ష 22 వేలు ఇస్తాము అని ఒప్పించారని బాధితులు తెలియజేశారు. తమ నుంచి బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ కార్డులు కూడా తీసుకున్నారన్నారు. కానీ రెండు నెలల వరకు నగదు బదిలీ కాలేదు.. రోజుకో మాట చెప్పి కాలయాపన చేశారన్నారు. మొయినుద్దీన్, విక్రమ్, రవి పై అనుమానం వచ్చి జేడీ ని కలిసామని అయితే ప్రభుత్వం నుండి అమౌంట్ రిలీజ్ ఐపోయింది అని అధికారులు చెప్పాడంతో తాము మోసపోయామని గ్రహించామన్నారు. తాము ఇదే అంశంపై గచ్చిబౌలి పీఎస్ లో కేసు నమోదు చేసామని ఇడి అధికారులకు బాధితులు తెలిపారు. తమ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు రావాల్సిన నిధులు అందజేయాలని వారు ఈ సందర్భంగా కో రారు.

## కెటిఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌పోస్ట్ పోతుందనే భయంతోనే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/ హైదరాబాద్: జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు డిపాజిట్ రాకపోతే కెటిఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ పోతుందనే భయంతో నే డిపాజిట్‌ను దక్కించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ పని ముగిసిందని, ఇది వరకు జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి మూడవ స్థానం వ చ్చిందని, రానున్న జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నాలుగవ స్థానం కూడా రాదని ఎద్దేవా చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ పాపం కెసిఆర్ దేనని, నాలుగేళ్లుగా రూ. 6 వేల కోట్లు బకాయిలను చెల్లించలేదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియా సెంటర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కెటిఆర్ బడాయి మాటలను హైదరాబాద్ ప్రజలు నమ్మబోరన్నారు. హైదరాబాద్ నగరాన్ని సమూలంగా మార్చేందుకు సిఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, మూసిని అభివృద్ధి చేస్తున్నారని, హైడ్రాతో ఆక్రమణలు తొలగిస్తున్నామని , ఫోర్త్ సిటీ నిర్మిస్తున్నామని, నగరం లో శాంతి భద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ వివరించారు. డ్రగ్స్, గంజాయి పైన ఉక్కుపాదం మోపుతున్నామని, హైదరాబాద్‌కు కెసిఆర్ చేసింది ఏమీ లేదని, హైదరాబాద్ లో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి తప్ప ఇంకా ఏం చేశా రో సమాధానం చెప్పాలని ఆయన కెటిఆర్‌ను డిమాం డ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వల్లనే యూరియా కొరత ఏర్పడిందనే విషయం కెటిఆర్‌కు తెలిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. యూరియా విషయంలో కేంద్రంలోని బిజెపిని కెటిఆర్ ఒక్క మాట కూడా అనడం లేదన్నా రు. ఫీజు రియింబర్స్‌మెంట్ విషయంలో కెటిఆర్, హరీష్ రావు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాలుగేళ్లుగా బకాయిలు ఎందుకు పెట్టారో సమాధానం చెప్పాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## వ్యవసాయ సీజన్‌లో ఈ 15 రోజులు కీలకం

సరిపోను యూరియాను సరఫరా చేయాలి

కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రైతుల అవసరాలకు సరిపడా యూరియాను వీలైనంత త్వరగా కేటాయించి, పంపిణీ అయ్యేలా చూడాలని ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యవసరమని, ముఖ్యంగా ఈ 15 రోజులు వ్యవసాయ సీజన్‌లో కీలకమైనవి. ఈ సమయంలో రైతులకు ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు తీవ్రంగా దెబ్బతింటాయని రజత్ కుమార్ మిశ్రాకు మంత్రి తుమ్మల వివరించారు. . అందువల్ల యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని కోరాం అని తెలిపారు. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన యూరియా లోటును పూడ్చే విధంగా ఈ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరామని చెప్పారు. రానున్న 10 రోజుల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కోరగా.. ఈ వారంలో 80 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేస్తామని రజత్ కుమార్ మిశ్రా చెప్పారని అన్నారు.అందులో భాగంగానే సోమవారం ఐపిఎల్, సిఐఎల్, ఎన్‌బిసిఎల్ కంపెనీల నుండి ఓడల ద్వారా 40 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఈ కేటాయించిన యూరియా త్వరలోనే రాష్ట్రానికి చేరుకుంటుందని, దీంతో తెలంగాణ రైతుల యూరియా కష్టాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో, సెప్టెంబర్ మొదటి 15 రోజులలోనే 1,04,000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేసినట్లు అవుతుందని మంత్రి వివరించారు. మిగతా మొత్తం కూడా పంపించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.దేశీయ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోయినా, దిగుమతుల ద్వారా తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర కార్యదర్శి హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## ఆన్‌లైన్ యాప్‌లను రద్దుచేసి ఎఎన్‌ఎంలపై పని భారం తగ్గించాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న (ఎఎన్‌ఎం) ప్రస్తుత ఎంపిహెచ్‌ఎ (ఎఫ్)లు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటునారని మొబైల్ అప్లికేషన్స్ ను రద్దుచేసి పని భారాన్ని తగ్గించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఎన్‌ఎంలపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో కమిషనర్ కార్యాలయంముందు ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి నరసింహా మాట్లాడుతూ ఎఎన్‌ఎంల విధుల నిర్వహణలో భాగంగా మారిన పరిస్థితుల రిత్యా 2016లో ప్రభుత్వం ఆన్లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. మొదట్లో ఒకటి రెండు యాపులతో ప్రారంభమైన ఆన్లైన్ పనులు ప్రస్తుతం దాదాపు 14 మొబైల్ అప్లికేషన్స్‌కు చేరిందని, ఇందులో ఎన్‌సిడి, ఎంసిహెచ్, కెఐటి,లాంటి మొబైల్ అప్లికేషన్ లలో 20 నుండి 30 కాలమ్స్ ను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎన్‌సిడి యాప్ అప్లోడ్ కి సంబంధించి రాత్రి 11 గంటల నుండి 1గం ల మధ్యలోనే ఓపెన్ అవుతుంటే ఎలా పని చేయాలన్నారు. ఇక ఎన్‌సిడి విషయానికొస్తే వారు ప్రతి వ్యక్తిని స్క్రీనింగ్ చేయడంతో పాటు ఆ వ్యక్తికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఆన్లైన్ చేయాల్సి ఉండడంతో ఒక వ్యక్తికి సంబంధించి దాదాపు అర్థగంట తీసుకుంటుందన్నారు. మొత్తం పాపులేషన్ లో 35శాతంమందికి ఈ ఎన్సీడీ చేయాలని వారికి టార్గెట్ విధించారని, ఒకవైపు ఆఫ్లైన్ మరొకవైపు ఆన్లైన్ వర్కులు చేస్తూ వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో ఎఎన్‌ఎంలు హై బీపీ, లో బిపి, షుగర్, స్పాండ్లైటిస్, లతో పాటు కంటి చూపు కోల్పోవడం వంటి శారీరిక ఇబ్బందులతో పాటు అనేక మానసిక రుగ్మతలకు కూడా వారి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వైఖరిపై సరికాదని, కనీసం కార్మికుల సమస్యలను వినపించుకోకపోవడం దారుణమని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోటరామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్‌ఎం ల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె పద్మ, బి శ్యామల, కార్యదర్శులు తన్వీర్ సుల్తానా, పి జయమ్మ, కృష్ణవేణి, రాణి ఉపాధ్యక్షురాళ్ళు గోపమ్మ , సారిక, టీ జయమ్మ, పార్వతి, సంతోషిని, లతా, గీత, సరిత, సరోజిని, సంధ్యారాణి, యాదలక్ష్మి , ఫస్ట్ ఏఎన్‌ఎం యూనియన్ నాయకులు సరిత, సరస్వతి, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.



## ఫీ బకాయిల విడుదలకు ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్: పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని' డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు బిసి విద్యార్థి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలు,ఎస్‌సిలు ఉన్నత విద్యను అభ్యసించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓర్వడం లేదని ఆరోపించారు. విద్యాహక్కు రాజ్యాంగ బద్ధమని, కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి 22 నెలలు అవుతుందని, అనేక పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2.30 వేల కోట్లు అప్పులు తీసుకొచ్చిందని, కానీ పిల్లలకు చెందిన ఫీజులను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. మంత్రులు కోట్ల రూపాయాలను సంపాదిస్తున్నారని, మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని, ఫీజు బకాయిలు మంత్రులు నొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు విషయంలో రోల్ మాడల్‌గా అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, పిల్లలకు చెందిన ఫీజులు ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లిస్తున్నారని మండిపడ్డారు. చాలా కాలేజీలు మూతపడ్డాయని, సిబ్బందికి వేతనాలు ఇచ్చుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర చేస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఈ ధర్నాలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సి. రాజేందర్, అల్లంపల్లి రామకోటి, అనంతయ్య, అశీష్, లింగయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలో భద్రతా సంస్కృతిని బలోపేతం చేయాలి : జిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వేలో భద్రతా సంస్కృతిని బలోపేతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై ఆయన వివరణాత్మక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు , గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకుల, శాఖాపరమైన భద్రతను నిర్ధారించడానికి భద్రతా విధానాలు, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ఏదైనా భద్రతా కార్యకలాపాలు చేపట్టేటప్పుడు రైల్వే బోర్డు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు, లెవల్ క్రాసింగ్‌లు గేట్ల వద్ద అనధికార వాహనాల కదలికపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

ప్రొఫెసర్ ఎం.కోదండరామ్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకు ఉద్యమ కారులుగా నిరంతరం పోరాడుతామని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ సమావేశం హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఉద్యమ సంఘాల జెఎసి లు, ఉద్యమకారుల సంక్షేమ సంఘాలు, 1969 ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో తొలి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు కనీస గౌరవం ఇవ్వలేదని, ఉ ద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని సమావే శం తెలిపింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు సముచిత గౌరవం, ఇండ్ల స్థ లాల కేటాయింపు, అమరవీరుల కుటుంబాలకు పెన్షన్‌ను అమలు చేయాలని తీర్మానించింది. ఈ సమావేశంలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం. నర్సయ్యగౌడ్, సిపిఐ.ఎం.ఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.గోవర్ధన్, అడ్వకేట్ జెఎసి కన్వీనర్ రాజేందర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్,ఉద్యోగ జెఎసి నాయకులు ఎం.బి కృష్ణ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుల జెఎసి చైర్మన్ ప్రఫుల్ రామ్ రెడ్డి, వివిధ ఉద్యమకారుల సంఘాల నేతలు తెలంగాణ వెంకన్న, రమాదేవి, 1969 ఉద్యమకారులు తిప్పన సిద్దులు, టిజెఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్,దర్మార్జున్, పల్లె వినయ్ కుమార్, నిజ్జన రమేష్ ముదిరాజ్, తుల్జారెడ్డి, ఆశప్ప, హనుమంత్ రెడ్డి, సలీం పాషా తదితరులు పాల్గొన్నారు. సమావేశనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు వివిధ జెఎసిలు, సంఘాలుగా ఏర్పడి సంఘటితమై తెలంగాణ రాష్ట్రాన్ని సా ధించుకున్నామని, అదే స్ఫూర్తితో ఉద్యమ ఆ కాంక్షల సాధనకు, ఉద్యమకారుల సంక్షేమానికి అందరం సమిష్టిగా నిలబడదామని పిలుపునిచ్చారు. అందరి పోరాటాలు, త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఏ ఒక్కరితో రాష్ట్రం రాలేదన్నారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలతో కూడుకున్నదని, ఉద్యమకారులు ఎంతో నిజాయితీగా పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా గత పది సంవత్సరాల పాలన సాగిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రజాస్వామికంగా పాలన కొనసాగించాలని కోరారు.

## ఎన్‌డిపిఎల్‌పై ఈ నెల 30 వరకు స్పెషల్ డ్రైవ్


- రైళ్లు, బస్సులలో విస్తృత తనిఖీలు
- అధికారులను ఆదేశించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్



ప్రజాపక్షం/ హైదరాబాద్: నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్)పై ఈ నెల 30 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అధికారులను ఆదేశించారు. దసర పండుగ నేపథ్యంలో రాష్ట్రంలోకి అక్రమంగా భారీగా ఎన్‌డిపిఎల్ మద్యం వచ్చే అవకాశాలు ఉన్నందునా వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు, రైళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు. దీంతో పాటు పాత గోదాంలు.. రైస్ మిల్లుల్లు,చెక్‌పతోస్టు వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. దసర, బ తుకమ్మ పండుగలకు కొత్త బట్టలు, మద్యం సేవించడం పారిపాటి. ఇదే అదనుగా భావించే అక్రమార్కులు కల్తీ మద్యం, ఫ్యూరియస్ లిక్కర్, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారా అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. వీరి అగడాలకు, అమ్మకాల కు అడ్డకట్టవేయడానికి ఎక్సైజ్ శాఖ ఈ నెల 30 వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టడానికి ప్రణాళికలు తయారీ చేశారు. పక్షం రోజుల పాటు ఈ నెల 30 తేదీ వరకు అన్ని కోణాల్లో దాడులు నిర్వహించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అదేశాలు జారీ చేశారు.

### ప్రధానంగా వీటిపైనే దృష్టి..

ఎక్కువ ధరలు కలిగిన ప్రీమియం వీస్కీ మద్యాం బాటిళ్లలో తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని నింపి అమ్మకాలు చేపట్టె వారిపై, కల్తీ మద్యాం తయారు చేసే కేంద్రదాలపై, గోవా, ఢిల్లీ, హైర్యానా ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, డిఫెన్స్ మద్యాం రవాణ, దిగుమతి, అమ్మకాలపై వీటితోపాటు నాటుసారా తయారీ అమ్మకాలు, రవాణ, వినియోగంపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపాలని డైరెక్టర్ అన్ని తనిఖీ టీమ్‌లకు అదేశాలు జారీ చేశారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## నేటి నుంచి భారత్-అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ:** ఒకవైపు భారీ టారిఫ్‌లతో భారత్‌పై అమెరికా ఒత్తిడి పెంచుతుండగా, మరోవైపు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు కీలక చర్చలు జరగనున్నాయి. భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తదుపరి దశ చర్చల కోసం అమెరికా ముఖ్య ప్రతినిధి సోమవారం రాత్రి భారత్‌కు చేరుకున్నారు. చర్చలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో అమెరికా తరఫున దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల సహాయ వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ పాల్గొననుండగా, భారత్ తరఫున వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ప్రాతినిధ్యం వహించనున్నారు. తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై గత కొన్ని నెలలుగా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ, కొన్ని అంశాల్లో పురోగతి సాధించాల్సి ఉంది. ముఖ్యంగా వ్యవసాయ, డెయిరీ రంగాలను విదేశీ పోటీకి అందుబాటులో ఉంచాలన్న అమెరికా డిమాండ్‌పై భారత అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అత్యధిక జనాభాకు జీవనాధారమైన ఈ రంగాలు సున్నితమైనవని వారు స్పష్టం చేశారు.

## అమృత్‌సర్, గుర్దాస్‌పూర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటన

### బాధితులకు పరామర్శ






**చండీగడ్ :** ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం పంజాబ్‌లోని అమృత్‌సర్, గురుదాస్‌పూర్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రకృతి వైపరీత్యంతో ప్రభావితమైన వారిని పరామర్శించారు. వారితో మాట్లాడారు. ఆయనతో పాటు పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్, పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా, అమృత్‌సర్ ఎంపి గుర్జీత్ సింగ్ ఔజ్లా, గురుదాస్‌పూర్ ఎంపి సుఖ్‌జిందర్ సింగ్ రంధావా, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు. అమృత్‌సర్ చేరుకున్న తర్వాత, ఆయన అజ్నాలాలోని ఘోనేవాల్ గ్రామానికి వెళ్లి వరద బాధితులను కలిసి నష్టం గురించి ఆరా తీశారు. అజ్నాలాలోని అనేక ప్రాంతాలలో ఘోనేవాల్ గ్రామం కూడా ఉంది. ఇది వరద నీటికి తీవ్రంగా దెబ్బతింది. ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లను రాహుల్‌గాంధీ సందర్శించారు. వరద బాధిత ప్రజల మధ్య కూర్చుని వారితో సంభాషించారు. ఘోనేవాల్ గ్రామాన్ని సందర్శించిన తర్వాత రాహుల్‌గాంధీ అమృత్‌సర్‌లోని రాందాస్ ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక గురుద్వారా బాబా బుద్ధ సాహిబ్‌ను సందర్శించారు. ఆయన గురుద్వారాలో 'అర్దాస్' (ప్రార్థన)లో పాల్గొన్నారు. తరువాత గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్‌లోని వరద ప్రభావిత గుర్చక్ గ్రామాన్ని సందర్శించారు. ఎంపి సుఖ్‌జిందర్ రాంధావా వరద నీటితో ప్రభావితమైన వ్యవసాయ పొలాలను రాహుల్ గాంధీకి చూపించారు. రాహుల్‌గాంధీ బాధిత కుటుంబాలను కలుసుకుని సహాయక చర్యలను పరిశీలించారని కాంగ్రెస్ ఎక్స్‌లో పేర్కొంది. 'పంజాబ్‌లో వినాశకరమైన వరదలు వేలాది మంది జీవితాలను నాశనం చేశాయి. రాష్ట్రంలో భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగిందియ. ప్రజలు సహాయ శిబిరాల్లో నివసించాల్సి వచ్చింది. పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇంత క్లిష్ట సమయంలో, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పంజాబ్‌తో ఉన్నారు. వరద బాధిత కుటుంబాలకు సాధ్యమైన ప్రతి విధంగా సహాయం చేయాలని మేము ప్రతి ఒక్కరినీ విజ్ఞప్తి చేస్తున్నాము' అని పోస్ట్ హిందీలో పేర్కొంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్ అమృత్‌సర్‌లో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పంజాబ్ బాధను అర్థం చేసుకునే నాయకుడన్నారు. కాంగ్రెస్ నాయకురాలు నవజ్యోత్‌కౌర్ సిద్ధూ అమృత్‌సర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పర్యటన ఒక పెద్ద ప్రేరణ అన్నారు. పంజాబ్ దశాబ్దాలలో అత్యంత దారుణమైన వరద విపత్తును ఎదుర్కొంది. హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్‌లోని వాటి పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగడంతో పాటు కాలానుగుణంగా ప్రవహించే వాగుల ఫలితంగా వరదలు సంభవించాయి. పంజాబ్‌లో భారీ వర్షాలు కూడా వరదల పరిస్థితిని తీవ్రతరం చేశాయి. వరదల కారణంగా ప్రస్తుతం 56 మంది మరణించగా, 1.98 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరదల్లో అత్యంత ప్రభావితమైన జిల్లాల్లో గురుదాస్‌పూర్, అమృత్‌సర్, కపుర్తలా, పఠాన్‌కోట్, హోషియార్‌పూర్, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా, తర్న్ తరణ్ ఉన్నాయి. కాగా, ఈనెల 9న, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పర్యటన సందర్భంగా వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించిన తర్వాత పంజాబ్‌లో వరద పరిస్థితి మరియు నష్టాన్ని సమీక్షించారు. వరద బాధిత రాష్ట్రానికి ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న రూ. 12,000 కోట్లకు అదనంగా రూ. ,600 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఆయన ప్రకటించారు.

## ఐటి ఒప్పందంలో అమెరికా బాటలో నడవాలి

### పార్లమెంటరీ కమిటీ నివేదిక



**న్యూఢిల్లీ :** ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ) బాధ్యతల నుండి అమెరికా ఏకపక్షంగా వైదొలగడాన్ని, దాని దేశీయ పరిశ్రమలను రక్షించుకోవడానికి సుంకాలు విధించడాన్ని భారతదేశానికి సానుకూలమైన అవకాశంగా చూడాలని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. ఈ చర్యలను ఉపయోగించుకుని బహుళపాక్షిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అగ్రిమెంట్ (ఐటిఎ) కింద అనుకూలమైన నిబంధనలపై చర్చలు జరపాలని లేదా ఈ ఒప్పందం నుండి వైదొలగాలని, ఈ విషయంపై భారతదేశం ఆలోచించాలని కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై స్టాండింగ్ కమిటీ ఒక నివేదికలో 1997లో భారతదేశం సంతకం చేసిన ఈ ఒప్పందమే ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలను పట్టి పీడిస్తున్న సమస్యలకు కారణమని పేర్కొంది. పెద్ద ఎత్తున వాణిజ్య లోటు, భారతీయ తయారీదారులకు గట్టి పోటీ లేకపోవడం వంటి సమస్యలను ఇది సృష్టించిందని, దీని వల్ల అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే ప్రయోజనం కలిగిందని కమిటీ తెలిపింది. ఐటిఎతో భారతదేశం ఎదుర్కొన్న అనుభవం చాలా నిరుత్సాహకరంగా ఉందని గుర్తించినట్లు కమిటీ వర్గాలు తెలిపాయి. దీని కారణంగా భారతదేశంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొంది. అయితే, తక్కువ ధరలకు సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల వినియోగదారులకు ప్రయోజనం కలిగిందని కమిటీ అంగీకరించింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కమిటీకి తెలియజేసిన ప్రకారం, డబ్ల్యుటిఒలో ఐటిఎలో సభ్యురాలిగా ఉన్న భారతదేశం ఏకపక్షంగా ఒప్పందం నుండి వైదొలగడం సాధ్యం కాదు. అయితే, ప్రస్తుత పరిస్థితులలో అమెరికా ఉదాహరణను ఉదహరిస్తూ, ఇది సాధ్యమే అని కమిటీ సూచించింది. సభ్య దేశాల మధ్య పరస్పర జాతీయ ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక, బహుపాక్షిక స్థాయిలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఏర్పాటు చేయాలని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కోరింది. కమిటీ గత వారం తన నివేదికను ఆమోదించి లోక్ సభ స్పీకర్‌కు సమర్పించింది. పార్లమెంట్ తదుపరి సమావేశంలో దానిని ఆమోదించే అవకాశం ఉంది.

## అదానీ సంస్థలకు 1,050 ఎకరాల భూమి బహుమతి

### బిహార్‌లో బిజెపి ఓటమి ఖాయమైనందువల్లే ఈ చర్య : కాంగ్రెస్ ఆరోపణ



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని భాగల్‌పూర్‌లో 1,050 ఎకరాల భూమిని మోదీ ప్రభుత్వం పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం అదానీ సంస్థలకు 'బహుమతి'గా ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటమి ఖాయమైనట్లు బిజెపి గ్రహించినందునే ఈ చర్యకు పూనుకుందని విమర్శించింది. అయితే ఈ ఆరోపణలపై కేంద్రం, బిహార్ ప్రభుత్వం లేదా అదానీ గ్రూప్ నుండి వెంటనే స్పందన రాలేదు. సోమవారం ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ బిజెపి ఎన్నికల్లో ఓడిపోతుందని భావించినప్పుడల్లా, వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి ముందుగానే బహుమతులు ఇస్తాయని పేర్కొన్నారు. బిహార్ భాగల్‌పూర్‌లోని పిర్‌పైంటిలో 33 సంవత్సరాల పాటు సంవత్సరానికి 1 రూపాయికి పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం 10 లక్షల చెట్లు, 1,050 ఎకరాల భూమిని 'రాష్ట్ర సేథ్' గౌతమ్ అదానీకి ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు బిహార్‌ను సందర్శిస్తున్నప్పుడు, అక్కడి గ్రామస్తులను గృహ నిర్బంధంలో ఉంచారు, తద్వారా వారు నిరసన వ్యక్తం చేయకుండా చేశారని మండిపడ్డారు. మహారాష్ట్రలో ఎన్నికలు జరిగినప్పుడు, పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్, ధారవిని గౌతమ్ అదానీకి అంతకు ముందు ఇచ్చారని, అదేవిధంగా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలకు ముందు గౌతమ్ అదానీకి ప్రాజెక్టులు ఇచ్చారని, ఇలా చెప్పుకుంటూ పోతా చాలా ఉన్నాయన్నారు. తాజాగా ప్రధాని మోదీ 1,050 ఎకరాల భూమిని అదానీకి ఇవ్వబోతున్నారని ఖేరా పేర్కొన్నారు. 'ఇది 21,400 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 2,400 మెగావాట్ల ప్రాజెక్ట్. దీనిపై బడ్జెట్‌లో ప్రకటన చేశారు. అయితే, ఆ సమయంలో, ప్రభుత్వం స్వయంగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ తరువాత వెనక్కి తగ్గి ఈ ప్రాజెక్టును గౌతమ్ అదానీకి అప్పగించింది' అని ఆయన అన్నారు. బిహార్ భూమిపై రాష్ట్ర డబ్బుతో ప్లాంట్ నిర్మించి, దాని బొగ్గు నుండి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని, అయితే రాష్ట్ర ప్రజలకు యూనిట్‌కు 6 రూపాయలకు అమ్ముతున్నారని ఖేరా అన్నారు, ఇది 'డబుల్ లూటీ' అని ఆరోపించారు. బిజెపి మొదట 'ఏక్ పెడ్ మా కే నామ్' వంటి ప్రచారాలను నిర్వహిస్తుందాని, ఆ తరువాత రైతులు తమ తల్లిగా భావించే అదే భూమిని కేవలం 1 రూపాయికి విలువకడుతుందన్నారు. రైతులను బెదిరించి, పెన్సిల్‌తో సంతకం చేయమని బలవంతం చేసి, వారి భూమిని లాక్కున్నారని, అదే ప్లాంట్ నుండి ఉత్పత్తి చేయబడిన విద్యుత్తును బిహార్ ప్రజలకు యూనిట్‌కు 6.75 రూపాయల చొప్పున విక్రయిస్తారన్నారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లకు ఈ రేటు 3 నుండి 4 రూపాయలు అని అన్నారు.

## రైతులపై ఫడ్నవీస్ సర్కార్ ఉదాసీన వైఖరి

### ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ విమర్శ



**నాశిక్ :** రైతుల దుస్థితి పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోపించారు. రాష్ట్రంలో తీవ్రంగా నెలకొన్ని వ్యవసాయ సంక్షోభం వైపు ప్రభుత్వం దృష్టి పెట్టేలా చేసేందుకు ప్రతిపక్షం తమ నిరసనను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. రైతుల కష్టాలను ఎత్తిచూపడానికి నాసిక్‌లో ఎన్‌సిపి (ఎస్‌పి) నిర్వహించిన 'ఆక్రోష్ మోర్చా'కు పవార్ నాయకత్వం వహించారు. అనేక మంది ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు, కార్మికులతో కలిసి పవార్ ఓపెన్ జీపులో నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం వర్షాభావ పరిస్థితిని ప్రకటించాలని, రైతులకు పూర్తి రుణ మాఫీ చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఒక నెలలో రుణ మాఫీ ప్రకటించకపోతే మంత్రులను రాష్ట్రంలో తిరగనివ్వమని ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్, లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సులే హెచ్చరించారు. కాగా, నాశిక్‌లో జరిగిన ర్యాలీలో పవార్ మాట్లాడుతూ 'ఛత్రపతి శివాజీ మహారాజ్ ముందు చేతులు జోడించి దేవభావు (దేవేంద్ర ఫడ్నవీస్) చేస్తున్న పోస్టర్లను మీడియా అంతటా చూశాము. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకున్న పురాణ యోధుడు రాజు మార్గాన్ని ఆయన అనుసరించాలన్నారు. సోమవారం తన పార్టీ నిర్వహించిన మోర్చా ప్రారంభం మాత్రమేనని మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'దేవాభావూ... చుట్టూ చూడండి. ఏమి జరుగుతుందో చూడండి. నేపాల్‌లో ప్రజలు తమ ఆకాంక్షలను తీర్చడంలో విఫలమైన ప్రభుత్వాన్ని పడగొట్టారు' అని ఆయన గుర్తుచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల దుస్థితి పట్ల ఉదాసీనంగా ఉందని మాజీ కేంద్ర మంత్రి ఆరోపించారు. రైతులకు తమ పంటలకు తగిన ధర లభించడం లేదని, ఎగుమతులపై నిషేధం ఉందని ఆయన వివరించకుండానే పేర్కొన్నారు. 'అప్పు అనేది రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద ఇబ్బందని, ఈ సమస్యకు పరిష్కారం ఉండాలన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని ప్రభుత్వం చూస్తూనే ఉంటే, వేలల్లో ఉన్న (రైతు) ఆత్మహత్యలు లక్షల్లోకి వెళ్లవచ్చు అని, మనం మౌనంగా ప్రేక్షకులుగా ఉండలేమన్నారు. నిరసన సందర్భంగా ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు ఉల్లిపాయలు, ద్రాక్ష, ఇతర పంటలకు తగిన కనీస మద్దతు ధర ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. 'గత ఎనిమిది సంవత్సరాలలో మహారాష్ట్ర జాతీయ ఖజానాకు జిఎస్‌టి రూపంలో రూ. 2 లక్షల కోట్లు ఇచ్చింది. రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 35,000 కోట్లు ఎందుకు ఇవ్వకూడదు?' అని ఎన్‌సిపి (ఎస్‌పి) ప్రధాన కార్యదర్శి రోహిత్ పవార్ ప్రశ్నించారు.

## బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసు

### ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ మృతి కేసులో డ్రైవర్ అరెస్టు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బీఎండబ్ల్యూ కారు హిట్ అండ్ రన్ కేసులో సోమవారం ఆ కారు డ్రైవర్ గగన్‌ప్రీత్‌ను అరెస్టు చేశారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ నవజ్యోత్ సింగ్, ఆయన భార్య సందీప్ కౌర్ బైక్‌పై వెళ్తుండగా ఆ వాహనాన్ని బీఎండబ్ల్యూ కారు ఢీకొంది. ఆ సమయంలో కారును గగన్‌ప్రీత్ డ్రైవ్ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్థికశాఖ ఆఫీసర్ నవజ్యోత్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఇదే ప్రమాదంలో గాయపడ్డ బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. ఆమెను పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. హిట్ అండ్ రన్ ఘటనలో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఎండబ్ల్యూ కారును ఓ మహిళ డ్రైవ్ చేసిందని, సెంట్రల్ వర్జ్‌ను ఢీకొన్న తర్వాత ఆ వాహనం కంట్రోల్ తప్పి, బైక్‌ను ఢీకొన్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ వయసు 38 ఏళ్లు. ఆమె భర్త పరీక్షిత్ మక్కడ్ వయసు 40 ఏళ్లు. ఢిల్లీ కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. బైక్‌ను ఢీకొన్న తర్వాత బాధితులు నవజ్యోత్, సందీప్ కౌర్‌లను ఓ వ్యాన్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. జీటీబీ నగర్‌లో ఉన్న న్యూలైఫ్ ఆస్పత్రికి వాళ్లను తరలించారు. అయితే ఆ ఆస్పత్రి ఘటనా స్థలికి 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాగా ఆ ఆస్పత్రికి, బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్‌కు నేరుగా సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

## రాజకీయ పార్టీలు 'పని ప్రదేశాలు' కావు లైంగిక వేధింపుల చట్టం వర్తించదు : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను 'పని ప్రదేశం'గా పరిగణించజాలమని పేర్కొంది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగమాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమానిఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. 'యజమాని', 'ఉద్యోగి', 'పని ప్రదేశం' వంటి పదాలకు చట్టంలో విస్తత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1)(జి),21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.

## ఆర్జేడీ, కాంగ్రెస్ వల్లే బిహార్‌కు నష్టం : ప్రధాని మోదీ



**పాట్నా:** ఆర్‌జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన కారణంగా బిహార్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం తాము చేపడుతున్న అభివద్ధిని చూసి ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో పర్యటించిన ప్రధాని, జాతీయ మఖానా బోర్డుతో పాటు 36 వేల కోట్ల విలువైన అభివద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పేదలకు మద్దతివ్వటమే తన విధానమని ప్రధాని మోదీ తెలిపారు. అందులో భాగంగానే నాలుగు కోట్ల ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరో మూడు కోట్ల గహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు.

## బొకారోలో నక్సలిజం అంతమైంది

### కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లోని బొకారోలో నక్సలిజం అంతమైనట్లు కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ద్వారా ట్వీట్ చేశారు.త్వరలో యావత్ దేశం నక్సల్స్ సమస్య నుంచి విముక్తి పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ వివరాలను ఆయన వెల్లడించారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో ఘన విజయం సాధించామన్నారు. సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్ , రాష్ట్ర పోలీసులు ఈ సక్సెస్‌లో భాగస్వామ్యులైనట్లు తెలిపారు. తలపై కోటి రూపాయల నజరానా ఉన్న నక్సల్ కమాండర్ సీసీఎం సహదేవ్ సోరెన్ అలియాస్ పర్వేశ్‌ను హతమార్చినట్లు ఆయన చెప్పారు. ఇతనికి తోడు మరో ఇద్దరు నక్సల్స్‌ను హతమార్చామన్నారు. రఘునాథ్ హెంబ్రమ్ అలియాస్ ఛంచాల్, బిర్సేన్ గంజూ అలియాస్ రామ్‌కేల్వాన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆపరేషన్ ద్వారా బొకారో ప్రాంతంలో ఉన్న నక్సలిజం అంతమైనట్లు షా వెల్లడించారు. యావత్‌దేశం త్వరలో విముక్తి చెందుతుందుతుందన్నారు.

## సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్?

### రైల్వే రిజర్వేషన్ విధానంలో కీలక మార్పు



**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ విధానానికి సంబంధించి రైల్వే బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. మొదటి 15 నిమిషాలు కేవలం అథార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ లేదా అధికారిక యాప్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇది తత్కాల్ బుకింగ్ విధానంలో అమల్లో ఉంది. అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్లకు కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. ఏదైనా రైలుకు ప్రస్తుతం 60 రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు సౌలభ్యం ఉంది. కానీ, తత్కాల్ టికెట్ల మాదిరిగానే బుకింగ్ ప్రారంభమైన వెంటనే అక్రమార్కులు సాఫ్ట్‌వేర్ సాయంతో టికెట్లను బుక్ చేసేస్తున్నారు. దీంతో సాధారణ ప్రయాణికులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ టికెట్లు పక్కదోవ పట్టకుండా సామాన్య యూజర్‌కు ఆ ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే బోర్డు పేర్కొంది. ఈ మేరకు అన్ని జోనల్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చింది.

## మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్ ప్రమాణం



**ముంబై:** మహారాష్ట్ర గవర్నర్ గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు. ఈనెల 12న భారత 15వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాజీనామాతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

## అమలుకాని హామీలకు పెట్టింది పేరు మోదీ

### ప్రధాని హామీలపై తేజ్‌ప్రతాప్ వ్యాఖ్య



**పాట్నా :** ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ కారణాలతోనే బీహార్‌కు వస్తారని ఆర్జేడీ బహిష్కత నేత, ఆ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ విమర్శించారు. ఇప్పుడు బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయని, అందుకే ఇక్కడి ప్రజలపై ప్రధాని వరాల వర్షం కురిపిస్తున్నారని తేజ్ ప్రతాప్ విమర్శించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ప్రధాని ఇదేరకంగా బీహార్‌కు వచ్చారని, షుగర్ మిల్లును ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని తేజ్‌ప్రతాప్ గుర్తుచేశారు. కానీ ఇప్పటికీ ఇక్కడ షుగర్ మిల్లు ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ అబద్ధపు హామీలు ఇచ్చే ప్రధాని పర్యటన బీహార్ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపబోదని అన్నారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ విమానాశ్రయాలు, వంతెనలను ప్రారంభిస్తున్నారని, కానీ ఇక్కడ ఇప్పుడు ప్రధాన సమస్య వరద పరిస్థితి అని తేజ్‌ప్రతాప్ చెప్పారు. వరదల్లో జవానియా గ్రామం పూర్తిగా కొట్టుకుపోయిందని, అయినా ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. జవానియా ప్రజలు ఏడుస్తున్నారని, ప్రధాని అక్కడికి వెళ్లాలని కోరారు. రఘోపూర్‌లో కూడా పరిస్థితి అలాగే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

## హఠాత్తుగా ఆగిన మోనో రైలు.. ప్రయాణికులు భద్రం

**ముంబై:** ముంబైలో మోనోరైలు సేవల్లో మరోసారి అంతరాయం ఏర్పడింది. రైలు సోమవారం ఉదయం హఠాత్తుగా ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మోనో రైలు వడాలా వైపు వెళ్తోంది. అయితే, సాంకేతిక సమస్య కారణంగా రైలు హఠాత్తుగా ఆగిపోయింది. దీంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అందులోని వారందరినీ సురక్షితంగా కాపాడినట్లు ముంబై మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెల్లడించింది.

# కేంద్రానికి 'వక్ఫ్' ఎదురుదెబ్బలు

ముస్లింల వక్ఫ్ ఆస్తుల విషయంలో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుంటూ తెచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025పై సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన మధ్యంతర తీర్పు ఆ చట్టాన్ని మొత్తంగా స్టే చేయక పోవటం ప్రభుత్వానికి సంతోషకారకమే కావచ్చు, కాని కొన్ని ముఖ్యమైన నిబంధనలను నిలుపుదలలో ఉంచటం మోడీ ప్రభుత్వ ఉద్దేశానికి బ్రేకు వేసింది. తుది తీర్పులో మరిన్ని సానుకూలతలు సాధిస్తామని పిటిషన్ దారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలను ఉద్ధరించటానికి, వక్ఫ్ ఆస్తుల నిర్వాహకుల దోపిడీని అరికట్టి చట్టబద్ధమైన వక్ఫ్‌లకు భద్రత చేకూర్చటం ప్రభుత్వం ఉద్దేశంగా, ట్రిపుల్ తలాఖ్ రద్దు చట్టం తదుపరి తీసుకువచ్చిన గొప్ప సంస్కరణగా హోంమంత్రి అమిత్ షా సవరణ బిల్లును గట్టిగా సమర్థించారు. కాని ప్రభుత్వ నిజ ఉద్దేశం ముస్లిం మత వ్యవహారాల్లో రాజ్యాంగ విరుద్ధంగా జోక్యం చేసుకోవటంగా ఆనాడే జాయింట్ పార్లమెంటులో, పార్లమెంటరీ కమిటీలో, ప్రతిపక్ష సభ్యులు వాదించారు. అయితే ప్రభుత్వం ఏ మాత్రం పునరాలోచన చేయలేదు – మొండిగా ముందుకెళ్లింది.

ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్, జస్టిస్ ఎ.జి.మాషిలతో కూడిన బెంచి మే 22 న తాత్కాలిక తీర్పును రిజర్వు చేసింది. చట్టాన్ని మొత్తంగా స్టే చేయాలని పిటిషనర్‌లు వాదించనందున "స్టే కోసం" విజ్ఞప్తిని తిరస్కరించింది. సుప్రీంకోర్టు బెంచి 5 అంశాలపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరికొన్ని ప్రధాన వివాదాంశాల్లో జోక్యం చేసుకోలేదు. అవి – 'వక్ఫ్–బై–యూసర్ 'రద్దు', షెడ్యూల్డు ప్రదేశాలు, సంరక్షిత పురాతన కట్టడాలపై వక్ఫ్‌లు సృష్టించటంపై నిషేధం, ముస్లింలు మాత్రమే వక్ఫ్‌లు ఏర్పాటు చేయగలరన్న షరతు, వక్ఫ్ చట్టానికి లిమిటేషన్ చట్టం వర్తింపు వగైరా. అయితే తుది విచారణ సందర్భంలో ఈ అన్ని విషయాలపైన, ప్రస్తుత మధ్యంతర తీర్పులోని అభ్యంతరకర అంశాలపైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, తదితరులు, ఎఐఎంపిఎబి, ఎఐఎస్‌పిఎల్‌బి తదితర ముస్లిం మత వ్యవహారాల సంస్థలు ఈ తాత్కాలిక తీర్పును స్వాగతించాయి.

ప్రజాపక్షం
16-09-2025, మంగళవారం

ఈ తీర్పు ఏమి చెప్పింది? సెంట్రల్ వక్ఫ్ బోర్డులో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిం యేతరులను నియమించే అత్యంత ప్రధానమైన వివాదానికి తాత్కాలిక పరిష్కారం చెప్పింది. 20మంది సభ్యులతో కూడిన సెంట్రల్ వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులు నలుగురికి మించకూడదు. 11మంది సభ్యులతో కూడిన రాష్ట్ర బోర్డుల్లో వారు ముగ్గురికి మించరాదు. వక్ఫ్‌ను ప్రకటించే ఏ వ్యక్తి అయినా తాను ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తున్నట్లు నిరూపించాలన్న క్లాజును స్టే చేసింది. అట్టి నిర్ణయం చేసే ఏర్పాటుకు రూల్సు రూపొందించేవరకు ఇది అమలులో ఉంటుంది. వక్ఫ్ ఆస్తుల స్థితిపై తీర్పు చెప్పే అధికారం కలెక్టర్‌కు ఇచ్చిన క్లాజును నిలుపు చేసింది. రికార్డుల్లో మార్పులు చేయటం చెల్లదని చెప్పింది. ట్రిబ్యునల్ లేదా హైకోర్టు తుది తీర్పు ఇచ్చేవరకు రికార్డులు మార్చే అధికారం ఉండదని చెప్పింది. వక్ఫ్ బోర్డు ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా 'సాధ్యమైన మేరకు' ముస్లిం సమాజానికి చెందిన దాని ఎక్స్ అఫిసియో కార్యదర్శిని నియమించాలని సూచించింది.

వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ అనేది ధర్మాదాయ, మత ప్రయోజనాలకోసం అనగా మసీదులు, స్కూళ్లు, ఆసుపత్రులు లేదా ఇతర పబ్లిక్ ఆస్తుల నిమిత్తం ముస్లిం ఇచ్చే దానం అని చట్టం పేర్కొన్నది. మరో విశేషమేమంటే, విక్రయం, బహుమతి, వారసత్వం, భాగస్వామ్యం పేరుతో వక్ఫ్ ఆస్తిని ఎవరికీ బదలాయించటానికి వీల్లేదు. ముతావల్లీలు (వక్ఫ్ సంరక్షకులు) ముప్పదేళ్లపాటు వక్ఫ్‌ను రిజిస్ట్రేషన్ చేయించకపోతే, అట్టి దరఖాస్తుతోపాటు వక్ఫ్ డీడ్ జతపరచాలన్న ప్రస్తుత నిబంధనను వారు ప్రశ్నించలేరని కోర్టు చెప్పింది.

# లేని చరిత్ర కోసం పాకులాట!

## చారిత్రక పోరాటానికి మతం రంగు అద్దే ప్రయత్నం

ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం, జరిగింది జరిగినట్లుగా ఒప్పుకోవడం ఒక సలక్షణం. కానీ లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడం లేదా ఆ ప్రయత్నానికి పూనుకోవడం ఖచ్చితంగా వంచనే. తమకు సంబంధం లేని పోరాటంలో తమ వాటా కోసం ప్రయత్నించడం లేదా మొత్తం పోరాటాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నంలో బిజెపి ఉంది. భారతీయ జనతా పార్టీకి కట్టు, బొట్టు, గుడి, బడి ఇలా ఏదైనా ఆచార వ్యవహారాల మాటున మతాన్ని చొప్పించడం జరుగుతుంది. ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షర లిఖిత మైన సాయుధ తెలంగాణ పోరాటాన్ని సైతం మతపరమైన పోరాటంగా చిత్రీకరించి లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నది. అసలు తెలంగాణ పోరాటం ఎందుకు మొదలైంది, ఆ పిలుపునిచ్చింది ఎవరు, ఆ పిలుపులో భాగస్వాములైంది ఎవరు, చివరికి ఏమైంది ఇవేవి బిజెపి నేతలకు పట్టవు. నైజాం రాజు ముస్లిం కాబట్టి ఆయనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని హిందువుల, ముస్లిం వ్యతిరేక పోరాటంగా చిత్రీకరిస్తున్నది.

వాస్తవానికి 1947 సెప్టెంబర్ 11న తెలంగాణలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన సమయంలో ఉన్న పరిస్థితులు ఏమిటి? ఒక పక్క భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రజలు స్వేచ్ఛావాయులు పీల్చారు. కానీ తెలంగాణలో అది జరగలేదు. అప్పటికీ ముస్లిం నైజాం నవాబు ఆధీనంలోని హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనం కాలేదు. బ్రిటిష్ వారి క్రింద సామంతుడిగా ఉన్న మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాధినేత. ప్రత్యేక కరెన్సీతో పాటు ప్రపంచంలోనే ధనవంతుడైన రాజుగా ఆయనకు పేరుంది. ప్రజల్లో తీవ్రమైన వేదన ఉండేది. గ్రామాల్లో వెట్టిచాకిరితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాట్లాడే హక్కు లేదు. ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేదు. ఎక్కడ చూసిన దొరలు, జాగీర్‌దార్లు, జమీందార్ల దౌర్జన్యాలు ఉండేవి. పండిన పంటను ఇంటికి తెచ్చుకునే పరిస్థితి లేదు. ఆఖరుకు వండిన అన్నం కూడా తినగలమన్న నమ్మకం ప్రజల్లో లేకుండాపోయింది. అటువంటి సమయంలో 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి (ఆంధ్రమహాసభ), బద్దం ఎల్లారెడ్డి (సిపిఐ), మగ్దూం మొహియుద్దీన్ (ఎఐటియుసి) సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారు. సాయుధ పోరాటానికి ప్రజలు సానుకూలంగా స్పందించారు. పటేళ్లు, పట్వారీల ఆగడాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో తిరుగుబాటు మొదలైంది. ఆ తిరుగుబాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దావానలంలా సాగింది. ఊరు ఊరుకు పోరాటం పాకింది. గ్రామాలు విముక్తి చేయబడ్డాయి. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడం జరిగింది. ఈ పోరాటంలో నాలుగున్నర వేలమంది అమరులయ్యారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల చేతిలో ఓటమి కన్న కేంద్ర ప్రభుత్వంతో రాజీ పడి బతకాలన్న ఆలోచన నైజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు వచ్చింది. రహస్య ఒప్పందంతో ఒక అంగీకారానికి వచ్చిన తర్వాత యూనియన్ సైన్యాలు తెలంగాణలోకి వచ్చాయి. యూనియన్ సైన్యాలను నైజాం సైన్యాలు ఎక్కడ ప్రతిఘటించ లేదన్నది చారిత్రిక సత్యం.

కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే తెలంగాణ భారతదేశంలో విలీనమైంది. సామాన్యులు సాయుధులై పోరాటం చేశారు. కారం, రోకలి, ఒడిషల, కర్ర, గొడ్డలి ఇలా ఏదో ఒక ఆయుధంతో ప్రజలు పోరాటం చేశారు. ఇది చరిత్ర. ఈ పోరాట పూర్వాపరాలను అప్పటి వాస్తవిక పరిస్థితులను అర్థం చేసుకోకుండా సాయుధ పోరాటంలో ఏ పాత్ర లేని బిజెపి దీనిని మతపరమైన పోరాటంగా ఇప్పుడు ప్రజల ముందు ఉంచుతుంది. 83వేల చదరపు కిలో మీటర్ల మేర వ్యాపించిన నైజాం రాజ్యంలో 50 శాతం భూభాగం తెలంగాణకు చెందింది. 28 శాతం మహారాష్ట్రకు, 22 శాతం కర్నాటకలో ఉంది. అప్పట్లో నిజాం రాజ్యంలో 1.64 కోట్ల మంది జనాభా ఉంటే 80 లక్షల మంది తెలుగు మాట్లాడే వారు ఉన్నారు. అధికార భాషగా ఉర్దూ ఉండడంతో తెలుగు మాట్లాడే వారు సైతం తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. అందుకే కమ్యూనిస్టుల సాయుధ పోరాటానికి మరింత ఊపు వచ్చింది.

జమీందార్లు, జాగీర్‌దార్లు అంతా హిందువులే. రాజు ముస్లిం కావచ్చు కానీ గ్రామాల్లో అరాచకం చేసే పటేళ్లు, పట్వారీలు కూడా హిందువులే ఎక్కువగా ఉండేవారు. ఇదే సమయంలో సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చిన మగ్దూం మొహియుద్దీన్‌తో పాటు సాయుధ పోరాటంలో అమరుడైన బందగి, తన కవితలతో, వార్తలతో ప్రజలను చైతన్యపరిచిన సోయాబుల్లాఖాన్ కూడా ముస్లిమే. దీనిని బట్టి మహత్తర తెలంగాణ పోరాటం హిందు, ముస్లిం పోరాటం కాదు. భూమి భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటం. సాయుధ పోరాటం తెలంగాణ ప్రజల జీవన సంస్కృతిలో ఒక గొప్పమార్పును తీసుకు వచ్చింది. బాంచన్ దొర అంటూ బతికేవాళ్లు బందూకులు పట్టారు. సాయుధ పోరాటం భూమి విలువను ఎజెండాలోకి తీసుకు వచ్చింది. రాచరిక వ్యవస్థలకు చరమగీతం పాడడంతో పాటు గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ తమ పని తాము చేసుకునే ఒక మహత్తర అవకాశాన్ని కల్పించింది. పర పీడనకు తిలోదకాలు పలికేందుకు కారణమైంది. భారతదేశ సమగ్రతను పరిపూర్ణం చేసింది. అనేక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. ఇంతటి మహోద్యమాన్ని ఒక మత పోరాటంగా చూపి బిజెపి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుంది. సాయుధ పోరాట వారోత్సవాల వేళ ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం వామపక్ష, అభ్యుదయ శక్తులపై ఉన్నది. తెలంగాణ ప్రజల ధిక్కార స్వరం సాయుధ పోరాటం.

పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తూనే ఈ మత ప్రచారాన్ని తిప్పికొడుతూ నేటి యువతకు చారిత్రిక వాస్తవాన్ని తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జంకెందుకు :**

అధికారంలోకి రాక ముందు ఒక తీరుగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో తీరుగా వ్యవహరించడం పాలకులకు అలవాటుగా మారింది. తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ తెలంగాణ విలీనాన్ని అధికారికంగా నిర్వహించాలన్న ఆలోచనను పక్కదారి పట్టించింది. మేము వస్తే విలీనాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన ఫలితం శూన్యం.

ఆ తర్వాత కాంగ్రెస్ కూడా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు జరిగిన తర్వాత మేము విలీనాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన అది అమలు కాలేదు. పాలకులు ఎందుకు జంకు ప్రదర్శిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించటం చరిత్రకు నీరాజనం అవుతుంది.

**ఏనుగు వెంకటేశ్వరరావు,**
ప్రజాపక్షం, ఖమ్మం

# పౌర సమాజం విస్మరిస్తున్న నిశ్శబ్ద సంక్షోభం

మానసిక ఆరోగ్యం ప్రజా ఆరోగ్యంలో అంతర్భాగం; ఇది మానసిక అనారోగ్యం లేకపోవడం కంటే ఎక్కువ. వ్యక్తి శ్రేయస్సు ప్రభావవంతమైన పనితీరుకు పునాది. ఇందులో మానసిక శ్రేయస్సు, మానసిక రుగ్మతలు నివారణ, చికిత్స మరియు పునరావాసం మానసిక ఆరోగ్యంలో భాగమే.

భారతదేశంలో మానసిక ఆరోగ్య సమస్యల భారం 10,000 జనాభాకు 2443 వైకల్యంసర్దుబాటు జీవిత సంవత్సరాలు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది; 100000 జనాభాకు వయస్సు సర్దుబాటు ఆత్మహత్య రేటు 21.1.2012 – 2030 మధ్య మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కలిగే ఆర్థిక నష్టం 1.03 ట్రిలియన్ డాలర్లు అని అంచనా వేయబడింది. మానసిక ఆరోగ్య విధానం, 2014 నాణ్యమైన సేవా నిబంధనల కోసం భాగస్వామ్య హక్కుల ఆధారిత విధానాన్ని సమర్థిస్తుంది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులను రక్షించడానికి, ప్రోత్సహించడానికి అలాగే నెరవేర్చడానికి సేవలను అందించడానికి చట్టపరమైన చట్రాన్ని అందిస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి వికలాంగుల హక్కుల సమావేశానికి అనుగుణంగా ఉంటాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం ఉద్దేశం మానసిక ఆరోగ్య, వెల్ నెస్ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో నాణ్యమైన సంరక్షణ అందించడం. డి అడిక్షన్ కేంద్రాలు, పునరావాస సేవ లు కూడా అందుబాటులో ఉన్నాయి. మానసిక ఆరోగ్యాన్ని నిర్ణయించే వాటిలో ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన మరియు ఇతరులతో పరస్పర చర్యలు నిర్వహించే సామర్థ్యం వంటి వ్యక్తిగత లక్షణాలు ఉంటాయి. అదనంగా, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ మరియు పర్యావరణ కారకాలు నిర్దిష్ట మానసిక, వ్యక్తిత్వం, జన్యుపరమైన కారకాల వలె పాత్ర పోషిస్తాయి. మానసిక ఆరోగ్యానికి మద్దతుగా అవగాహన పెంచడం, ప్రయత్నాలను సమీకరించడం పరిస్థితిని పరిష్కరించడానికి అవసరం. మానసిక ఆరోగ్య ప్రచారంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రోత్సహించి, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించే వాతావరణాన్ని సృష్టించడం ఉంటుంది. జాతీయ మానసిక ఆరోగ్య విధానాలు చట్టపరమైన చట్రాల ద్వారా వాతావరణాన్ని కల్పించడం మానసిక ఆరోగ్య రుగ్మతల ప్రభావవంతమైన నిర్వహణకు, మానసిక ఆరోగ్య ప్రమోషన్‌ను నిర్ధారించడానికి విస్తృత దిశలను అందించడానికి అత్యవసరం. దీనికి బహుళ రంగాల తోడ్పాటుతో పాటు జాతీయ విధానం అవసరం. మానసిక ఆరో గ్య రుగ్మతల చికిత్సకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇది మొత్తం ప్రభుత్వ విధానం ద్వారా ప్రమోషన్, నివార ణ, చికిత్స, కోలుకోవడానికి సమగ్ర వ్యూహాలను కోరుతుంది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో సాధారణ మానసిక రుగ్మతలకు ఖర్చుతో కూడుకున్న చికిత్స లభ్యత, ప్రాప్యతను ప్రోత్సహించడానికి విధాన రూపకర్తలను ప్రోత్సహించాలి. మానసిక ఆరోగ్యం అనేది చాలాకాలంగా పౌర సమాజం విస్మరిస్తున్న నిశ్శబ్ద సంక్షోభం. వర్క్‌ప్లేస్ సర్వేలో మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కోషెంట్ అనేది ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా మానసిక అనారోగ్యాలు సర్వసాధారణం. మానసిక అనారోగ్యాలలో తేలికపాటి నుండి మితమైన, తీవ్రమైన వరకు తీవ్రతలో తేడా ఉన్న అనేక విభిన్న పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులను వివరించడానికి రెండు విస్తృత వర్గాలను ఉపయోగించవచ్చు:ఏదైనా మానసిక అనారోగ్యం, తీవ్రమైన మానసిక అనారోగ్యం.

2023 నేషనల్ మెంటల్ హెల్త్ సర్వేలో కార్పొరేట్ భారతదేశంలో 42% నిరాశ లేదా ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్న ముగ్గురిలో ఇద్దరు ఇప్పటికీ పనిలో లేదా కొత్త ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. పదిమందిలో ఒకరికి మాత్రమే ఎంప్లాయీ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ యాక్సెస్ ఉంది. భారతదేశంలో కేవలం వెయ్యికి పైగా నమోదిత కార్పొరేట్ సంస్థలు నిర్మాణాత్మక ఎంప్లాయీస్ అసిస్టెన్స్ ప్రోగ్రాంను కలిగి ఉన్నాయి. శ్రామిక శక్తి లో దాదాపు సగం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సర్వే ఫలితాలు తెలుపుతున్నాయి, పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ ప్రమాదం లో ఉన్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని శాస్త్రీ య పద్ధతిలో అర్థం చేసుకోవాలి, కార్యాలయంలో మానసిక ఆరోగ్యానికి కారణమయ్యే అంశాలు గుర్తించాలి, ఉద్యోగుల కోసం పరివర్తన విధానాలు కేంద్రీకృత మానసికఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. మంచి ఆరోగ్యం శ్రేయస్సు కోసం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 3ని చేరుకోవడానికి సీఎస్ఆర్ నిధులు, వనరుల దృక్పథాన్ని పునర్నిర్వచించడంలో సహాయపడుతుంది. మరీ ముఖ్యంగా, మానసికఆరోగ్య పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి వినూత్న పబ్లిక్, ప్రైవేట్ కమ్యూనిటీఆధారిత భాగస్వామ్యం సృష్టికి ఇది మార్గదర్శకంగా పనిచేస్తుంది.

నిమ్ హన్స్ 2022–23 సర్వే ప్రకారం, దాదాపు 18% భారతీయ పెద్దలు ఏదో ఒక రకమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇది దేశంలోనే 210 మిలియన్ల కంటే ఎక్కు వ మంది బాధపడుతున్నారు, కొద్దిమందికి మాత్రమే అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యం గా గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. భారతదేశంలోని 80%పైగా ప్రభు త్వ ఆసుపత్రులకు మానసిక వైద్యు లు లేరు. చాలామంది భారతీయ మానసిక వైద్యులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు 150 కోట్ల జనాభా ఉన్న దేశంలో కేవలం 9,000 కంటే తక్కువ మంది మానసిక వైద్యులు ఉన్నారు. మానసిక అనారోగ్యం భారతదేశంలో ఎక్కువగా నిషిద్ధ అంశంగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం చివరి నాటికి భారతదేశంలో సుమా రు 20 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కలు చూస్తే 56 మిలియన్ల భారతీయులు నిరాశతో బాధపడుతున్నారు, 38 మిలియన్ల మంది భారతీయులు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతూనే ఉంది. నిరాశ, నిస్పృహ, బాధ, ఆనందం కోల్పోవడం, ఆత్మ విశ్వాసం కోల్పోవడం, నిద్ర లేమి, ఆకలి, అలసట, ఏకాగ్రత లేక పోవడం వంటివి ఈ మానసిక రుగ్మతలు కారణాలు. వీటి ప్రభావంతో మనుషులు ఆత్మహత్య చేసుకుంటారు.

మానసిక రుగ్మతలు: నిరాశ (డిప్రెషన్), బైపోలార్ డిజార్డర్, మనోవైకల్యం( స్కిజోఫ్రెనియా), సైకోసెస్, చిత్తవైకల్యం, ఆటిజం. నిరాశ, నిస్పృహ, మానసిక రుగ్మతలకు ఆరోగ్య పరంగా, సామాజికంగా బయట పడటానికి ప్రజలకు అవకాశం ఉన్నది. మానసిక ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక 2020 2023 ప్రజలందరికీ ఆరోగ్యాన్ని సాధించడంలో పూర్తిగా విఫలమైంది మానసిక ఆరోగ్యానికి మరింత సమర్థవంతమైన నాయకత్వం పాలన,సమాజఆధారిత అమరికలలో సమగ్ర, అందరికి మానసిక ఆరోగ్యం, సామాజిక సంరక్షణ సేవలను అందించడం, అమలు , నివారణ కోసం వ్యూహాలు అమలు,సమాచార వ్యవస్థ, పరిశోధనలను బలోపేతం చేయలేక విఫలమయ్యింది.

# ఓజోన్ పొర రక్షణతోనే ఆరోగ్యకర భవిష్యత్ తరాలు

జీవకోటి ఆరోగ్యకర మనుగడకు అనువైన వాతావరణం భూగ్రహంపైన మాత్రమే ఉన్నది. సూర్యరశ్మి లేకుండా జీవి మనుగడ సాగించలేదు. భూమాత గృహంలో సకల ప్రాణికోటి మనుగడకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, వాతావరణం, పరిశుద్ధ గాలి, స్వచ్ఛమైన నీరు, పవిత్రమైన మట్టి అందుబాటులో ఉన్నాయి. ప్రాణులకు హాని కలిగించే అంశాలకు ప్రకృతి మాత్రమే అడ్డుకట్ట వేస్తున్నది. సూర్యుడి నుంచి భూమిపైకి చేరుతున్న సూర్యరశ్మిలో అతి ప్రమాదకర అతినీలలోహిత లేదా అల్ట్రావాయిలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. ఈ కిరణాలు నేలపైకి చేరితే జీవకోటి ఉనికికి అతి ప్రమాదకరంగా మారుతుంది.

పలు రోగాలకు ఊపిరి పోస్తుంది. ఇలాంటి అత్యంత ప్రమాదరమైన, హానికారక యూవీ కిరణాలను నేలపైకి రాకుండా 10 –30 కిమీ దూరంలోని స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అనబడే పొర అడ్డుకొని, శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మి నేలపైకి చేరడానికి దోహదపడుతుంది. ఇలాంటి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఓజోన్ పొర భూగోళంపై ఉన్న జీవులకు ఒక రక్షణ గొడుగుగా పని చేస్తున్నది.


**ప్రపంచ ఓజోన్ దినం–2025:** ప్రకృతిలో ఏదో ఒక పొర యూవీ కిరణాలను నేలపైకి రాకుండా అడ్డుకుంటున్నట్లు 1913లోనే శాస్త్రజ్ఞులు గమనించారు. ఇలాంటి ఓజోన్ పొర ఉండడం వల్లనే యూవీ కిరణాలు లేని సూర్యరశ్మి సకల ప్రాణికోటికి అందుతున్నట్లు గమనించారు. ఈ పొరను పరిరక్షించుకోవాలనే సదుద్దేశంతో 16 సెప్టెంబర్ 1987 రోజున అంతర్జాతీయ ఐరాస సంఘం మాన్‌ట్రియేల్ ప్రోటోకాల్ పేరుతో పలు నిర్ణయాలు చేయడం జరిగింది. ఇలాంటి ఓజోన్ పొర రక్షణకు చేపట్టిన తొలి సమావేశానికి గుర్తుగా 1995 నుంచి ప్రతి ఏట 16 సెప్టెంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు ప్రపంచ ఓజోన్ దినం (వరల్ ఓజోన్ డే) లేదా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం పాటించడం కొనసాగుతున్నది. ప్రపంచ ఓజోన్ దినం2025 ఇతివృత్తంగా జీవుల కోసం ఓజోన్ (ఓజోన్ ఫర్ లైఫ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది.

**ఓజోన్ పొర ప్రాధాన్యం:** మానవాళి అనాలోచిత, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విచ్చలవిడిగా వాడుతున్న క్లోరోఫ్లోరో కార్బన్స్ (సిఎఫ్‌సి) అనబడే ప్రమాదకర రసాయనాలను రిఫ్రిజిరేషన్, ఏయిర్ కండీషనింగ్, ఏరోసోల్ స్ప్రే లాంటి అవసరాలకు అధిక మొత్తంలో వాడుతున్నాం. ఇలాంటి ప్రమాదకర రసాయనాలు వాతావరణంలోకి లీక్ అయినపుడు, అవి ఓజోన్ పొరతో చర్యలో పాల్గొని, ఆ రక్షణ పొరను క్రమంగా నాశనం చేయడంతో, పొర పలుచబడడం లేదా పొరకు చిల్లులు పడడం జరుగుతోంది. రసాయనపరంగా త్రిపరమాణుక ఆక్సీజన్ అణువు ($O_3$)ని ఓడోన్ అని పిలుస్తాం. ఈ అణువు యూవీ కిరణాలను శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మిని భూమిపైకి చేర్చుతుంది. ఓజోన్ పొర పలుచడినపుడు లేదా పొరకు రంధ్రాలు ఏర్పడినపుడు సూర్యరశ్మితో పాటు యూవీ కిరణాలు నేలపైకి చేరి మానవాళికి, జంతువులకు, వృక్ష సంపదకు హానిని కలిగిస్తాయి.

అధిక యువి కిరణాల బారినపడిన మానవాళికి క్యాన్సర్, కాటరాక్ట్, పలు అనారోగ్యాలు కలుగుతాయి. ప్రపంచ పర్యావరణ వ్యవస్థ లు, జీవవైవిధ్యాలకు విఘాతంగా నిలుస్తున్న ఓజోన్ పొర తరుగుదలను అడ్డుకోవడానికి స్థానిక స్థాయి నుంచి అంతర్జాత స్థాయి వరకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి.

అంటార్కిటికాలో ఓజోన్ పొరకు రంధ్రం పడినట్లు శాస్త్రసమాజం గమనించిన 'షేర్‌వుడ్ రౌలాండ్'కు నోబెల్ పురస్కారం కూడా లభించింది. శీతలీకరణ, రిఫ్రిజిరేషన్, ఎయిడ్ కండిషనింగ్ పరిశ్రమలు అత్యధికంగా ప్రమాదకరమైన సిఎఫ్‌సిలను వాడుతున్నాయి. వీటికి బదులుగా ప్రత్యామ్నాయ రసాయనాలను ఆయా పరిశ్రమల్లో వాడాల్సిన అగత్యం ఏర్పడింది. రేపటి తరానికి ఆస్తులు కాదు ఆరోగ్యంగా జీవించడానికి అనువైన వాతావరణాలను బహుకరించడానికి కృషి చేద్దాం. నేటి యువతలో ఓజోన్ పరిరక్షణ అవగాహన పెంచుదాం.

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

## 16వ కాంగ్రెస్, (న్యూఢిల్లీ, 1995)

గత పార్టీ కాంగ్రెస్ (ఏప్రిల్ 1992) నాటికి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, బిజెపి సారథ్యంలో రామజన్మభూమి–బాబ్రీమసీదు వివాదం తీవ్రస్థాయిలో ఉంది. బిజెపి తన ఎదుగుదలకు దాన్ని స్ప్రింగ్‌బోర్డుగా ఉపయోగించుకుంది. బిజెపి 1989 జూన్ 9–11 తేదీల్లో పాలమూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రామజన్మభూమి సమస్యపై తీర్మానంతో ఆ సమస్యను తొట్టతొలిసారి తన ఎజండాలోకి తీసుకుంది. బిజెపి అధ్యక్షుడు ఎల్‌కె అద్వానీ 1990 సెప్టెంబర్ 25న గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి రామజన్మభూమి ప్రచార తొలి రథయాత్ర మొదలుపెట్టి అక్టోబర్ 30న అయోధ్యలో ముగించారు. 1992, డిసెంబర్ 6న హిందూ ఉన్మాద కార్‌సేవకులు బాబ్రీమసీదు కూల్చివేశారు. దేశంలో మత పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అంతకుముందు, 1991 ఎన్నికల ప్రచారంలో శ్రీలంక ఎల్‌టిటిఇ తీవ్రవాదులు రాజీవ్‌గాంధీని శ్రీ పెరంబదూర్‌లో (తమిళనాడు) హత్య చేశారు. రాజీవ్‌గాంధి హత్యకు ముందు – తర్వాత రెండు విడతలుగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పి.వి.నరసింహారావు నాయకత్వంలో మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నరసింహారావు–మన్మోహన్‌సింగ్ ద్వయం నయా ఉదారవిధానాలను ప్రవేశపెట్టి గుత్తపెట్టుబడికి అనుకూలంగా శ్రామికశక్తులపై దాడిచేయటం మొదలుపెట్టారు.

అటువంటి అస్థిర రాజకీయ పరిస్థితుల్లో సిపిఐ 16వ మహాసభ 1995 అక్టోబర్ 7 నుంచి 11వరకు న్యూఢిల్లీలో జరిగింది. 720మంది ప్రతినిధులు, 44మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలోని రాజకీయ, మత పరిస్థితులు, వామపక్ష, కమ్యూనిస్టు ఐక్యత సమస్యలు, పూర్వపు సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లలో పరిణామాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. రానున్న (1996) సార్వత్రిక ఎన్నికల్లో పోరాటం ప్రధానంగా మూడు కూటముల మధ్య ఉంటుందని పార్టీ కాంగ్రెస్ అంచనా వేసింది. 1) కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, 2) బిజెపి నాయకత్వంలోని కూటమి, 3) నేషనల్ ఫ్రంట్, లెఫ్ట్‌ఫ్రంట్ అలయెన్స్. ఎన్.ఎఫ్, ఎల్.ఎఫ్ అలయెన్స్ కాంగ్రెస్‌కు, బిజెపి–శివసేన కూటమికి వ్యతిరేకంగా పోరాడుతుందని పేర్కొన్నది.

ఇంద్రజిత్ గుప్తా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఎ.బి.బర్దన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అయితే 1996లో దేవగౌడ ప్రధానిగా ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఇంద్రజిత్‌గుప్తా హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించి పార్టీ పదవికి రాజీనామా చేయటంతో ఎ.బి.బర్దన్ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లోకి వచ్చారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడిన నల్లమల గిరిప్రసాద్ 1997మే 24న అకాలమరణం చెందారు.

## 17వ కాంగ్రెస్ (చెన్నై, 1998)

సిపిఐ 17వ కాంగ్రెస్ 1998, సెప్టెంబర్ 14–19 తేదీల్లో చెన్నైలో జరిగింది. 975మంది ప్రతినిధులు హాజరైనారు. అది దేశంలో రాజకీయ అస్థిరత కొనసాగుతున్న కాలం; నాలుగేళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగిన కాలం. కాంగ్రెస్ పాలన అంతమై కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడిన కాలం. 1996 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో ఏ పార్టీకి కనీస మెజారిటీ రాలేదు. పెద్దపార్టీగా ఆవిర్భవించిన బిజెపి (161 సీట్లు) నాయకుడు ఎ.బి.వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. బలపరిచేవారు లేక (1996 మే 16 – జూన్1) 13వ రోజున పార్లమెంటు ముందుకు రాకుండానే ఆయన రాజీనామా చేశారు. అయోధ్యలో రామాలయం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి అనే మూడంశాల హిందూత్వ ఎజండా ఉన్న ఆ ప్రభుత్వాన్ని బలపరిచేందుకు ఏ పార్టీ ముందుకు రాలేదు. లౌకికపార్టీలు ఐక్యసంఘటనగా ఏర్పడి కాంగ్రెస్ తోడ్పాటుతో జనతాదళ్ (ఎస్) నేత హెచ్.డి.దేవగౌడ ప్రధానిగా 1996 జూన్1న ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు ప్రధానమంత్రి పదవి ఆఫర్ చేయగా, సిపిఐ(ఎం) నిరాకరించింది. దీన్ని 'చారిత్రక తప్పిదం'గా ఆ తర్వాత జ్యోతిబసు వ్యాఖ్యానించారు. సిపిఐ తర్జనభర్జనల తర్వాత గౌడ మంత్రివర్గంలో చేరింది. చతురానన్ మిశ్రా (వ్యవసాయం), ఇంద్రజిత్ గుప్తా (హోం) ఒకింత ఆలస్యంగా 1996 జూన్ 29న మంత్రులైనారు. 1997 ఏప్రిల్ 21న గౌడ రాజీనామా చేయగా ఐ.కె.గుజ్రాల్ ప్రధాని అయినారు. ఆ ప్రభుత్వానికి కాంగ్రెస్ తోడ్పాటు ఉపసంహరణతో 1998లో మళ్లీ ఎన్నికలు వచ్చాయి. బిజెపి పెద్ద పార్టీగా అవతరించింది. తన ఎజండాలోని వివాదాస్పదమైన హిందూత్వ ఎజండా అంశాలను –అయోధ్యలో రామాలయం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి – వెనక్కు పెట్టటంతో ప్రాంతీయ పార్టీలు బలపరిచాయి. 1998 మార్చి 19న వాజ్‌పేయి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. అయితే ఎఐఎడిఎంకె నాయకురాలు జె.జయలలిత తోడ్పాటు ఉపసంహరణతో ఆ ప్రభుత్వం మైనారిటీలో పడింది. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. తరచూ ఎన్నికలు, ప్రభుత్వాల మార్పుతో ప్రజల్లో వచ్చిన ఏహ్యత, కార్గిల్ యుద్ధంలో భారతసైన్యం విజయం కలిసొచ్చి 1999 ఎన్నికల్లో బిజెపికి సీట్లు పెరిగాయి. వాజ్‌పేయి మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

రాజకీయ అస్థిరత, కాంగ్రెస్ పట్ల వ్యతిరేకనుంచి బిజెపి లాభపడింది. ఏకాకితనం నుండి బయటపడి ప్రాంతీయ పార్టీలకు చేరువైంది.

ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ చెన్నై కాంగ్రెస్ కేంద్రంలో లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం తీసుకురావటం, రాజకీయాల్లో మితవాద మలుపును అరికట్టి వామపక్షం వైపు మలుపు తీసుకురావటం, పార్టీ లక్ష్యంగా ప్రకటించింది. కొత్త ప్రత్యామ్నాయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమైన పాత్ర వహించాల్సి ఉంటుందని చెప్పింది.

కొత్తగా ఎన్నుకోబడిన జాతీయ సమితి ఎ.బి.బర్దన్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.1996లో ఇంద్రజిత్‌గుప్తా రాజీనామా తదుపరి ఆయన తొలుత ఆ పదవీ బాధ్యతలు చేబట్టారు.

## 18వ కాంగ్రెస్(తిరువనంతపురం, 2002)

సిపిఐ 18వ కాంగ్రెస్ 2002 మార్చి 26–31 తేదీల్లో తిరువనంతపురంలో జరిగింది. 604 మంది ప్రతినిధులు, 56 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలో టెర్రరిస్టు దాడులు, ముఖ్యంగా 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంటుపై టెర్రరిస్టు దాడి జరిగింది. ఐదుగురు జైష్–ఎ–మొహమ్మద్ టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ఢిల్లీ పోలీసులు, ఇద్దరు పార్లమెంటు సెక్యూరిటీ దళం సిబ్బంది, ఒక తోటమాలి మరణించారు. ఐదుగురు టెర్రరిస్టుల్నీ భద్రతాదళాలు కాల్చి చంపాయి. ఈ ఘటన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడిగా ఖండనకు గురైంది. ఈ ఘటన భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెంచింది. దాని పర్యవసానమే 2001–2002లో భారత్, పాకిస్థాన్ సైనిక మోహరింపు. 1971 ఇండో–పాక్ యుద్ధం తర్వాత భారత్ కశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున సైన్యాన్ని మోహరించటం ఇదే ప్రథమం. 2002 నవంబర్‌లో అరెస్టు చేసిన నలుగురు జెమ్ సభ్యులకు శిక్షలు పడ్డాయి. వారిలో అఫ్జల్ గురు ఒకడు. గుజరాత్‌లో విస్తృతంగా మతకలహాలు జరిగాయి.

సిపిఐ, సిపిఐ(ఎం) మధ్య ఏర్పడిన సమన్వయ కమిటీ రద్దయింది. ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ కాంగ్రెస్, సిపిఐని బలోపేతం చేయటం తక్షణావసరమని నొక్కిచెప్పింది. అందువల్ల రానున్న రోజుల్లో పార్టీలో "దిద్దుబాటు, పునర్నిర్మాణం" కార్యక్రమం చేపట్టాలని పిలుపుఇచ్చింది.

ప్రధాన కార్యదర్శిగా ఎ.బి.బర్దన్ తిరిగి ఎన్నికైనారు.

## 19వ కాంగ్రెస్ (చండీఘడ్, 2005)

ప్రధాని వాజ్‌పేయి, ఉపప్రధాని, హోంమంత్రి ఎల్.కె.అద్వానీ సారథ్యంలో ఎన్‌డిఎ పాలనలో 'దేశం వెలిగిపోతోంది' అన్న అంచనాతో ప్రభుత్వం షెడ్యూలుకన్నా కొంత ముందుగా 2004లో సార్వత్రిక ఎన్నికలకు వెళ్లింది. ఆ మితవాద, మతవాద ప్రభుత్వ విధానాల వల్ల దేశం చీకటి వైపు వెళుతోందని భావించిన దేశప్రజలు ఎన్‌డిఎను ఓడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. దేశ చరిత్రలో తొలిసారి వామపక్షాలు 64 సీట్లతో లోక్‌సభలో పెద్ద గ్రూపుగా ఆవిర్భవించాయి. కాంగ్రెస్, వామపక్షాలు, మరికొన్ని ఇతర పక్షాలతో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలవెన్స్ (యుపిఎ) ఏర్పడింది. పరిపాలనకు ఉమ్మడి కనీస కార్యక్రమం రూపొందించబడింది. సోనియాగాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా నిర్ణయమైనారు. అయితే మితవాదశక్తుల నుంచి తన కుటుంబానికి ముప్పు ఉందంటూ ఆమె తన స్థానే డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను ప్రధాని అభ్యర్థిగా నిర్ణయించారు. మొదటి యుపిఎ ప్రభుత్వం ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా 2004 మే 22న ప్రమాణ స్వీకారం చేసింది. కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వంలో చేరలేదు–వెలుపల నుండి తోడ్పాటు ఇచ్చాయి. సోనియాగాంధీ చైర్‌పర్సన్‌గా ఏర్పడిన యుపిఎ జాతీయ సలహామండలిలో కమ్యూనిస్టులు సభ్యులుగా ఉన్నారు. వారి ఒత్తిడి వల్లనే సమాచార హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వగైరా ప్రభావవంతమైన చట్టాలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో 2005 (మార్చి 29–ఏప్రిల్ 3)లో చండీఘడ్‌లో జరిగిన సిపిఐ 19వ కాంగ్రెస్ "కమ్యూనిస్టు ఐక్యత కోసం సిపిఐ అర్థించదు. బలమైన, స్వతంత్ర సిపిఐని నిర్మిస్తుంది" అని స్పష్టం చేసింది.పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎ.బి.బర్దన్ తిరిగి ఎన్నుకోబడ్డారు. 2007లో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా జాతీయసమితి ఎన్నుకున్న సురవరం సుధాకర రెడ్డి ఈ కాంగ్రెస్‌లో తిరిగి ఆ పదవికి ఎన్నికైనారు.

## బాధ్యతలు చేపట్టిన గ్రామ పరిపాలన అధికారులు



ప్రజాపక్షం/కేశంపేట : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారులు బాధ్యతలు చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు బాధ్యతలు చేపట్టిన అధికారులకు అర్డర్ కాఫీలను తహసీల్దార్ ఆజాం అలీ అందజేశారు. కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామానికి లింగమూర్తి, ఇప్పలపల్లి రాజేశ్వరీ, లేమామిడికి హేమలత, నిర్ధవెల్లికి వెంకటేష్, కేశంపేటకు రాత్లావత్ శంకర్, వేములనర్వకు విజయలక్ష్మీ, తొమ్మిదిరేకులకు కృష్ణయ్య, సంతాపూర్‌కు గిరీశం కుమార్, కొత్తపేటకు పెంటయ్య, అల్వాలకు సేవ్యానాయక్‌లు గ్రామ పరిపాలన అధికారులుగా బాధ్యతలు చేపట్టారు. వారిని తహసీల్దార్ ప్రత్యేకంగా అభినందించారు.

## కాలనీ సంక్షేమ సంఘాలతోనే అభివృద్ధి




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీలను అభివృద్ధికి సాధ్యమైతుందని వనస్థలిపురం డివిజన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని క్రాంతి హిల్స్ కాలనీ ముఖ ద్వారంను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రాంతి హిల్స్ కాలనీ సమస్యల పరిష్కారం కోసం తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి, వి. మనోహర్, శ్రీనివాస్, నారాయణ, రామాంజనేయరెడ్డి, మల్లేశం, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : నేరాల నివారణకు సిసికెమెరాలు ఎంతో అవసరమని, ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానం అని సరూర్‌నగర్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ రొడ్డు నంబర్ 5లో కాలనీ వాసులు స్వంత నిధులతో ఏర్పాటు చేసుకున్న సిసికెమెరాలను స్థానిక కార్పోరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు అదుపు చేయడానికి పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దానంరెడ్డి, శ్రీనివాసరావు, వ్యాపారవేత్త సోమ వెంకట్, తులసీ కృష్ణమూర్తి, రాజనాల వెంకటేశ్వర్ రావు, గంటి శంకర్, గుంత ప్రవీణ్, గంటి వెంకట్‌రావు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి సారూ..

ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న టీచర్లు, ఆయాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను టీచర్లు కోరారు. సోమవారం స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ప్రీ ప్రైమరీ పిఎం విద్యను అంగన్‌వాడి కేంద్రాల్లోనే నిర్వహించాలని, విద్యాబోధన బాధ్యత అంగన్‌వాడి టీచర్లకు, హెల్పర్లకే అప్పగించాలని, అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, సిపిఐ, సిపిఎం నేతలు ఉన్నారు.

## పేదల సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలతోపాటు సంపూర్ణ ఆరోగ్యం అంధించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గానికి శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రి డాక్టర్ రామరాజు సహకారంతో నాలుగు అంబులెన్స్‌లను ఉచితంగా అంధించేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, నేతలు రఘునాయక్,బస్వం, రవికుమార్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, లింగారెడ్డిగూడ అశోక్, అలీఖాన్, సత్తయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకత ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయుల కృషి

మండల అభివృద్ధి అధికారి అపర్ణ



ప్రజాపక్షం/షాబాద్: విద్యార్థులలో సృసనాత్మకతను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయుల కృషి అవసరం అని మండల అభివృద్ధి అధికారి అపర్ణ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు టిఎల్‌ఎం మేళా నిర్వహించారు. అనంతరం మండల విద్య అధికారి లక్ష్మణ్ నాయక్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ హెల్త్‌సెంటర్ మార్చాలని ధర్నా



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : మీర్‌పేట్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో కొనసాగుతునన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను తక్షణమే జడ్పీ రోడ్డుకు మార్చాలని బిజెపి డివిజన్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించి, డిఎంహెచ్‌ఓ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్ గౌడ్‌ను వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ 2020లో కేంద్ర ప్రభుత్వం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ప్రస్తుత ఎంఎల్‌ఏ, మాజీ కార్పొరేటర్ వారి స్వార్థపూరిత నిర్ణయంతో తమ బంధువుల ఇంటిలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు. హస్తినాపురం డివిజన్‌లో దాదాపు 50వేల ప్రజలు ఉన్నారని, హెల్త్ సెంటర్‌ను జడ్పీ రోడ్డు తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి హెల్త్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులో తీసుకోరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర ప్రసాద్, బొమ్మిడి కిరణ్‌రెడ్డి, గౌని వెంకటేష్ గౌడ్, పాశం జీవన్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్ గౌడ్, సాయి కృష్ణారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

## మహిళలపై జరిగే హింసాత్మక చర్యలు అరికట్టాలి





జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్

ప్రజాపక్షం/రంగారెడ్డి: మహిళలపై జరిగే హింసాత్మక చర్యలు, వేధింపులను నివారించడానికి తమవంతు సహకారం అందించాలని, మహిళలకు అండగా నిలవాలని సంబంధిత అధికారులను జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ కోరారు. సోమవారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "జన సున్వాయ్" పేరుతో సైబారాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధిత మహిళలు అందించిన పలు ఫిర్యాదులను ఆమె పరిశీలించారు. సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటును అందించాలని మజుందార్ స్పష్టం చేశారు. భాదిత మహిళాలు అందించే వినతులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలనాపరమైన, న్యాయపరమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించాలని తెలిపారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులు మరింత చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మొత్తం 56 మహిళలు వినతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ళ శారద, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడిన తర్వాతే, ఆస్తులు కాపాడండి

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రజల ప్రాణాలు కాపాడిన తర్వాతే, ఆస్తులను కాపాడాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆదేశించారు. నడిగడ్డ తండా వాసులను సిఆర్ పిఎఫ్, కస్టోడియన్ అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నడిగడ్డ తాండాలో జిల్లా ఎస్‌టి వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాల ను కాపాడడం అత్యంత ముఖ్యమని, ఆ తర్వాతే ఆస్తులను కాపాడాలని, కానీ ఆస్తుల కోసం పేద ప్రజల ఇళ్లలోకి వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం సరైనది కాదన్నారు. జాతీయ ఎస్‌టి కమిషన్ పూర్తిగా రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు సమస్యలు పరిష్కారానికి ముందుంటుందని ఆయన గుర్తు చేశారు. నడిగడ్డ తండా లోపలికి ఎట్టి పరిస్థితుల్లోను సిఆర్ పిఎఫ్, కస్టోడియన్ అధికారులు, సిబ్బంది వెళ్ళొద్దని, వీలైతే నివాసాలు ఉండే ప్రాంతం వరకు హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేసి మిగిలిన స్థలాన్ని రక్షించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ వేదిక సమస్యల పరిష్కారానికి తొలిమెట్టుగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సహకరిస్తూ నడిగడ్డ తాండా వాసులకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించేందుకు చర్య లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,జిల్లా అదనపుకలెక్టర్ కె.చంద్రారెడ్డి, కస్టోడియన్ అధికారి కమలేశ్, సిఆర్‌పిఎఫ్ అధికారి అమిత్‌మిశ్రా, మాజీ ఎంపి రవీందర్ నాయక్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, జిల్లా ఎస్‌టి వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## మల్లేపల్లి నాలా పూడికతీతపై దృష్టి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్లేపల్లి నాలా పూడికతీత, పరిశుభ్రత పనులను వేగవంతం చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీవర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మెహదీపట్నం సర్కిల్ పరిధిలోని మల్లేపల్లి నాలాను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నాలాలో పేరుకుపోయిన మట్టిని తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో నాలాకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆర్.వి. కర్ణన్ సూచించారు.

## ప్రజలకు అంకితభావంతో సేవలందించాలి

జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసిలో నూతనంగా ఉద్యోగాలు పొందినవారు ప్రజలకు ఉత్తమ సేవలను అందించి సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 32 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగంలో చేరినవారు మంచి భవిష్యత్తు కోసం సానుకూల దృక్పథంతో పని చేయాలని సూచించారు. ఫిర్యాదులకు తావు లేకుండా ఉత్తమ పనితీరు కనబరచాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన 32 మందిలో 10 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, 17 మంది ఆఫీస్ సబార్డినేట్‌లుగా, 5 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా వివిధ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

### జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 219 ఫిర్యాదులు

జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 219 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు వాటిని వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత విభాగాలకు పంపించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, కె.సత్యనారాయణ, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, రజిత్ కుమార్, వెంకన్న, శైలజ, ఉమాదేవి, విజిలెన్స్ డిఎస్‌పి నరసింహా రెడ్డి, జాయింట్ కమిషనర్లు(పారిశుద్ధ్యం) మోహన్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

## ప్రతి శిశువుకు పోలియో చుక్కలు

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్



ప్రజాపక్షం/రంగారెడ్డి: అక్టోబర్ 12న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కె శ్రీనివాస్,జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అదికారి బి.వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖ ల జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంలో జిల్లా వైద్యశాఖ అధికారి బి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ళ లోపు పిల్లలు 4 లక్షల తొంబై వేల మంది ఉన్నట్లు సర్వేలో గుర్తించడం జరిగిందన్నారు. అక్టోబర్ 12న ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో సెంటర్లలో పోలియో చుక్కలు వేస్తారని, తప్పనిసరిగా అందరూ ఆ రోజు భూత్ లోకి వెళ్ళి చుక్కలు వేయించాలని సూచించారు. 13 నుండి 15 వ తేదీ వరకి ఇంటింటికీ వెళ్ళి ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అంగన్వాడీ సిబ్బందిని,ఆరోగ్య, ఆశ కార్యకర్తలను కూడా ఈ కార్యక్రమంలో భాగ్యస్వాములు చేయడం జరిగిందని డిఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు వివరించారు. పాఠశాలల పిల్లలకు, ఇతర 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారి దరిదాపులోకి రాకుండా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా అధికారులు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఎందుకివ్వరూ?

ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.నర్సింహ్మారెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం చెప్పాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సిడిపిఓకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు, అయాలు రిటైర్మెంట్ అయి 14నెలలు గడుస్తున్న ఇస్తామన్న రెండు లక్షలు, లక్ష నేటికి ఇవ్వలేదని మండిపడ్డారు. టీచర్లు, ఆయాలు రిటైర్మెంట్ అయిన తరువాత అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామచంద్రయ్య, యాదమ్మ, విమలమ్మ, రామచంద్రమ్మ, బుజ్జినో, బికెఎంయు నాయకులు రమేష్ యాదవ్, కె.రాజు, శంకర్‌లు పాల్గొన్నారు.

## పాఠ్యాంశంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి డిమాండ్



ప్రజాపక్షం/హయత్ నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ హయత్ నగర్ శాఖ కార్యదర్శి కొప్పుల సరిత ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఆందోజు రవీంద్ర చారి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, ఎఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములుగౌడ్, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆమనగంటి వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, వివిధ శాఖల కార్యదర్శులు సౌజన్య, అరుణ, సౌజన్య, గూని శోభ పారిజాత, యమునా, సుమతి, అనిత, శివ జ్యోతి, ఆదిలక్ష్మితో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి : సోమవారం శేరిలింగంపల్లి సిపిఐ కార్యాలయంలో శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామ కృష్ణ అధ్వర్యంలో తెలంగాణ రైతన్న సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటల వారోత్సావాల స్ఫూర్తితో శేరిలింగంపల్లిలో ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. అనంతరం రక్తపు నాగేష్ గౌడ్ ఏడవ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, శేరిలింగంపల్లి సిపిఐ సహాయకార్యదర్శి చందుయాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్, కొండలయ్య, నారయణ, వరలక్ష్మి, సురేష్, నరసమ్మ, చంద్రమ్మ, కృష్ణ, రఘు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : తెలంగాణ విముక్తి కోసం వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, ఆ వీరుల చరిత్ర నేటి తరాలకు తెలియజేసేందుకే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్ర చారి తెలిపారు. సోమవారం అబ్దులాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్ పేట పురపాలక సంఘం కూంట్లూర్‌లో గ్రామ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సల సందర్భంగా సిపిఐ జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని తప్పుగా వర్ణిస్తున్న మతోన్మాదుల నుంచి నేటి యువతకు వాస్తవాలను తెలపాలని రవీంద్ర చారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, మండల సిపిఐ కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మ, కూంట్లూర్ రాజీవ్ గృహకల్ప సిపిఐ కార్యదర్శి డప్పుల రాములు, నాయకులు బిచ్చు నాయక్, రాంరెడ్డి, కోండల్, యాదయ్య, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.









## రహదారుల మరమ్మతు పనులు పూర్తి చేస్తాం

ప్రజాపక్షం/మల్కాజిగిరి :ఇటీవలి కాలంగా కురుస్తున్న భారీ వర్షాలతో చెడి పోయిన రహదార్ల మరమ్మత్తు పనులతో పాటు ఉప్పరగూడ రాజనగర్ కాలనీలో 600 దయా పైప్‌లైన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. భారీ వర్షాలతో జలమయమైన ఇక్కడి ప్రాంతాలను ఆయన జిహెచ్ఎంసి డిఇ లౌక్య, ఎఇ సత్యలక్ష్మి , వర్క్ ఇనస్పెక్టర్ రజనీకాంత్ ఉమేష్‌సింగ్‌లతో కల్సి సోమవారం పర్యటించారు.



## ప్రజావాణికి 103దరఖాస్తులు స్వీకరణ

ప్రజాపక్షం/వికారాబాద్ : ప్రజావాణికి 103దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, ఆర్డిఓ వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



# గల్లంతైన వారికోసం... ముమ్మర గాలింపు

### అఫ్జల్‌సాగర్, వినోభా కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ హరిచందన



ప్రజాపక్షం/హైదరాబాద్: ముషీరాబాద్ వినోభానగర్, మాసబ్‌ట్యాంక్ మంగర్ బస్తీ నాలాలో భారీ వర్షానికి వచ్చిన వరద నీటిలో మామ అల్లుళ్ల రాము, అర్జున్ గల్లంతయిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన సోమవారం పర్యటించారు. ముగ్గురు వ్యక్తులు గల్లంతవడంపై అధికారుల నుంచి రంగనాథ్, కలెక్టర్ హరిచందన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్‌లో చాలా ప్రాంతాల్లో నాలాలు కబ్జా అయ్యాయని రంగనాథ్ తెలిపారు. అఫ్జల్ సాగర్‌లో ఆదివారం రాత్రి మంచం తీసుకురావడానికి వెళ్లి ప్రమాదంలో చిక్కుకొని ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయ్యారని చెప్పారు. నాలాపై ఒక అక్రమ నిర్మాణం నీటి ప్రవాహానికి అడ్డు పడిందన్నారు. ఈ బస్తీలో కొన్ని ఇళ్లను తొలగించి చర్యలు తీసుకోవాలనే నిర్ణయానికి తాము వచ్చామని తెలిపారు.

**ముమ్మరంగా గాలింపు చర్యలు..**



నాలాల్లో పడి ఆదివారం గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా ముమ్మరంగా గాలిస్తోంది. క్యాచ్‌పిట్లన్ని చోట్ల వెతుకుతోంది. ప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి చూసిన తర్వాత వెంటనే వాటిని మూసి వేయాలని హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. గాలింపు చర్యలను మిగతా శాఖలతో కలిసి ముమ్మ రం చేయాలని సూచించారు. హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అఫ్జల్ సాగర్ ప్రాంతం లో కమిషనర్‌తో పాటు గాలింపు చర్యలను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కురిసిన భారీ వర్షానికి ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్ సాగర్ నాలాలో అక్కడే నివాసం ఉంటున్న మామ, అల్లుడు అర్జున్(26), రాము(25)తో పాటు, ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలాలో దినేష్ అలియాస్ సన్నీ(26) గల్లంతయ్యారు.

**నాలా ఆక్రమణలే ప్రమాదాలకు కారణం..**

హైదరాబాద్ వ్యాప్తంగా ఆదివారం ముగ్గురు వ్యక్తులు గల్లంతు అయ్యారని రంగనాథ్ వివరించారు. జిహెచ్ఎంసి ప్రాంతంలో రెండు వేల ట్రక్కుల పూడికతీత తీశామన్నారు. చాలా నాలాలు సమస్యాత్మకంగా ఉన్నాయని తెలిపారు. అన్ని సమస్యలను పరిష్కరించడానికి హైడ్రా కృషి చేస్తోందన్నారు. హైడ్రా ఉన్నది ప్రజల కోసమేనన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా ఉండాలంటే అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిన అవసరం ఉందని రంగనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నాలాలను ఆక్రమించి నిర్మించడమే కాకుండా, వాటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద సాఫీగా సాగడం లేదన్నారు. వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని, మిగతా వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నాలాల చెంతన పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, తప్పనిసరై కూల్చి వేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ప్రభుత్వం చూస్తుందన్నారు. మిగతావారెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి సానుభూతి ఉందన్నారు.

**బాధితులకు నష్ట పరిహారం : కలెక్టర్ హరిచందన**

నాలా ప్రమాదంలో గల్లంతైన బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం రూ.5 లక్షలు చెల్లిస్తామని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తెలిపారు. ముగ్గురు వ్యక్తుల మృతదేహాలు ఇంకా లభించలేదని, లభించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాత ఇళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు ఆమె సూచించారు. నాలాల వద్ద ఉండే ప్రజలు వరద ఉధృతి ఎక్కువగా ఉంటే జాగ్రత్తగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఈ బస్తీలో కొన్ని నిర్మాణాలు నాలాలపై ఉన్నాయని తెలిపారు. అలాంటి వాటితో అందరికీ ప్రమాదం ఉందని కలెక్టర్ హరిచందన హెచ్చరించారు.

**ఇందిరమ్మ ఇళ్లు..**

బస్తీ వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. ఈ బస్తీలో 145 ఇళ్లు నాలా మీద ఉన్నాయని వెల్లడించారు. మొత్తం రెండు ఎకరాల్లో అనేక ఇళ్లు ఉన్నాయని అన్నారు. ఈ బస్తీలోని వారికి గతం లో అనేకసార్లు నోటీసులు ఇచ్చామని గుర్తుచేశారు. మంగర్ బస్తీ వాసులు ఒప్పుకుంటే మరొక చోట నివాస ప్రాంతాలు కల్పిస్తామని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన చెప్పారు.

## సేవాలాల్ తండా నివాసితుల సమస్యలు పరిష్కరించాలి

### ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : దేవరయంజాల్‌లోని సేవాలాల్ తాండా దేవాదాయ భూములలో చాలా ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్గించటంతో వారెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కల్సి ఇక్కడి ప్రజల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నివాసితులకు పట్టా భూములను అందించేందుకు అవసరమైన చర్యలతో పాటు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రహదార్లు, మంచి నీటి సౌకర్యం, స్మశానవాటిక, అంగన్‌వాడి కేంద్రం, కమ్యూనిటి హాల్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. తాను మానవతా దృక్పథంతో ఈ ప్రాంతవాసుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. పట్టా భూములకు సంబంధించి దేవాదాయ శాఖాధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనిత, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



## యూరియా అందుబాటులో ఉంచడానికి చర్యలు

### వ్యవసాయ అధికారి రాజరత్నం




ప్రజాపక్షం/కోట్‌పల్లి :రైతులకు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచడానికి కృషి చేస్తామని జిల్లా వ్యవసాయఅధికారి రాజరత్నం అన్నారు. సోమవరం కోట్‌పల్లి మండల పరిధిలోని యూరియా సరఫరను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెండు మూడు రోజు ల్లో కోట్‌పల్లి మండలానికి సంబంధించిన యూరియా అందుబాటులో ఉంచుతామని అన్నారు. రైతులు అడిగిన విధం గా వచ్చే ఇండెంట్ నుండి 20టన్నులు వచ్చేలా కృషి చేస్తా అని అన్నారు. యూరియా వాడకం కోసం అవగాహన కల్పించారు. నానో యూరి యాతో వచ్చే అన్ని రకాల లాభాలు, నానో యూరియా పిచికారీ చేయడం ద్వారా వస్తుంది అని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్ణాకర్ రెడ్డి, విస్తర ణ అధికారి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు పరిస్థితి విషమం

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు పట్టణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న ఓ పాదచారిని సిమెంట్ లారీ ఢీకొనడంతో తీవ్రగాయపాలైన ఘటన సోమవారం తాండూరు పట్టణంలోని శివాజీ చౌక్ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌతాపూర్ రోడ్డు వైపు నుండి టిఎస్34టి 4999 నెంబర్ గల సిమెంట్ లారీ పట్టణంలోని శివాజీచౌక్ వస్తుది. ఇదే సమయంలో ఓయువకుడు రోడ్డు దాటుతుండగా సిమెట్ లారీ ఢీకోట్టింది. గుర్తు తెలియని ఆ యువకుడు తీవ్రమైన గాయాల పాలయ్యాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆ యువకుడి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సిమెంట్ లారీని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

## సేవా పక్వాడ మండల కార్యశాల కార్యక్రమం

ప్రజాపక్షం/చర్లపల్లి: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ఆదేశాలతో మున్సిపల్ బిజెపి అధ్యక్షులు తోట నరేష్ పటేల్ ఆధ్వర్యంలో సేవా పక్వాడ మండల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా జిల్లా రూరల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు, సేవా పక్వాండ కో కన్వీనర్ బుద్ధవరం లక్ష్మి వేణుగోపాల్ విచ్చేసి మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఒబేసిటిపై అవగాహన

ప్రజాపక్షం/శామీర్‌పేట : మెడిసిటి ఘనపూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపాలిటి దక్ష స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం ఓబిసిటిపై డాక్టర్లు ఆట, పాటలు, నాటిక రూపంలో అవగాహన కల్పించారు. జాతీయ బాలల ఓబిసిటి కార్యక్రమంలో బాగంగా మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో 6 వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఓబిసిటిపై డాక్టర్లు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

విద్యార్థుల ప్రాథమిక అవగాహన, ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, మరియు ఓబిసిటిపై ప్రారంభ ప్రశ్నాపత్రం అందజేశారు. ఆడియో, వీడియోల ద్వార పిల్లల వైద్య విభాగం ఆద్యాపకులు ఓబిసిటి కారణాలు, దాని ప్రభావాలు, నివారణ చర్యలపై వివరిస్తు వీడియో సహాయంతో సులభంగా అర్ధమయ్యే రీతిలో వివరించారు. జూనియర్ డాక్టర్లు ఆరోగ్యకరమైన జీవన శైలి, అనారోగ్యకరమైన అలవాట్ల మద్య తేడాలను చూపుతు జంక్‌ఫుడ్ దుష్ప్రబావాలు, సమతుల్య ఆహారం ప్రయోజనాలను ప్రతిబింబించే నాటికను ప్రదర్శించారు.



ట్రాఫిక్ లైట్ ఫుడ్ గేమ్‌లో బాగంగా ఎరుపు, పసుపు, ఆకుపచ్చ ఆహారాల వర్గీకరణను ఆట రూపంలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పెడియాట్రిక్ హెచ్ఓడి డాక్టర్ సుదర్శన్‌రాజ్, ప్రొఫెసర్ సుమతి, మహిత, ప్రీతి, అరవింద్, బద్రి, కళాశాల సిబ్బంది, డైరక్టర్ శివశంకర్, విద్యార్థులు, మార్కెటింగ్ మెనేజర్ సత్యనారాయణ, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి వినతి

ప్రజాపక్షం/చర్లపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మేడ్చల్ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ వినయ్ అన్నారు. వికలాంగల పోరాట సమితి ఆధ్వర్యంలో కాప్రా తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. వికలాంగుల పెన్షన్ 4 వేల నుండి 6900, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడి కార్మికులు, చేనేత కార్మికులకు 2 వేల నుండి 4 వేలకు పెంచుతామని ఇంతవరకు పెంచలేదని తక్షణమే మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. మంద కృష్ణ మాదిగ ముందుకు వచ్చి రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం స్పందన కరువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు తిప్పరపు లక్ష్మణ్‌మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ, వికలాంగుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ నర్సింహ, ధనరాజ్, రాంచందర్ మాదిగ, శోభ, రజిత, తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఈటల

ప్రజాపక్షం/నాగారం: సిఎం సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన మర్లకట్ల జాన్ కెన్నెడికి 60 వేల రూపాయల చెక్కు, లక్ష్మి నగర్ నివాసి కొట్టె అనిల్ కుమార్ 46 వేల 500 రూపాయల చెక్కులను ఆయన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు. చికిత్స పొందిన పేదవారికి సిఎం సహాయనిధి సహాయ పడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేటర్ సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాపక్షం/ఉప్పల్ : ఉప్పల్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎఇ రాజ్ కుమార్ తో కలసి ఉప్పల్ హిల్స్‌లో కోటి రూపాయల నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులను పరిశీలించి, సమీప కాలనీలలో విస్తృతంగా పర్యటించి పలు సమస్యలు తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

ప్రజాపక్షం/శామీర్‌పేట: చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్‌కు చెందిన హనుమయ్య(28) తన స్నేహితులతో కలిసి చేపలు పడదామని తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ పక్కన ఉన్న నల్లకుంటలో చేపలు వస్తుండగా పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి గల్లంతయ్యాడు. సమాచరం అందుకున్న పోలీసులు నల్లకుంటల్లో గాలించి హనుమయ్య మృతదేహాన్ని బయట కు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.





## మధురా నగర్ నూతన కమిటీ సభ్యులు ఎన్నిక

ప్రజాపక్షం/ఉప్పల్ : రామంతాపూర్ మధుర నగర్ సంక్షేమ సంఘానికి సోమవారం ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎల్.మాలకొండ రెడ్డి, గౌరవాధ్యక్షులుగా పి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా ఏ.శ్రీనివాసరెడ్డి, జి.నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఏ.జగదీష్ చంద్రరావు, జాయింట్ సెక్రటరీగా ఎన్.శ్రీనివాస్ సాగర్, కోశాధికారిగా పి.గణేష్, ఆడిటర్ గా కే.ఇంద్రసేనారెడ్డి తో పాటు ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ లుగా ఆర్ సురేష్ రెడ్డి, పి.ప్రవీణ్ గౌడ్, డి.మాధవ శర్మ, పి.విష్ణువర్ధన్ రెడ్డి, టి.వంశీకృష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు మాలకొండ రెడ్డి మాట్లాడుతూ, మధుర నగర్ ని అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని అన్నారు.



## సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకం పొందాలి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 113 అర్జీలను దరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డితో కల్సి స్వీకరించిన అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలన్నారు.

## జవహర్ నగర్ పిఎస్ పరిధిలోని కేసులు కుషాయిగూడ కోర్టుకు మార్చాలి

ప్రజాపక్షం/చర్లపల్లి: జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోర్టు కేసులు కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టుకు మార్చాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది ఎన్ అమరేందర్‌రెడ్డి కోరుతున్నారు.జవహర్ నగర్ పోలీస్ కుషాయిగూడ జిల్లా కోర్టుకు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉందని పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసులు 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న మేడ్చల్ కోర్టు కక్షిదారులు, సాక్షులు, పోలీస్ సిబ్బంది వెళ్లవలసి వస్తుందని తెలిపారు. మేడ్చల్ జిల్లా కోర్టుకు వెళ్లవలసి వస్తే రెండు, మూడు బస్సులు మారవలసి వస్తుందన్నారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ముందు కాప్రా, వంపుగూడ, సాకేత్ ప్రాంతాలు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చేవి. అదే విధంగా దమ్మాయిగూడ, చుట్టు ప్రాంతాల వారు కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేవని వాటికి సంబంధించినవి మల్కాజ్‌గిరి కోర్టు పరిధిలో ఉండేవని తెలిపారు. వీటికి సంబంధించిన కేసులు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే కాప్రాకు చెందిన కేసులు జిల్లా కోర్టు కుషాయిగూడకు మార్చాలని డిసిపి,ఏసిపి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు దృష్టికి అనేక సార్లు తీసుకువెళ్లామని సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదని, జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన 3వేల కేసులు మేడ్చల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలపై స్పందించవలసిందిగా కోరుతున్నారు.

## శాలవాని కుంటకు మరమ్మతు లేనట్లేనా?

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని శాలవాని కుంట ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో నిండింది. కుంట కట్ట నుంచి నీళ్ల లీకైతు రోడ్డుపైకి రావడంతో రోడ్డు జలమయంగా మారింది. దీంతో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతియేటా ఇదే తంతు కొనసాగుతోంది. కుంట నిండడం లీకు కావడంతో నీరంత రోడ్డుపైకి వచ్చి పెద్ద చెరువులా మారుతోంద ని గ్రామస్థులు అంటున్నారు. మూడుచింతలపల్లి నుంచి ఉద్దెమర్రి వెళ్లే రోడ్డు నీటితో నిండిపోవడంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. వర్షాకాలం వచ్చిదంటే ఈ రోడ్డు నీటితో నిండిపోతుందని సంబందిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబందిత ఇర్రిగేషన్ అధికారులు స్పందించి శాలవాని కుంట కట్టకు మరమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## నీట మునిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం : ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూంకుంట మున్సిపాలిటిలోని పల్లవి ప్రొగ్రెసివ్ హైస్కూల్ నీట మునిగిపోయింది. దీంతో పాదచారులు. ప్రయాణికులు రోడ్డుపైకి వచ్చిన నీటిని దాటుటకు తీవ్ర తంటాలు పడుతున్న సమయంలో శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ ఆదేశాల మేరకు పెట్రోల్ మొబైలింగ్ పోలీసులు ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ రమేష్‌గౌడ్, బొప్పయ్యలు సంఘటన స్థలానికి వెళ్లి వరదలతో వస్తున్న నీటిని మార్గాలు వెతికి నీరు వెళ్లేటట్లు తక్షణ చర్యలు చేపట్టారు. పొంగిపొర్లుతున్న నీటి వరద సమస్యలను పోలీసులు తక్షణమే స్పందించి ఏ శాఖ వారు రాకున్న పోలీసులే ముందుండి నీళ్లు వెళ్లుటకు సహాయక చర్యలు చేపట్టారు. దీంతో ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, చెక్ డ్యామ్‌లు దగ్గర చేపలు రావడం వలన వాటిని పట్టేందుకు నీటిలోకి దిగడం ప్రాణాపాయానికి దారి తీస్తుందన్నారు. చేపల కన్న ప్రాణం మిన్న అని చెప్పారు. వర్షాకాలంలో విద్యుత్ తీగలు, ఎలక్ట్రిక్ స్తంభాలు, మ్యాన్ హోల్స్, లోతు ప్రాంతాల వద్ద జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.





## ప్రభుత్వ పాఠశాలకు టివి అందజేత

ప్రజాపక్షం/దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని బడెంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాఫ్టివేర్ ఇంజనీర్ వెంకటేష్ ఆర్డీవోలో ఉద్యోగం చేస్తున్న అశోక్ 25వేల విలువగా టీవీ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దశరథ్ 5000 ఖర్చు చేసి విద్యార్థులందరికి టై, బెల్టులు,ఐడి కార్డులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామ యువకులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు వారు ఇచ్చిన టివి ఎంతోగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## వరుసగా రెండో 'గ్రాండ్ స్విస్' టైటిల్.. చరిత్ర సృష్టించిన దివ్య



ప్రపంచ చదరంగాన్ని భారత యువ గ్రాండ్ మాస్టర్ శాసిస్తున్నారు. ఈ మధ్యే ఫిడే మహిళల వరల్డ్ కప్ టైటిల్‌తో దివ్య దేశ్‌ముఖ్ కొత్త అధ్యాయం లిఖించగా.. తాజాగా రమేశ్‌బాబు వైశాలి సైతం చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ స్విస్ టైటిల్‌ని నిలబెట్టుకున్న తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. సోమవారం జరిగిన ఫైనల్లో మాజీ వరల్డ్ ఛాంపియన్ టాన్ జొంగ్యీకు ముచ్చెమటలు పట్టించింది వైశాలి. అసమాన పోరాటంతో మ్యాచ్ డ్రా చేసుకున్న భారత చెస్ క్వీన్.. అత్యధిక పాయింట్లతో టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టాన్ జోంగ్యీకి చెక్ పెట్టడం ద్వారా వచ్చే ఏడాది జరుగబోయే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించింది చెస్ క్వీన్.

## యుఎఇ చేతిలో ఒమన్ చిత్తు

### సూపర్ 4కు దూసుకెళ్లిన భారత్

ఆసియా కప్‌లో యుఎఇ బోణీ కొట్టింది. తొలి పోరులో భారత జట్టు చేతిలో దారుణంగా ఓడిన ఆతిథ్య టీమ్ సోమవారం ఒమన్‌ను వణికించింది. కెప్టెన్ ముహమ్మద్ వసీం(69), ఓపెనర్ అలీషాన్ షరాఫు(51)ల మెరుపులతో భారీ స్కోర్ చేసిన యుఎఇ ప్రత్యర్థిని 130కే ఆలౌట్ చేసింది. 42 పరుగుల తేడాతో గెలుపొంది పాయింట్ల ఖాతా తెరిచింది. దాంతో.. వరుసగా రెండు విజయాలతో గ్రూప్ ఏ టేబుల్లో అగ్రస్థానంలో ఉన్న టీమిండియా సూపర్ 4కు దూసుకెళ్లింది. సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా కప్‌లో యుఎఇ జట్టు తొలి విజయం సాధించింది. టీమిండియా చేతిలో ఓటమి నుంచి తేరుకున్న బ్య బ్యాటర్లు ఒమన్ బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోర్ అందించారు. కెప్టెన్ ముహమ్మద్ వసీం(69), ఓపెనర్ అలీషాన్ షరాఫు(51)లు బౌండరీల మోతతో హాఫ్ సెంచరీలు బాదేశా రు. ఆఖర్లో హర్షిత్ కౌశిక్(19) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసిన ఆతిథ్య జట్టు అనంతరం ప్రత్యర్థిని 130కే పరిమితం చేసింది. పేసర్ జునైద్ సిద్దిఖీ (4–23) విజృంభించడంతో ఒమన్ బ్యాటింగ్ యూనిట్ కుప్పకూలింది. ఆ జట్టులో ఆర్యన్ బిష్త్ (24), కెప్టెన్ జతిందర్ సింగ్ (20), వినాయక్ శుక్లా(20)లు రాణించారు. కీలక ఇన్నింగ్స్‌తో యుఎఇ విజయంలో కీలకమైన అలీషాన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



## పాక్‌తో ఆడటం భారత ఆటగాళ్లకు ఇష్టం లేదు : సురేశ్ రైనా



పాకిసాన్‌తో అయిష్టంగానే భారత ఆటగాళ్లు మ్యాచ్ ఆడారని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. బిసిసిఐ ఒత్తిడి మేరకే తప్పని పరిస్థితుల్లో బరిలోకి దిగారని తెలిపాడు. ఆసియా కప్ 2025లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో తలపడిన భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్నందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేయాలని మేజార్టీ భారతీయులు పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ ఘటనల నేపథ్యంలో పాక్‌తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని భారతీయులు కోరుకుంటున్నారు. కానీ ఐసిసి, ఎసిసి రూల్స్ ప్రకారం పాకిస్థాన్‌కు ఆడాల్సిన పరిస్థితి ఏర్పడిందని బిసిసిఐ వివరణ ఇచ్చింది. అయినా వినని అభిమానులు ఈ మ్యాచ్ పట్టించుకోలేదు. అభిమానుల నిరసనల మధ్యే పాక్‌తో ఆడిన భారత్ అసాధారణ విజయాన్నందుకుంది. ఈ విజయానంతరం పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా భారత ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. అంతేకాకుండా ఈ విజయాన్ని భారత సాయుధ దళాలకు అంకితమిస్తున్నట్లు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రకటించాడు. పహల్గామ్ ఉగ్ర దాడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి సానుభూతిని తెలియజేస్తున్నామని వెల్లడించాడు. తప్పని పరిస్థితుల్లోనే ఈ మ్యాచ్ ఆడాల్సి వచ్చిందని అభిమానులకు పరోక్షంగా సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే సురేశ్ రైనా సంచలన వ్యాఖ్యలు చేశాడు. అసలు భారత జట్టుకు ఈ మ్యాచ్ ఆడే ఇష్టమే లేదని చెప్పాడు. 'పాక్‌తో మ్యాచ్ ఆడాలని భారత ఆటగాళ్లకు ఏ మాత్రం ఇష్టం లేదు. మీరు మన ఆటగాళ్లను వ్యక్తిగతంగా తమ అభిప్రాయాలను అడిగితే ఇదే విషయం చెబుతారు. ఆసియా కప్లో పాక్తో ఆడాలని ఉందా? లేదా? అనే ప్రశ్నకు అందరూ లేదనే బదులిస్తారు. బిసిసిఐ ఒత్తిడి వల్లే ఈ మ్యాచ్ ఆడేందుకు వారు అంగీకరించారు. పాక్‌తో ఆడటం నన్ను బాధించింది. విజయం సాధించడం ఆనందమే కానీ.. అసలు ఆడకుండా ఉండుంటే ఇంకా బాగుండేది.'అని సురేశ్ రైనా పేర్కొన్నాడు. వరుసగా రెండు విజయాలతో టీమిండియా సూపర్4 బెర్తు ఖరారు చేసుకుంది. మరోవైపు పాకిస్థాన్ తమ ఆఖరి మ్యాచ్లో యూఏఈపై విజయం సాధిస్తే రెండో జట్టుగా సూపర్4కు అర్హత సాధిస్తుంది. అదే జరిగితే మరోసారి భారత్, పాక్ జట్లు తలపడుతాయి. వచ్చే ఆదివారమే(సెప్టెంబర్ 21) ఈ మ్యాచ్ ఉంటుంది. అప్పుడు ఇరు జట్ల మధ్య మరింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

# ఫోకస్ యువతరంగం

## ప్రమాద ఘంటికలు






శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా (అమెరికా)లోని మైక్రో సాఫ్ట్ మౌంటెన్ వ్యూ కార్యాలయంలో భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రతీక్ పాండే మరణం టెక్ కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగులందరికీ హెచ్చరికలు జారీ చేస్తున్నది. గత నెల (ఆగస్టు 20న) విధినిర్వహణలో ఉండగానే 35 సంవత్సరాల పాండే గుండెపోటుకుగురయ్యాడు. అక్కడికక్కే మరణించాడు. అయితే, పాండేకు ఆరోగ్య సమస్యలు ఏవీ లేదని అతని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. తీవ్రమైన మానసిక ఒత్తిడే అతని మరణానికి కారణమని అనుమానిస్తున్నారు. ఉద్యోగంలో భాగంగా పాండే ఎన్నో ప్రాజెక్టులను మేనేజ్ చేస్తున్నందు వల్ల చాలా ఒత్తిడిగా ఉన్నట్టు సహచరులు అంటున్నారు. పాండే మృతి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. అదే సమయంలో టెక్ కంపెనీల్లోని పరిస్థితులపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఉద్యోగులను రాత్రిళ్లు ఎక్కువగా పని చేయడాన్ని టెక్ కంపెనీలు నియంత్రించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. పని ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు. పాండే మృతి సంఘటన సిలికాన్ వ్యాలీ సహా ప్రపంచ ఐటి రంగంలో నెలకొన్న పరిస్థితులపై అనుమానాలకు కారణమవుతున్నది. ప్రత్యేకించి అతిగా పనులు చేయాల్సి రావడాన్ని చాలా మంది తప్పుపడుతున్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), చాట్‌బోట్స్ వంటి అధునాతన సాంకేతిక అందుబాటులోకి రావడంతో, ఉద్యోగ భద్రతపై ఉన్న ఒత్తిడి కూడా ప్రస్తుతం టెక్ రంగంలో మరింత పెరిగిందని పరిశీలనలు వెల్లడించాయి. తగినంత విశ్రాంతి లేకుండా పని చేయాల్సి రావడం, ఆపై తీవ్రమైన ఒత్తిడి పాండే మరణానికి కారణమయ్యాయి. ఐటి రంగంలో నెలకొన్న పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతున్నది.

## ఓపెన్ 'ఎఐ'పై కేసు



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌కు చెందిన మరియా రైనే, మాట్ రైనే దంపతులు ఓపెన్ ఎఐ కంపెనీపై కేసు వేశారు. తమ కుమారుడు ఆడమ్ రైనే ఆత్మహత్య చేసుకోవడానికి ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చిన చాట్‌జిపిటియే కారణమన్నది వారి ఆరోపణ. 16 ఏళ్ల ఆడమ్ ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు కొన్ని వారాల ముందు నుంచి అతను సరుసగా చాట్‌జిపిటిలో 'ఆత్మహత్య చేసుకోవడం ఎలా' అనే ప్రశ్నకు సమాధానాలు వెతకడం మొదలుపెట్టాడు. అతని ఫోన్‌ను పరిశీలిస్తే, మనుషుల కంటే కృత్రిమ మేధస్సు (ఎఐ)తోనే ఎక్కువ సమయం గడిపేందుకు ఇష్టపడేవాడన్న విషయం స్పష్టమైంది. చాట్‌జిపిటి ఇచ్చిన సూచనలను తు.చ తప్పకుండా పాటించి, అతను ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రైనే దంపతులు తమ కుమారుడి మృతికి చాట్‌జిపిటి ఇచ్చిన సమాచారమే కారణమంటూ లా సూట్‌లో ఆరోపించారు. ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా ఈ కేసుపై జోరుగా చర్చ జరుగుతున్నది. కారణాలు ఏవైనా, యువత ఏ విధంగా తప్పుతోవ పడుతున్నది, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నదనేది ఈ ఘటన నిరూపిస్తున్నది. ఇలాంటి అకాల మరణాలు, బలవంతపు చావులు తగ్గాలంటే సమాజం మొత్తం జాకరూకతతో ఉండాలి. ఎఐ కంటే స్నేహితులు, కుటుంబ సభ్యులే ముఖ్యమనే ఆలోచనను పిల్లలకు కలిగించాలి. సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని వారితో గడపాలి.

## పెరుగుతున్న అంతర్జాల వ్యసనం!

యువతీయువకుల్లో అంతర్జాల వ్యసనం క్రమంగా పెరుగుతున్నది. అమెరికా, ఐరోపా దేశాల్లో ప్రస్తుతం 18.25 శాతం మంది నెటిజన్లు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. వివిధ మీడియా కథనాలను అనుసరించి, ఒక్క చైనాలోనే 2.5 కోట్ల మంది గేమింగ్ అడిక్షన్‌కు గురయ్యారు. దక్షిణ కొరియాలో 24 శాతం మంది గేమ్స్‌ఆడేవారు ఆ ఆటే వ్యసనంగా మారి ఆసుపత్రి పాలవుతున్నారు. మాస్కోలో 17 ఏళ్ల యువకుడు 22 రోజుల పాటు ఏకధాటిగా గేమ్స్ ఆడి చివరకు మృతి చెందిన ఘటన పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, పది మందిలో కనీతసం ముగ్గురు నిద్రలేచింది మొదలు పడుకొనేదాకా ఫోన్ వదలడం లేదు. సగం మందికివైగా రోజుకు సగటున 50 సార్లు తమతమ ఫోన్లను చెక్ చేసుకుంటూ ఉన్నారు. ప్రయాణంలో, విధుల్లో, చివరికి స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నప్పటికీ, 60 శాతం మంది సెల్‌ఫోన్లు చూడడాన్ని మానుకోలేకపోతున్నారు. మద్యపానం, డ్రగ్స్, పొగతాగేవారున్న కుటుంబాలోని వారికి ఈ సమస్య ఎక్కువ. అదే విధంగా ఇప్పటికే మానసిక సమస్యలున్న వారు, ఆందోళన, ఒత్తిడి ఎక్కువున్నవారు, వ్యక్తిత్వలోపం ఉన్నవారు, భావవ్యక్తీకరణ లోపంతో నలుగురిలో కలవలేకపోతున్నవారు ఎక్కువగా ఫోన్లపైనే ఆధారపడుతున్నారు. నిజానికి అంతర్జాలాన్ని చూసే వారందరూ దానికి బానిసలు కారు. కాకుంటే పైన వేర్కొన్న సమస్యలున్న వారు వ్యసనపరులయ్యే ప్రమాదం ఎక్కువ. ఆందోళన, ఒత్తిడి, వ్యక్తిత్వ సమస్యలున్నవారు ఇతరులతో మేరుగైన సంబంధాలు నిర్వహించలేరు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇలాంటి వారు ఎక్కువగా నెట్ పై ఆధారపడి వర్చువల్ రిలేషన్‌ను కోరుకుంటారు. ఇందులో భాగంగా క్రమంగా నెట్కి బానిసలవుతారు. కాబట్టి, పిల్లలు నెట్లో ఏమి చేస్తున్నారు.. ఏమి చూస్తున్నారో అనే విషయంపై తల్లిదండ్రులు తప్పకుండా నిఘా ఉంచాలి. పరిమితి మించితే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఇంట్లో పిల్లలు నెట్‌ను పరిమితికి మించి వినియోగిస్తుంటే వారిని ఆటలు, వ్యాయామం, ఇతర అంశాల వైపు మళ్లించాలి. ఇంట్లో కంప్యూటర్‌ను హాల్లోనే అందరికీ కనిపించేలా ఉంచాలి. మానసిక ఒత్తిడి, ఆందోళన, భావవ్యక్తీకరణ లేమి తదితర సమస్యలతో బాధపడుతున్న వారు నెట్ వల్ల కాస్త రిలీఫ్ గా భావిస్తారు. కానీ, తర్వాత ఇదే వారిని క్రమంగా మరింత ప్రమాదంలోకి నెట్టేస్తుంది. వర్చువల్ ప్రపంచంలో (నెట్) నుంచి బయటపడలేక మానసిక సమస్యలు మరింత పెరుగుతాయి. దీంతో వారు బయట కంటే వర్చువల్ ప్రపంచమే బాగుందనుకుని క్రమంగా దానికి బానిసలైపోతారు. ప్రస్తుతం మా వద్దకు కౌన్సెలింగ్ కోసం నిత్యం కొంత మంది నెట్ వ్యసనపరులు వస్తున్నారు.



వరంగల్...

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు


నేలకొండపల్లి...

### సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు : ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

ప్రజాపక్షం/వరంగల్ : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. విలీనం దినోత్సవంపై మాట్లాడే హక్కు బిజెపికి ఎంతమాత్రం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో సాయుధ పోరాట వారోత్సవాల సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ మైదాన్‌లోని చెన్నబోయిన కమలమ్మ అప్పన్న విగ్రహాలకు నివాళులర్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా అధ్యక్షతన జరిగిన సాయుధ పోరాట వారోత్సవాల సభలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. విమోచన దినోత్సవం పేరిట బిజెపి ప్రజలను మభ్యపెడుతుందన్నారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బిజెపి పాత్ర ఏమాత్రం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.వెంకటరాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, దండు లక్ష్మ ణ్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, అక్కపెల్లి రమేష్, ఎండి అక్బర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ పాల్గొన్నారు.

#### నిజాం నవాబు, రజాకార్లను తరిమి కొట్టిన ఘనత కమ్యూనిస్టులది

**నేలకొండపల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం, రజాకార్లను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సోమవారం నేలకొండపల్లి సిపిఐ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అమరజీవి కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ నిజాం నవాబు, రజాకార్లను, జమీందార్లు లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదన్నారు. కార్యక్రమంలో మిడికంటి వెంకట రెడ్డి, కర్నాటి భాను ప్రసాద్, కనకబండి సీతారాములు, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, రైతుసంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్‌రావు, చావ గణపతిరావు, ఆలేటి మహేష్, తమ్మిశెట్టి మమత, కుంచం బిక్షం, బాలిన కృష్ణంరాజు, కాశబోయిన అయోధ్య, అబ్దుల్ సత్తార్, రావెల కృష్ణయ్య, వల్లాల కృష్ణ, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, అనంత పుల్లయ్య, బాలెబోయిన వెంకటేశ్వర్లు, చిలువేరు రేణుబాబు, కనకబండి కృష్ణయ్య, చెన్నబోయిన మల్లయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

**శాయంపేట :** తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడి నైతిక హక్కు బిజెపికి లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం సిపిఐ శాయంపేట మండల సమితి ఆధ్వర్యంలో మందార్ పేట్‌లో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, ఎండీ అంకుషావలి, వల్లాల రమేష్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, తీగలా కల్పనా, వైదుల రమా, లక్ష్మీ పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరులోని బస్టాండ్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. జన్నారపు మొగిలి అధ్యక్షత వహించగా ఆదరి శ్రీనివాస్, ఎన్ఎ స్టాలిన్, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, అనుకారి అశోక్, జన్నారపు మొగిలి, ఎండీ అంకుషావలి, జె.తరుణ్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, తీగలా కల్పనా, వైదుల రమా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి:** సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ మండల కార్యదర్శి శనగరపు రాజకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, ఆదారి శ్రీనివాస్, ఊటుకూరు రాములు, కొట్టపాక రవి, మరిపెల్లి తిరుమల, తండముండయ్య, మల్లయ్య మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, చంద్రమౌళి, కుమారస్వామి, పోచయ్యలు తదితరులు పాల్గొన్నారు.

#### పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

**నిర్మల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా జిల్లాకేంద్రంలో రాంజీగోండ్, కొమరం భీమ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భుక్య రమేష్, ఎస్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

**భైంసా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారసత్వం పూర్తిగా సిపిఐకే దక్కుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు భైంసా పట్టణంలో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, భూక్యా రమేష్, జిల్లా కార్యదర్శి ఎస్ఎన్.రెడ్డి. గోపి, మండల కార్యదర్శి పెందరి ముత్యం, సహాయ కార్యదర్శి లక్ష్మ ణ్, అనిల్ సింగ్, జావేద్, బాలు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బద్దం ఎల్లారెడ్డి సింగిరెడ్డి భూపతి రెడ్డిల కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలనీ సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా లక్ష్మీ పూర్ శివారులో గల సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపం నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమ నాగరాజు, మీసం లక్ష్మ ణ్, మంగ అనిల్, సుంకనపల్లి శాంత, గాజుల లింగం, కొంక విజయ్ పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** మట్టి మనషులను పోరాట యోధులుగా మార్చింది తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌రావు అన్నారు. సదాశివపేటలో సిపిపి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను తాజోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రెహమాన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫీ అహ్మద్, మండల కార్యదర్శి పాండు, పట్టణ కార్యదర్శి అనసూజ, మునిపల్లి, మండల కార్యదర్శి, గంగమ్మ, నాయకులు బుజ్జమ్మ, ముస్తాపా, పూలమ్మ, శంకరప్ప, సాదిక్ అలీ, బిపాషా, సంజీవ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు,.

**యాదాద్రి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సోమవారం రాజపేట మండలంలో రేణిగుంట గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరజీవి చింతల పూడి రామ్‌రెడ్డి విగ్రహం వద్ద, కురారం గ్రామంలో పాశం రామ్‌రెడ్డి, బొందు గుండ్ల గ్రామంలో నారాయణరెడ్డి, బేగంపేట గ్రామంలో బద్దం నర్సిరెడ్డి, జిట్టా రామచంద్రారెడ్డి, చిగుళ్ల మల్లయ్య, జంగం శంకరయ్యల బాలయ్య బలిజ వీరయ్యల స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, మండల సహాయకార్యదర్శి మూలపోచయ్య, ఒగ్గు కరుణాకర్, మూల హరినాథ్, దేవి, సత్తయ్య, ఆకుల బాల నరసయ్య, దొంతి సారపు లక్ష్మీ పతి, గంధమల్ల రాజయ్య, పుట్ట గణేష్, మంగా ఐలయ్య, నంద మల్లేశం, జీడిపల్లి ఉప్పల్‌రెడ్డి, జంగా అంజయ్య, పుంజాల రాజు పాల్గొన్నారు.

**షాబాద్ :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ప్రభులింగం, నియోజకరవ్గ ఇన్‌చార్జ్ రామస్వామి, కౌన్సిల్ సభ్యులు వడ్ల సత్యనారాయణ, సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల, మక్బూల్, కార్యదర్శులు పాలమాకుల శ్రీశైలం, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి...


శాయంపేట...


సిరిసిల్ల...


షాబాద్...


నిర్మల్...



భైంసా...


సంగారెడ్డి...


యాదాద్రి...



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు
### జిల్లా ఎస్‌పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రజాసమస్యలుపరిష్కరిస్తూబాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి అర్జీలను పరిశీలించారు. ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదుదారులకుభరోసా కల్పించాలన్నారు.కుటుంబతగాదాలు, భూ తగాదాలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## పోక్సో కేసులో నేరస్థుడికి 21 ఏళ్ళ జైలు
### 8 ఏళ్ళ చిన్నారిపై లైంగిక దాడి
### ఏడున్నర ఏళ్ల తర్వాత తీర్పు
### బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఏడున్నరేండ్ల క్రింద 8 సంవత్సరాల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరస్థుడికి నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు కఠిన శిక్షను ఖరారు చేసింది. ఈ కేసుకు సంభందించిన తీర్పును సోమవారం కోర్టు వెలువరించింది. వివరాలకు వెళితే... వనిపాకల గ్రామానికి చెం దిన దోమల రాములు 2018 సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ళ బాలిక ఇంట్లోకి ప్రవేశించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బాధితురాలి తండ్రి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయ్యింది. పోక్సో చట్టం, 2012 ప్రకారం చార్జీషీట్ దాఖలు చేస్తూ కోర్టులో ప్రవేశ పెట్టారు. సుధీర్ఘ విచారణ అనంతరం కోర్టు న్యాయమూర్తి రోజారమణి నేడు తుది తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి 21 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు, రూ. 30 వేల జరిమానా విధించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆమె తీర్పునిచ్చింది.

# శాఖల సమన్వయంతోనే కార్యక్రమాలు విజయవంతం
### సూర్యాపేట కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** శాఖల సమన్వయంతో స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ, శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య కేంద్రాల యందు ప్రత్యేక మహిళా ఆరోగ్య వైద్య శిభిరాలను, ప్రత్యేక వైద్య నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడుతాయన్నారు. జిల్లా అధికారులందరు తమ శాఖ ద్వారా భాగస్వామ్యమై సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లైన్ డిపార్టు మెంట్ వారి సమన్వయంతో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను, ప్రత్యేక వైద్య నిపుణులచే అన్ని ఆరోగ్య కేంద్రాలలో మహిళా ఆరోగ్య వైద్య శిభిరాలు ఏర్పాటు చేయబడుతాయన్నారు.అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకిల్ క్యాన్సర్, క్షయ, రక్త హీనత, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు కంటి, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, చర్మ సంబంధిత, మానసిక సంబంధ మైనగర్భిణీ పరీక్షలు, రక్తహీనత పరీక్షలు, ఎంసిపి కార్డ్, వ్యాధి నిరోధక టీకాలు, నిక్షయ మిత్ర, టిబి పేషంట్ సపోర్ట్, ఆభా కార్డ్ నమోదు, కిశోర బాలికలు, యువతలకు రుతుస్రావ సంబంధ పరీక్షలు, పోషణ, ఆహార పదార్థాలలో 10శాతం వంట నూనెలు, చక్కెర తగ్గించటం, రక్తదాన శిభిరాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.కార్యక్రమాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, యువజన, పంచాయితీరాజ్ సంస్థలు, గ్రామీణాభివృద్ధి, గిరిజనాభివృద్ధి, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో మన జిల్లాలో అమలు పరిచి విజయవంతం చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

### స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలి

స్వచ్ఛతా హి సేవ 2025 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు స్వచ్ఛతా హి సేవ 2025 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వచ్ఛతతో పల్లెలు మెరువాలని పకడ్బందిగా ఈ కార్యక్రమం జరగాలని, స్వచ్ఛోత్సవ్ థీమ్‌తో ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుపాలని తెలిపారు.ప్రజలను భాగస్వాములను చేయడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ 15 రోజులు గ్రామాలు, మున్సిపాలిటిలో నిర్వహించాల్సి ఉంటుందని, అందులో ముఖ్యంగా చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు ఇతర ప్రాంతాలను శుభ్రపరచడం, క్లీన్ అండ్ గ్రీన్, సఫాయి మిత్ర సురక్షా శిభిర్, శ్రమదాన కార్యక్రమాలు, వేస్ట్ నుండి ఆర్ట్ క్రియేట్ చేయడం, ఫుడ్ స్ట్రీట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలు అన్ని శాఖలు భాగస్వామ్యంతో చేపట్టాలని ఆదేశించారు.గ్రామ పంచాయితీలలో యువత, ఎస్‌హెచ్‌జిలు, గ్రామ పెద్దలు, ఎన్‌జిఓల భాగస్వామ్యంతో చేపట్టి పంచాయితీ కార్యదర్శులచే కార్యక్రమం ప్రారంభానికి ముందు, ఆ తరువాత ఫోటోలను తీయాలన్నారు. స్వచ్ఛత హి సేవ 2025 పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని యండ్లపల్లిలో దండి అంతయ్య జ్ఞాపకార్థం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సూర్యాపేట నియోజక వర్గ స్థాయి,వాలీబాల్ క్రీడోత్సవాల టోర్నమెంట్, సెలక్షన్స్ కార్యక్రమానికి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, మండల ఎంఇఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్‌రెడ్డి, డిసిసిఉపాధ్యక్షుడు కుంట్ల వెంకట నాగిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దాసరి తిరుమల్‌రావు, పట్టణ కాంగ్రెస్‌అధ్యక్షులు యండి అంజద్‌అలీ పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ భూ నిర్వాసితులు మార్చాలంటూ సంస్థాన్ నారాయణపురం మండలం దేవి రెడ్డి బంగ్లా వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ వ్యవసాయ మీద ఆధారపడి జీవనం గడుపుతున్న తమను ప్రభుత్వం అన్యాయంగా భూములు రోడ్డు కోసం తీసుకున్నట్లయితే నిరాశ్రయులు గా జీవనం పరిస్థితులు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్ సంఘటన స్థలానికి చేరుకొని భూ నిర్వాసితులను అదుపులోకి తీసుకొని రైతులతో మాట్లాడి శాంతింప చేశారు.

## పేదల కోసం పోరాటాలు
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్



**ప్రజాపక్షం/ఆలేరు:** పేద ప్రజల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిన మహోన్నతమైన దంపతులు కట్కూరి సుశీల దేవి రామచంద్ర రెడ్డి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొల్లూరు మంతపురి, బహుదూర్ పేట, తదితర గ్రామాల్లో కట్కూరి సుశీల దేవి రామ చంద్ర రెడ్డి, గోరంతల రామచంద్ర రెడ్డి, ఆకారం యాగిరెడ్డి స్థూపాలకునివాళులర్పించారు. చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు తెడ్డు ఆంజనేయులు, పేరపు ఐలయ్య, దానయ్య, మైసయ్య, దారా ఉదయ, చంద్రయ్య నర్సయ్యలు పాల్గొన్నారు.

## యూరియా ఏదయ్యా?



**ప్రజాపక్షం/హాలియా:** యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం కొత్తపల్లి సహకార సంఘం భవనం ఎదుట రైతులు ధర్నాకు దిగారు. హాలియా,నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై సుమారు గంటసేపు రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. యూరియా కోసం ప్రతి రోజు ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పంటలు దెబ్బతింటాయన్నారు.. భారీ నష్టం వస్తుందన్నారు. రిటైల్ దుకాణదారులకు యూరియా కేటాయించినప్పటికీ వ్యాపారులు యూరియాను బ్లాక్‌లో రూ.350 నుండి రూ.400 వరకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు రైతులకు నచ్చ చెప్పి ధర్నాలు విరమింపచేశారు.

## హన్యానాయక్‌కు 'గ్లోబల్‌ఎక్స్‌లెన్స్' అవార్డు





**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** అనాధ పిల్లలు, వృద్ధులు, వికలాంగులు,వితంతువులు, యాచకులుతోపాటు విద్యా, వైద్య రంగాలకు విశిష్ట సేవలతోపాటు రక్తదానం, అన్నదానం వంటి అనే సేవలు అందిస్తున్నందుకుగాను సంఘ సంస్కర్తగా పేరు ప్రఖ్యాతలు పొందిన మిర్యాలగూడకు చెందిన ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సామాజిక వేత్త ధీరావత్ హన్యానాయక్ ఈనెల 13న థాయ్‌లాండ్‌లోని సిలోంలో హాలిడే ఇన్ హోటల్‌లో అంతర్జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి గ్లోబల్ ఎక్స్‌లెన్స్ సంస్థ తనకు అవార్డును, సర్టిఫికెట్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. తన జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేస్తానన్నారు. హన్యానాయక్‌కు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ధైర్యం, నిబద్ధత, త్యాగనిరతి స్ఫూర్తిదాయకం
### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్ర శేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు చూపించిన ధైర్యం,నిబద్ధత,త్యాగనిరతి ప్రజలందరికీ ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్ర శేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ నైజాం నవాబుల నిరంకుశ పాలన,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దేశ చరిత్రలోనే గొప్ప పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. సిపిఐ హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,దేవరం మల్లీశ్వరీ,కొప్పోజు సూర్యనారాయణ, కందుల వెంకటేశ్వర్లు, సోమగాని కృష్ణ, దొంతగాని సత్యనారాయణ,యల్లావుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, చెన్నగాని సైదులు, యల్లావుల ఉమ జక్కుల రమణ పాల్గొన్నారు.

## నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు ఎల్లంకి శ్రీనివాస్
### మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండ లం అల్లందేవి చెరువు గ్రామంలో సీపీఐ మండల నాయకుడు మాజీ ఎంపీపీ ఎల్లంకి శ్రీనివాస్ 10వవర్ధంతిని ఆయన స్థూపం వద్ద జోహార్లు అర్పిం చారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ శ్రీనివాస్ నిస్వార్థ గల కమ్యూనిస్టు నాయకుడు అన్నారు.సాధారణ కుటుంబంలో పుట్టి, ప్రజల సమస్య ల పరిష్కారం కోసం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గుండు కిష్టయ్య, కురుమిద్ద లింగయ్యలతో కలిసి భూ పోరాటాలు నిర్వహించి అప్పటి ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు చొరవతో అల్లందేవి చెరువు గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేయించారని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సీపీఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, సురవి నరసింహ, గుండు నరసింహ, పొట్ట శంకరయ్య, పల్లె మల్లారెడ్డి, ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, బద్దుల పెంటయ్య, ఈద మల్లయ్య, గడ్డం యాదగిరి,శ్రీనివాస్‌సతీమణిజంగమ్మ ఉన్నారు.

## నేటి విద్యార్థులకు డిజిటల్ విద్య అవసరం
### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ:** నేటి విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ అవసరమని, ఏఐ అనుసంధానంతో నైపుణ్యమైన విద్యను అందించాలని కోదాడ ఎమ్మె ల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ లు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కంప్యూటర్‌ల్యాబ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వి ద్యార్థులకు నైపుణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణప్రభుత్వంకృషిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ చేస్తున్న కృషికి కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, పిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కేండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనం ఢీ.. మహిళ మృతి

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** 44వ జాతీయ రహదారి మీదుగా ఉండవెల్లి స్టేజి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పై సోమవారం స్థానికులు తెలిపిన అనంతరం ఎస్ఐ శేఖర్ పోలీసు సిబ్బంది, సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ అక్కడక్కడ మృతి చెందినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. అర్ధరాత్రి వేళలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. మృతురాలు వయస్సుః45 సంవత్సరాలు. పసుపు రంగు చీర ధరించినట్లు తెలిపారు.

## రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదే : పల్లె శేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబును రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు పురస్కరించుకుని సోమవారం చౌటుప్పల్ పట్టణంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహానికి సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోరాట యోధుల వల్లే దున్నే వాడికి భూమి దక్కడంతో పాటు వెట్టిచాకిరి విముక్తి కలిగిందని, వేలాది గ్రామాలు నిజాం కబంధహస్తాల నుండి విముక్తి చెందాయని, సాయుధ పోరాటంలో 4500 కమ్యూనిస్టులు అమరులయ్యారన్నారు. వారి చరిత్రను భా వితరాలకు తెలియజేసేందుకు కమ్యూనిస్టులంతా కృషి చేయాలన్నారు. రాచరికనికి వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని నేడు మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు కుట్రలు జరుగుతున్నాయని,మేధావులంతా తిప్పికొట్టాలని కోరారు.సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఏఐటిసి జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, టంగుటూరు రాములు, బద్దుల సుధాకర్,దాసరిఅంజయ్య,నీళ్లబిక్షపతి,కుంటిపాపయ్య, సింగపంగ బుచ్చయ్య, పాపగల శంకరయ్య, బెదరకోట యాదయ్య, కేతరాజు శేఖర్ ఉన్నారు.

## టిబి, మాదకద్రవ్య రహిత 'నల్లగొండ'గా తీర్చిదిద్దాలి
### రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లాను టీబి రహిత, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.ఒకరోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం అయన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదీత్య భవన్‌లో జిల్లా అధికారులు, ప్రముఖ వ్యక్తులతోలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందుగా రాష్ట్ర గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు ఉన్న అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో టీబీ పట్ల అవగాహన కల్పించాలని, క్షయ వ్యాధి నివారణకు సొసైటీలో అందరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో కవులు, కళాకారులు, రచయితలు వివిధ రంగాలలోని ప్రముఖులను టీబి ముక్త్ భారత్ లో భాగస్వాములను చేసి వారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి టీబిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డికి సూచించారు. జిల్లాలో గాంజా ఎక్కువ మొత్తంలో ఉందని తెలుసుకొని గాంజా నిర్మూలనలో సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ రెండు అంశాలపై తో పాటు, మహిళా సాధికారతకు కృషి చేయాలని, ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు.నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ సూచనల మేరకు నల్గొండ జిల్లాలో టీబి నివారణకు ముఖ్యుల సలహాలు తీసుకోవడమే కాకుండా, జిల్లా యంత్రాంగంతో కలిసి పని చేస్తామని అన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో ఆసియాలోనే అతి పెద్ద రైస్ మిల్లు ఇండస్ట్రీ ఉందని, దీనివల్ల వాతావరణ కాలుష్యం ,టీబి వంటి వ్యాధులు సోకడానికి ఆస్కారం ఉందని ,ఆ ప్రాంతంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి టీబి నివారణకు కృషి చేస్తామన్నారు. అలాగే పట్టణాలలో గాంజా వాడకం ఎక్కువగా ఉందని, దీనిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసీపీ మౌనిక, డిఎఫ్ఓ రాజశేఖర్ ,రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు , తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి
### సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవం అర్థరహితం – సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే
### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలకొండ కాంతయ్య



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** నైజామును తరిమి కొట్టి ప్రజలకు స్వేచ్ఛ స్వతంత్రాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలకొండ కాంతయ ఆరోపించారు.ఈనెల 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ పీఏపల్లి మండల సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి మండలంలోని గుడిపల్లి, తిరుమలగిరి, అంగడిపేటలో ఉన్న అమరజీవి కత్తి నాగిరెడ్డి, నెలంటి రామనరసయ్య, చోల్లేటి రాఘవాచారి ప్రజా పోరాటంలో భాగస్వామ్యులైన అమరుల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సభలో కాంతయ్య మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం చేసి నిజాం నియంత పాలన నుంచి దొరల, భూస్వాముల అరాచకాల నుండి తెలంగాణను విముక్తి చేసిన తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట అమరులకు జోహార్లు అర్పిస్తూ సామాన్యులే సాయుధులై భారత దేశ చరిత్రలో ఒక మహా ఉజ్వల ఘట్టం అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట రాచరికం భూస్వామి వ్యవస్థ మతోన్మాదంపై ఏకకాలంలో సాగిన ఉమ్మడి సమరమది అని అన్నారు. ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్య పెట్టేందుకేనని అన్నారు.తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని పాఠ్యపుస్తకాలలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్,సహాయ కార్యదర్శి నూనె కాంతారావు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,మండల కార్యవర్గ సభ్యులు అలుగుబెల్లి భాస్కర్ రెడ్డి పార్టీ అభిమానులు వివిధ పార్టీల నాయకులు మునగాల అంజిరెడ్డి, పాల్వాయి రంగారెడ్డి, చోల్లేటి బ్రహ్మాచారి,దొడ్డి లక్ష్మయ్య,ఆంజనేయులు, పరమేష, శ్రీనివాస్‌రెడ్డి, బోయ సుధాకర్‌రెడ్డి, అడెపు నరసింహ,మల్లాచారి,భూతం సైదులు, చంద్రారెడ్డి,వెంకటేశ్వర్లు, రుక్మారెడ్డి, శివకుమార్,అశోక్, వాల్య నాయక్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఎట్టకేలకు పట్టుబడ్డ పులి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూడు నెలలుగా మహబూబ్‌నగర్ పట్టణంలో సంచరిస్తున్న చిరుత ఎట్టకేలకు అటవీ అధికారులు బంధించారు. సోమవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా బోనులో చిరుత ఉండటం గమనించారు. మహబూబ్‌నగర్ పట్టణం లోని వీరన్న పేట్ ప్రాంతంలో టిడి గుట్ట పై మూడు నెలల నుంచి చిరుత సంచరిస్తుంది. ఈ ప్రాంతం జనావాసాల మధ్యన ఉండటంతో అటవీ అధికారులు చిరుతను బంధించడానికి నాలుగు బోన్లను ఏర్పాటు చేశారు. చివరికి నిన్న అర్ధరాత్రి బోనులో చిక్కినట్లు తెలిపారు. చిరుత ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నెహ్రూ జూ పార్క్‌కు తరలించినట్లు డిఎఫ్ఓ సత్యనారాయణ తెలిపారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండలం కున్సి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కుల చట్టాలు అనే అంశంపై జిల్లా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అయినా శ్రావణ్ కుమార్ సంతోషి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు 21 సంవత్సరంలోపు అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయకూడదని పిల్లలను పనుల్లో పెట్టుకోకూడదని, అలాగే పిల్లలకు ప్రభుత్వం అందిస్తున సేవలు, పథకాలు గురించి తెలుపుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఏదైన సమస్యలు ఉంటే 1089 కి సమాచారం ఇవ్వగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## కోతుల పట్టివేత ప్రారంభం



### మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

**ప్రజాపక్షం /మద్దూర్ :** గత 20 రోజుల నుంచి మద్దూర్ పట్టణంలో కోతుల దాడులతో ప్రజలకు బెడద నివారణకు సోమవారం రోజు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నుండి ప్రత్యేక బృందాన్ని రప్పించి కోతుల పట్టివేత ప్రారంబించినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని కోతులను పట్టుకున్నారని, మిగిలిన కోతులను కూడా పట్టుకునే పనిలో బృందం నిమగ్నమై ఉన్నారన్నారు. పట్టణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పట్టణంలో ఎక్కడైనా కోతులు కనిపించినా మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు మరియు విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అలీ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

## జడ్చర్ల ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.50,000 విరాళం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణ ప్రెస్ క్లబ్ నిర్మాణానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు భరత్ పెట్రోల్ బంక్ యజమాని శ్రీనివాస్ రెడ్డి 50,000 ఇస్తామని హామీ ఇచ్చారు. సోమవారం నాడు జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ గల భవన్లో నూతనంగా ఏర్పాటు అయిన ప్రెస్ క్లబ్ కమిటీని బికేస్, బిజెపి నాయకులు పూలమాలలు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా జడ్చర్ల లేదని ప్రస్తుతం ఎన్నికైన నూతన కమిటీకి తన వంతు విరాళంగా భవన నిర్మాణానికి 50 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. అదే విధంగా బికేస్ జిల్లా నాయకులు బాలకృష్ణ, మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే విలేకరులకు ఎప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలవర్ధన్ గౌడ్, పిట్టల నరేష్, అమర్నాథ్ గౌడ్ విలేకరులకు ఎప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలవర్ధన్ గౌడ్, పిట్టల నరేష్, అమర్నాథ్ గౌడ్ విలేకరులు సంఘ నాయకులు ఉన్నారు.

## వ్యవసాయానికి బ్యాంకులు రూ.2148 కోట్ల రుణసాయం

### ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** గత ఏడాది కంటే అధికంగా జడ్చర్ల నియోజకవర్గంలోని రైతులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2148 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా ఇవ్వనున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. ఈ మొత్తం రుణాలలో రూ.1140 కోట్లను పంట రుణాలకు కేటాయించగా, మిగిలిన రూ.1008 కోట్లను వ్యవసాయ సంబంధిత రంగాలకు ఇస్తారని వివరించారు. వర్షాలు బాగా కురిసి, రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలను సరళీకృత విధానంలో అందించాలని అధికారులను కోరామని సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై ప్రత్యేక విచారణ కమిటీ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ డిమాండ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్‌లు డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సిపిఐ ఆఫీసు నుంచి ఎంపిడిఓ ఆఫీస్ వరకు ర్యాలీగా బయలుదేరి ఎంపిడిఓ ఆఫీసుముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది నాయకులు చెప్పినవారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని, అర్హులైన నిరుపేదలకు ఉండటానికి ఇల్లు లేనటువంటి వారిని పక్కనపెట్టి అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం సరైన పద్ధతి కాదని తక్షణమే కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో పర్యటించి నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యవర్గసభ్యులు నర్సింహ్మ, విజయుడు, యేసయ్య, మండలపార్టీ కార్యదర్శి బొల్లెద్దులశ్రీను, జిల్లాసమితి సభ్యులు బండిలక్ష్మి పతి, బిజ్జశ్రీను,కిరణ్‌కుమార్, లక్ష్మినారాయణ, మల్లయ్య, తందూరివెంకటమ్మ, బాలస్వామి, సాయిలు, లక్ష్మణస్వామి, బండికృష్ణయ్య, రాధాకృష్ణ, వెంకటస్వామి, సలేశ్వరం, ఆంజనేయులు, చెన్నయ్య, రాజయ్య, యూసుఫ్, స్వామి, వివిధగ్రామాలశాఖ కార్యదర్శులు, వివిధగ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ముట్టడి వద్దు.. సమస్యలుంటే రండి

### పరిష్కారంపై క్యాబినెట్‌లో చర్చిస్తా : మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రచారం కోసం మంత్రి ఇంటిని ముట్టడిస్తే జరిగేదేమీ లేదని కూర్చొని మాట్లాడుకుందాం రండి అని మంత్రి వాకిటి శ్రీహరి ఇంటి ముట్టడికి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లను సాదరంగా ఆహ్వానించి సమస్యలు విని క్యాబినెట్‌లో చర్చిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలపై మంత్రుల ఇళ్లను ముట్టడించాలన్న పిలుపు మేరకు సోమవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకటరామరెడ్డి, పుంజునురు ఆంజనేయులు, గోవిందరాజు అంగన్వాడి జిల్లా ప్రాజెక్టు నాయకుల ఆధ్వర్యంలో దాదాపు 500 మంది అంగన్‌వాడీ టీచర్లతో మక్తల్ లోని ప్రభుత్వ అతిథి గృహం నుండి ర్యాలీగా మంత్రి ఇంటిని ముట్టడించడానికి వచ్చిన సిఐటియు నాయకులను అంగన్‌వాడీ టీచర్లను మంత్రి వాకిటి శ్రీహరి కాంపౌండ్ ఆవరణలోకి ఆహ్వానించారు. వారి సమస్యలను కూర్చొని చర్చించారు. 1975 సంవత్సరంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం నెలకొల్పిన అంగన్‌వాడీ సెంటర్ల పనితనం మెరుగ్గా ఉన్నందున ఇప్పటికి కొనసాగుతున్నాయని మీ సమస్యలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అంగన్వాడి టీచర్ల ఆర్థిక పరిస్థితిని పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లు ఆసరా పింఛన్లు, గృహ ఉచిత కరెంటు అమలు చేస్తున్నామని అంగన్వాడి సెంటర్లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని ప్రస్తుతం మీరు చెప్పిన సమస్యలన్నిటిని క్యాబినెట్ సమావేశంలో చర్చిం చి అమలు అయ్యేలా ప్రయత్నిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం సిఐటి జిల్లా అధ్యక్షుడు వెంకట రామా రెడ్డి అంగన్వాడి మండలాల ప్రాజెక్టు అధ్యక్షులు 15 అంశాలతో కూడిన వినతి పత్రాలను మంత్రికి అందజేశారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహోజ్వల ఘట్టం



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** దేశ పోరాటాల చరిత్రలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహోజ్వల ఘట్టమని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరాంలు అన్నారు. సోమవారం పాన్‌గల్ మండలం కేతేపల్లిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. నాటి కమ్యూనిస్టు యోధులు రావి నారాయణరెడ్డి, మగ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సోయాబుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నవాబు, రజాకార్లు, అతని తాబేదారులైన దొరలు జాగిర్దారులు భూస్వాములు ప్రజలచే వెట్టి చాకిరి చేయించారని, ప్రజల మాన ప్రాణాలను ఆస్తులను దోపిడి చేశారన్నారు. ప్రజానాట్యం మండలి జిల్లా అధ్యక్షుడు వంకా గోపాల్, విప్లవ గీతాలను ఆలపించి ఉత్తేజం నింపారు. ఎన్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గోపాల్, ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంతోష్ , కమ్మావుల పెంటయ్య, మాల కుర్మయ్య, కాకం చిన్న రాముడు, పరశురాముడు, రామాంజనేయుడు, మద్దిలేటి, వెంకటమ్మ, శంకరమ్మ, కురువమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో ....** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం ప్రజా పీడనకు చరమగీతం పాడిందని ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, అధ్యక్షురాలు కృష్ణవేణి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్, మండల కార్యదర్శి ఎం. కురుమయ్య, వేమన్న, శివ, ప్రజానాట్య మండలి కళాకారులు తుపాకుల వెంకటేష్, దప్పు మధు, నర్సింహ, చందు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, పిల్లలకు మెరుగైన ఆరోగ్య సేవలు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అమలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 17న ప్రధాన మంత్రిచే వర్చువల్‌గా ప్రారంభం జిల్లాలో బాలానగర్ సిహెచ్‌సిలో ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాలు నిశ్చియ్ మిత్ర వాలంటీర్ల రిజిస్ట్రేషన్ అవయవ దాతలు రిజిస్ట్రేషన్ తదితర సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. డిఆర్డిఏ మహిళా సంఘాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అంగన్వాడి వర్కర్‌లు, ఆశా ఏఎన్ఎంలు స్వస్త్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమం గురించి అవగాహన కలిగించి మహిళలు ఆరోగ్య పరీక్షలు ఆరోగ్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం స్వస్త్ వారి సశక్తి పరివార్ పోస్టర్ ను ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక సంస్థలు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.కృష్ణ డిప్యూటీ డాక్టర్ శశికాంత్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ నాయక్, వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారిని మంజుల పాల్గొన్నారు.

**ప్రజావాణికి 123 ఫిర్యాదులు**

ప్రజావాణిలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 123 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి, లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. జడ్పిసిఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్‌డిఓ నవీన్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి



**ప్రజాపక్షం/మక్తల్:** హైదరాబాద్‌లోని నార్సింగిలో ఈనెల 19, 20, 21 తేదీలలో నిర్వహించనున్న ఫోటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్లను మంత్రి డా.వాకిటి శ్రీహరి తన నివాసంలో ఆవిష్కరించారు. ఫోటో గ్రాఫర్లకు ఎంతగానో ఉపయోగపడే ఎక్స్ పోలో రాష్ట్రవ్యాప్తంగా ఫోటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్‌రాజు, గౌరవ అధ్యక్షులు పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాజు, కార్యదర్శులు గోవిందు, నరసింహ, సతీష్, మహ్మద్, అస్సుద్దిన్, శంకర్, తిరుపతి, బి.అంబదాస్, తిరుమలేశ్, మహబూబ్, అశోక్, కృష్ణయ్య, తిరుపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గతనెలరోజులుగా కురుస్తున్న అకాలవర్షాల వల్ల నష్టపోయిన పత్తిరైతులకు ఎకరాకు రూ.50వేలచొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డిహెచ్‌పిఎస్ నాయకుల బృందం తాడూరు మండలపరిధిలోని యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, ఐతోల్, అంతారం గ్రామాలలో విస్తృతంగా పర్యటించి పంటపొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా కొమ్ముభరత్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించిన రైతులకు తీవ్రమైనటువంటి పంటనష్టం వాటిల్లిందని, నేడు రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. రైతులను ఆదుకునేవిధంగా ఎకరాకు నష్టపరిహారం రూ.50వేలు చెల్లించివారి కుటుంబాలకు భరోసా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అంతారం గ్రామ మాజీ సర్పంచ్ చిన్నరాములు, డిహెచ్‌పిఎస్ నాయకులు నర్సింహ, కృష్ణయ్య, శ్రీశైలం, బంగారయ్య, బహుగుణ, జగన్‌నాయక్, ఎర్రమైసన్న, పెద్దరాములు, రాములు, లక్ష్మయ్య, బాలస్వామి, నర్సింహ్మ, వివిధగ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటచరిత్రను వక్రీకరించి, ప్రజలమధ్య చీలికలుతెస్తున్న బిజెపి విధానాలను తిప్పికొడతామని సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ పులిజాల పరుషరాములు తెలిపారు. తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సంస్థానంలో వెట్టిచాకిరి, భావ వ్యక్తికరణపై ఆంక్షలు, తెలుగుభాషపై అణచివేత, నిరంకుశ ధోరణులు కొనసాగాయని తెలిపారు. సిపిఐ తాలుకా సహాయ కార్యదర్శి దారదాసు, సిపిఐమండల నాయకులు నేరటిరాజు, బాలయ్య, శ్రీరాములు, అంకూరి పరుషరాములు, శివ, రామస్వామి, నర్సింహ్మ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 44 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నారాయణపేట్:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 44 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదరపు కలెక్టర్లు సంచిత్ గాంగ్ వార్, ఎస్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో... నారాయణ విద్యార్థులకు 3 బంగారు పతకాలు

### నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, డాక్టర్ పి.శరణి నారాయణల హర్షం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రెజ్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) ఛాంపియన్‌షిప్ 2025 లో నారాయణ విద్యార్థులు 3 బంగారు పతకాలు కైవసం చేసుకుని జాతీయస్థాయిలో సత్తా చాటారు. ఆయుష్ ఠాకూర్, వైష్ణవి ఠాకూర్ అనే ఇద్దరు ప్రతిభావంతులైన నారాయణ విద్యార్థులు వారి నైపుణ్యం, కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో విజయకేతనాన్ని ఎగురవేశారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆయుష్ ఠాకూర్ యు11 విభాగంలో పోటీపడి రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారని తెలిపారు. ఒకటి జిఐ విభాగంలో (కిమోనో వంటి ప్రత్యేక డ్రెస్‌తో అదే శైలి), మరొకటి ఎన్‌ఓజిఐ విభాగంలో నేరుగా పట్టీలు, మార్పులతో జరిగే శైలి) వైష్ణవి ఠాకూర్, యు15 విభాగంలో జిఐ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించారని వివరించారు. ఈ విజయాలు విద్యార్థుల పట్టుదలన కాకుండా నారాయణ విద్యాసంస్థల సమగ్ర సహకారానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. చదువులో ఎలాంటి లోటు లేకుండా ఉండేందుకు వారికి ప్రత్యేక తరగతులు, మార్గదర్శనం అందజేయడం ద్వారా నారాయణ తన బహుముఖ ప్రతిభా అభివృద్ధికి కట్టుబడి ఉందని మరో సారి నిరూపించడం గర్వ కారణం అన్నారు. ఆయుష్ ఠాకూర్, వైష్ణవి ఠాకూర్ సాధించిన ఘన విజయాలను గౌరవిస్తూ నారాయణ పాఠశాలలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలియజేశారు. దీని ద్వారా వారి క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం, వారిని మరింత ప్రేరేపించడం, ఇతర విద్యార్థులను కూడా వారి ఆసక్తి రంగాలలో విజయాలు సాధించేందుకు కలలు కనడానికి ఉత్సాహపరచడం నారాయణ విద్యాసంస్థల లక్ష్యమని వెల్లడించారు. 46 ఏళ్ల విజయవంతమైన వారసత్వంతో నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయన్నారు. 'మీ కలలే మా కలలు' అనేది నారాయణ గ్రూప్ నినాదం అన్నారు.

## ఇసి పద్ధతి చట్టవిరుద్ధమైతే ఎస్‌ఐఆర్ పూర్తిగా రద్దు

### హెచ్చరించిన సుప్రీంకోర్టు
### అక్టోబరు 7న అన్ని పిటిషన్లపై తుది వాదనలు

**న్యూఢిల్లీ :** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) కసరత్తు స మయంలో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే 'మొత్తం ఎస్‌ఐఆర్'ను రద్దు చేస్తామని సోమవారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని (ఇసి)హెచ్చరించింది. అయితే ఒక రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగిగిన సంస్థగా ఎన్నికల సంఘం ఏ దశలోనైనా నిబంధనలను సరిగ్గానే పాటించిందని తాము భావిస్తున్నామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ చెల్లుబాటుపై తుది వాదనలు వినడానికి అక్టోబరు 7ను ఖరారు చేసింది. 'ఏదైనా ఒక్క ముక్క'లో అభిప్రాయం చెప్పడానికి నిరాకరిస్తూ, బిహార్ ప్రత్యేక సమగ్ర స వరణ విషయంలో మా తీర్పు దేశం అంతటికీ వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం ఒకే తరహా కసరత్తును ఆపలేమని కోర్టు స్పష్టం చేసింది. అయితే బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తుకు వ్యతిరేకంగా పిటిషనర్లు అక్టోబరు 7న దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణపై కూడా వాదించడానికి ధర్మాసనం అనుమతించింది. సెప్టెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించడం వల్ల కేసు తీర్పులో ఎలాంటి తేడా ఉండదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 'ఓటర్ల జాబితా తుది ప్రచురణ వల్ల మనకు ఎలాంటి తేడా వస్తుంది?. కొంత చట్టవిరుద్ధం జరిగిందని మేం భావిస్తే దానిని పక్కన పెట్టవచ్చు' అని ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తును సవాల్ చేసిన పిటిషనర్లకు ధర్మాసనం తెలిపింది. ఈలోగా బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణలో ఆధార్ కార్డును 12వ నిర్దేశిత పత్రంగా చేర్చాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన సెప్టెంబరు 8న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్వర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీస్ జారీచేసింది. ప్రారంభంలో ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ ప్రత్యేక సమగ్ర సవరణపై తుది అంచనా వేసే వరకూ కోర్టు విచారణ జరపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. అసోసియేషన్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆ) తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ ప్రక్రియను నిర్వహించడానికి భారత ఎన్నికల సంఘం ఇతర రాష్ట్రాలలోనూ సన్నాహాలు చేస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రీయ జనతా దళ్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనను వినిపిస్తూ ఎన్నికల సంఘం నియమాలు వారి సొంత మ్యానువల్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన సంస్థ కాబట్టి అది చట్టాన్ని, నియమాలను పాటిస్తుంది' అని వివరించింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తు ఫలితాలలో బిహార్‌లో మొత్తం నమోదు అయిన ఓటర్ల సంఖ్యను 7.9 కోట్ల నుండి 7.24 కోట్లకు తగ్గించాయి.




# ఆడపిల్లల గురించి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలతో 'బ్యూటీ'

అంకిత్ కొయ్య,నిలఖి హీరో హీరోయిన్లుగా విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బ్యూటీ'. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా 'బ్యూటీ' మూవీని నిర్మించారు. ఈ సినిమాకు 'గీతా సుబ్రమణ్యం', 'హలో వరల్డ్', 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల కాబోతోంది.విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ మారుతి, ఎస్ కే ఎన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా ఆ ఫాదర్ ఫీలింగ్స్ని పేపర్ మీద పెట్టారని నాకు అనిపించింది. ఆ కథను నిమ్మకాయల ప్రసాద్ విన్నారు. సెప్టెంబర్ నెల బాగా కలిసి వస్తోంది. ప్రస్తుతం 'లిటిల్ హార్ట్స్' బాగా ఆడుతోంది.. 'మిరాయ్' హిట్ అయింది.. ఇప్పుడు 'బ్యూటీ' వస్తోంది.. 'ఓజీ' ఎలా ఉండోబోతోందో నాకు తెలుసు. మధ్యలో 'బ్యూటీ'ని చూడండి. ఆడపిల్లల గురించి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలతో, యథార్థ సంఘటనలతో 'బ్యూటీ' కథను రాశారు. సెప్టెంబర్ 19న థియేటర్లోకి రాబోతోంది అని అన్నారు.

ఎస్కేఎన్ మాట్లాడుతూ మామూలు టికెట్ రేట్లతో సినిమాలు వస్తే జనాలు థియేటర్లకు వస్తున్నారని సినీ పెద్దలు గుర్తించాలి. 'బ్యూటీ' కథ నాకు చాలా ఇష్టం. . సెప్టెంబర్ 19న 'బ్యూటీ' చిత్రం రాబోతోంది. 18న పెయిడ్ ప్రీమియర్లు వేస్తున్నారు. అమీర్ పేట్ ఏఏఏ లో నేను ఫ్రీ షో వేయిస్తాను. ఓ అమ్మాయి.. తన ఫ్యామిలీతో కలిసి వచ్చిన ఆ షోని చూడొచ్చు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో అంకిత్ కొయ్య, డైరెక్టర్ జె.ఎస్.ఎస్. వర్ధన్ , నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల, నటుడు వీకే నరేష్, నటి వాసుకి , హీరోయిన్ నిలఖి, నిమ్మకాయల ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బి.ఎస్ రావు, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ పాల్గొన్నారు.






## 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం భారీ షెడ్యూల్ను విజయవంతంగా ముగించింది. దీంతో పవన్ కళ్యాణ్ తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు.ఈ కీలకమైన షెడ్యూల్ను పూర్తి చేయడానికి నటీనటులు, సిబ్బందితో కలిసి దర్శకుడు హరీష్ శంకర్ అహర్నిశలు శ్రమించారు. టాకీ పార్ట్లో ఎక్కువ భాగం పూర్తి కావడం, షూటింగ్ సజావుగా సాగడం పట్ల నిర్మాతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై నెలకొన్న ఆకాశాన్ని తాకే అంచనాలను అందుకునేందుకు చిత్ర బృందం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. రాక్స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రామ్‌లక్ష్మ ణ్ ద్వయం యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. అయనంక బోస్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, నీతా లుల్లా కాస్ట్యూమ్స్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కళా దర్శకుడిగా ఆనంద్ సాయి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు.. మాస్ ప్రేక్షకులు, యాక్షన్ ప్రియులు మెచ్చేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు.పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. పార్థిబన్, కె.ఎస్. రవికుమార్, ఎల్ బి శ్రీరామ్, రాంకీ, ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్, జయ ప్రకాష్, వర్గీస్, మీర్ సర్వర్, ప్రవీణ్, టెంపర్ వంశీ, నవాబ్ షా, శ్రీరామ్, మాగంటి శ్రీనాథ్, కిల్లి క్రాంతి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

**ఈ చిత్రానికి కథనం:** కె. దశరథ్, రమేష్ రెడ్డి,
**రచనా సహకారం:** ప్రవీణ్ వర్మ, సి. చంద్రమోహన్,
**ఛాయాగ్రహణం:** అయనంక బోస్,
**కూర్పు:** కార్తీక శ్రీనివాస్. ఆర్,
**కళ:** ఆనంద్ సాయి,
**ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్:** దినేష్ నరసింహన్, హరీష్ పై,
**ఫైట్స్:** రామ్‌లక్ష్మ ణ్, నబకాంత మాస్టర్, దర్శకత్వం హరీష్ శంకర్ .






## 'యంగ్ అండ్ డైనమిక్' మూవీ ట్రైలర్ లాంచ్

టాలెంటెడ్ హీరో శ్రీ రామ్ నటిస్తున్న సినిమా 'యంగ్ అండ్ డైనమిక్'. ఈ సినిమాలో మిథున ప్రియ హీరోయిన్ గా నటిస్తోంది. పి.రత్నమ్మ సమర్పణలో శ్రీరామ్ ప్రొడక్షన్ బ్యానర్ పై శ్రీరామరాజు, లక్ష్మ ణరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిషోర్ శ్రీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న 'యంగ్ అండ్ డైనమిక్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకులు వీరశంకర్, వీఎన్ ఆదిత్య, సముద్ర ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ట్రైలర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కిషోర్ శ్రీ కృష్ణ మాట్లాడుతూ నేను దాసరి శిష్యుడిని. నా మొదటి సినిమా మైండ్ గేమ్. ఆ సినిమా హీరో శ్రీరామ్ తోనే చేశాను. ఇప్పుడు 'యంగ్ అండ్ డైనమిక్' రూపొందిస్తున్నాను. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే చిత్రమిది. ఒక రౌడీ ఊరిని ఎలా నియంత్రిస్తాడు. ఆ రౌడీ మంచివాడుగా మారితే ఊరికి కలిగే లాభమేంటి అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఈ సినిమా ఇంత బాగా రూపొందడానికి బ్రదర్ హీరో శ్రీరామ్ కారణం. త్వరలోనే చిత్రాన్ని విడుదలకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మా మూవీని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ చిన్న సినిమాకు మంచి జరగాలి, వాళ్ల కోసం రెండు మంచి మాటలు చెప్పాలనే ఇక్కడికి వచ్చాను. 'యంగ్ అండ్ డైనమిక్' ట్రైలర్ బాగుంది. ఇందులో మాస్ డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. హీరో శ్రీరామ్ ఫైట్స్ బాగా చేశారు. ఇలాంటి మాస్ చిత్రాలు ప్రేక్షకాదరణ పొందిన చరిత్ర టాలీవుడ్ కు ఎంతో ఉంది. ఈ సినిమాకు కూడా విజయం సాధించాలి. హీరో శ్రీరామ్ గారు పది చిత్రాల్లో నటించారు. 'యంగ్ అండ్ డైనమిక్' సినిమాతో హీరోగా ఆయన మరింత పేరు తెచ్చుకుంటారని ఆశిస్తున్నా. అన్నారు. డైరెక్టర్ వీరశంకర్ మాట్లాడుతూ పెద్దలు, పూజ్యులు దాసరి, రామానాయుడు చిన్న చిత్రాలను ఎంతో ఎంకరేజ్ చేసేవారు. ఎవరు చిన్న సినిమా చేస్తున్నా వారికి సపోర్ట్ చేసేవారు. ఆ గొప్ప సంప్రదాయాన్ని పాటించాలనే ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చి చిన్న చిత్రాన్ని సపోర్ట్ చేస్తున్నాను. చిన్న సినిమా బాగుంటనే ఇండస్ట్రీలో అందరికీ ఉపాధి దొరుకుతుంది. ఇండస్ట్రీ బాగుంటుంది. 'యంగ్ అండ్ డైనమిక్' చిత్ర ట్రైలర్, సాంగ్ బాగుంది. హీరోగా శ్రీరామ్ మెప్పించాడు. నిర్మాతలు మరిన్ని సినిమాలు తీసి ఇండస్ట్రీలో స్థిరపడాలి. 'యంగ్ అండ్ డైనమిక్' సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

## సినిమా నిర్మాణం ఇక సులభతరం

### షూటింగ్ కు సింగిల్ విండో అనుమతి

### ఎఫ్.డి.సి చైర్మన్ దిల్ రాజు



**హైదరాబాద్:** తెలంగాణా రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణ, సినిమాల చిత్రీకరణలకు కావాల్సిన పలు అనుమతులు, సినిమా థియేటర్ ల నిర్వహణకు పొందాల్సిన అనుమతులు, సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ సింగిల్ విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్ రూపొందిస్తోందని ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్ సైట్ 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ'పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిలిం ఇండస్ట్రీ ప్రతినిధులతో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. బేగంపేట్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన ఈ వర్క్‌షాప్‌కు తెలంగాణా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, తెలంగాణ ఎఫ్‌డిసి మేనేగింగ్ డైరెక్టర్ సిహెచ్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండి వల్లూరు క్రాంతిలతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని రకాల చేయూతనిస్తున్నారని, ఈ సదావకాశాన్ని సినీ పరిశ్రమ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వారికి వివిధ శాఖలనుండి కావాల్సిన అనుమతులు, సినీ నిర్మాణానికి సంబందించిన సాంకేతిక విభాగాలు, టెక్నీషియన్లు, హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లతో పాటు సంపూర్ణ సమాచారంతో ఈ వెబ్ సైట్ రూపొందిస్తున్నామన్నారు. ఒక విధంగా చెప్పాలంటే, ఈవిధమైన సౌలభ్యం మొట్టమొదటిసారిగా తెలంగాణలో మాత్రమే రూపొందిస్తున్నామని దిల్ రాజు అన్నారు. దీనితోపాటు, సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీఫామ్ జారీ విధానాన్ని కూడా ఆన్లైన్ ద్వారా పొందే సులభతరం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటివరకు నగరాల్లో అయితే సంబంధిత పోలీసు కమీషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారని, ఇకనుండి ఈ అనుమతులన్నింటినీ ఆన్లైన్ విధానం ద్వారా జారీచేయడానికి రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ తో చర్చించి విధి విధానాలు రూపొందించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వెబ్‌సైట్ రూపకల్పనకు సంబంధించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా చిత్ర పరిశ్ర ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఆయన కోరారు. ఈ వెబ్ సైట్ ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. .

# ఆర్‌టిసిలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి

### టిజిఎస్ ఆర్‌టిసి ఇయు ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో కార్మిక సంఘాల పునరుద్ధరణపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సిఎంరేవంత్ రెడ్డికి లేఖరాశారు. 2014లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొమ్మిది ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేసిందన్నారు. 2019 డిసెంబరులో వెల్ఫేర్ కమిటీల పేరుతో ఆర్‌టిసిలో యూనియన్ ఎన్నికలు జరపబోమని మౌఖిక ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. దీనివల్ల ఆర్‌టిసి కార్మికులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఆర్‌టిసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2024 అక్టోబర్‌లో ముఖ్యమంత్రితో జరిగిన ప్రత్యక్ష భేటీలోనూ అదే మాట ఇచ్చారని వెంకన్న తెలిపారు. ఇటీవల తొమ్మిది ఉద్యోగ సంఘాలకు గుర్తింపు తిరిగి ఇచ్చినా, ఆర్‌టిసి కార్మిక సంఘాలను మాత్రం ప్రస్తావించకపోవడం తమ మనోభావాలను దెబ్బతీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఖ ప్రతులను ఆర్థిక మంత్రి, రవాణా శాఖ మంత్రి, కార్మిక శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్యకార్యదర్శులు, కార్మిక శాఖ కమిషనర్, టిజిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించామన్నారు.

## విద్యార్థిని మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఆహారం తీసుకోలేక బలహీనంగా మారింది. సదరు ఆర్ఎంపి బాలికకు ఇంజెక్షన్ చేయడంతో వెంటనే బాలిక వాంతులు చేసుకోవడం ప్రారంభించిందని, ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా మారి శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడింది. అక్కడే ఉన్న స్థానికులు, బంధువులు బాలికకు సిపిఆర్ తదితర ప్రక్రియలు నిర్వహించారు. అయినప్పటికీ బాలిక ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో 108లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బేతవోలు సమీపంలోనే ప్రాణాలు విడిచింది. ఆసుపత్రికి చేరుకున్నాకా బాలికను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని ధృవీకరించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ విషయమై చిలుకూరు ఎస్ఐని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

గాలులు వీచే అవకాశం ఉం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు రాబోయే మూడు రోజు ల పాటు ఈదురు గాలులు, వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ము లుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వ రంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పారు. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

## ప్రభుత్వం చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి భవిష్యత్తులో కూడా ప్రతినెలా కొంత ఇవ్వాలని నిర్ణయించామన్నారు. గత టిఆర్ఎస్ దశాబ్ధకాలం ఫీజు రియంబర్స్‌మెంట్‌ను చిన్నాభిన్నం చేసి, ఫీజులను చెల్లించకుండా, ఆ ఆర్థిక భారాన్ని తమకు వారసత్వంగా అందించిందని విమర్శించారు. విచ్చిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థను, వ్యవస్థను ఒక్కొక్కటిగా బాగుచేసుకుంటూ తాము ముందుకు వెళ్తున్నామని భట్టి తెలిపారు. నాలుగేళ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వృత్తి విద్యాకళాశాలల బంద్ పాటిస్తున్న నేపథ్యంలో ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం రాత్రి చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు కళాశాల బంద్‌ను విరమించుకున్నట్టు ప్రకటించింది. సానుకూలంగా సందించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు, రేషనలైజేషన్ విషయమై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఫీజు రియంబర్స్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్తు కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత ప్రధాన్యత అంశమని తెలిపారు. మధ్యతరగతి, పేదలు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులపైన ఆర్థిక భారం పడకుండా ఆ బాధ్యతను ప్రభుత్వం తీసుకున్నదని, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, దానిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనప్పటికీ, ఇబ్బంది అవుతున్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిధులను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు.

రూ.600 కోట్ల విడుదల చేస్తామనడం హర్షణీయం

ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ తెలంగాణ హయర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఎన్. రమేష్ బాబు మాట్లాడుతూ తమ కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకున్నదన్నారు. గత పాత ప్రభుత్వ పాపాలు ప్రస్తుత ప్రభుత్వ నెత్తిన పడినప్పటికీ , తాము సమ్మెకు వెళ్లినా తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి కలమషం లేకుండా, దసరా పండుగ ముందు రూ.600కోట్లను విడుదల చేస్తామనడం పట్ల హర్శం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో సమ్మెను విరమించుకుంటున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో కూడా తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

## వ్యాఖ్యలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాల గవర్నర్ లందరూ ఆర్ఎస్ఎస్ మూలాలకు చెందిన వారిని పేర్కొన్నారు. వారంతా కేంద్రానికి తోత్తులుగా మారి రాష్ట్రాల్లో సమాంతర పాలన చేస్తూన్నారని పేర్కొన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ నేతలకు తెలంగాణ సాయూదపోరాటం పై మాట్లాడే అర్హత లేదని వ్యాఖనించారు. ఇటు స్వతంత్ర పోరాటంలోనూ వారికి ఇసుమంత పాత్ర లేదని గుర్తు చేశారు. బిజెపిల నుండి ఒక్కరైనా జైలుకు వెళ్లారా ఒక లాటి దెబ్బ తిన్నారా ఒక తూటాని ఎదుర్కొన్నారు అంటూ ఘాటుగా ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిలో తమవారు లేకపోవడం తో తమకు సంబంధం లేని వారి త్యాగాలను వాడుకుంటున్నరని, శవాలను కూడా అద్దెకు తీసుకుని తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని నారాయణ చురక లు అంటించారు.

**వక్ఫ్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం :**

వక్ఫ్ (సవరణ) చట్టంలోని అనేక కీలక నిబంధనలను నిలిపివేస్తూ (హోల్డ్ చేస్తూ) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. న్యూఢిల్లీలోని ఎపి భవన్ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మంద బలంతో చేసిన చట్టంపై సుప్రీం కోర్టు స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. సిపిఐ ముందు నుంచి ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఖరినీ ఖండిస్తూనే ఉందని, బిల్లు చట్ట రూపం పొందక ముందే జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కోరామని ఆయన గుర్తు చేశారు.అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం ప్రకారం ఒక శాతం ఉన్న ప్రజలకు కూడా మతపరమైన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు కేంద్రం ప్రభుత్వ ఏక పక్ష వైఖరికి చంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు.

**ప్రధానమంత్రి మణిపూర్ పర్యటన మోసపూరితం :**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అసోమ్, మణిపూర్ పర్యటన పూర్తిగా మోస పూరిత్తమైందని నారాయణ పేర్కొన్నారు. మణిపూర్‌లో అక్కడి సమాజం రెండు వర్గాలుగా విడిపోయి గత మూడేళ్లుగా తీవ్రమైన ఘర్షణ పడుతున్నా ప్రధాని ఏమి పట్టనట్లుగా వ్యవహరించారని అగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇప్పుడు అక్కడకి వెళ్లి అప్పటికే నిర్మాణమై, ఉపయోగం లో ఉన్న పాత భవనాలను మళ్ళీ ప్రారంభించడం తప్ప సాధించింది ఏమి లేదన్నారు.

## చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నియంత పాలన సాగిస్తున్నారని ప్రదర్శకులు నిరన తెలియజేశారు. ఈ మేరకు వారు ప్లకార్డులు, పెద్ద పెద్ద బ్యానర్లు ప్రదర్శించారు.

కాగా సోమవారం టర్కీ సుప్రీంకోర్టు ఓజుర్గ ఓజుల్‌పై దాఖలైన కేసు విచారణను వాయిదా వేసింది. ప్రధాన ప్రతిపక్ష నాయకుణ్ణి చట్టబద్ధంగా వెలివేసేందుకు ప్రభుత్వం చేసిన కుట్ర సఫలమైతే దేశంలో నియంతృత్వమే రాజ్యమేలుతుందని ప్రదర్శకులు విమర్శించారు. అవినీతికి, ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారనే పేరుతో వందలాదిమంది ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్‌పార్టీ కార్యకర్తలను ప్రభుత్వం ఇప్పటికే జైళ్ళల్లో నిర్బంధించింది. ఇలా జైలులో నిర్బంధానికి గురైనవారిలో ఇస్తాంబుల్ నగర మేయర్, దేశాధ్యక్షుడు ఎర్డొగాన్ ప్రధాన ప్రత్యర్థి ఎక్రమ్ ఇమామోగ్లూ కూడా ఉన్నారు. ఎర్డొగాన్ దాదాపు ఇరవై సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రిగా, అధ్యక్షుడుగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. 2028 వరకూ ఆయన అధ్యక్షుడుగా కొనసాగుతారు. దేశ న్యాయస్థానం ఎర్డొగాన్ ప్రభుత్వం గుప్పెట్లో నలిగిపోతోందని, దేశంలో ప్రజాస్వామ్యం నశించిందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తుండగా, ప్రభుత్వం ఈ విమర్శలను ఖండించింది. దేశంలో న్యాయవ్యవస్థ స్వంతంత్రంగా పనిచేస్తోందని పేర్కొంది. గడచిన వారం రోజులుగా ప్రజలు ఎర్డొగాన్‌కు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. ఎర్డొగాన్ రాజీనామా చేయాలని ఆదివారంనాడు తాజాగా వేలాదిమంది అంకారా వీధుల్లో నినాదాలు చేశారు. ఎర్డొగాన్ పతనం తప్పదని, ప్రతిపక్షాలు విజయం సాధిస్తాయని ఇస్తాంబుల్ కేంద్రంగా పనిచేస్తున్న బుద్ధిజీవుల సంస్థ ఇస్తాన్‌పోల్ ఇనిస్టిట్యూట్ కో–డైరెక్టర్ సెరెన్ సెల్విన్ కోర్క్‌మజ్ అన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com